సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 218

బుధవారం 30-10-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

ఆపరేషన్ కేలా మీలర్

అగ్రరాజ్యం ఘన నివాళి

- ఫ్యామిలీలో

హిట్ వికెట్!

బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్‌పై రెండేళ్ల నిషేధం విధించిన ఐసీసీ.

- స్పోర్ట్స్‌లో

వచ్చే నెలలో 3.144% డీఏ పెంపు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యం(డీఏ) పెంపు ఉత్తర్వులు నవంబర్ తొలి వారంలో వెలువడనున్నాయి. డీఏ మంజూరుకు సంబంధించిన ఫైలుపై ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగులకు అక్టోబర్ మాసానికి చెందిన జీతాల చెల్లింపు తదితర పనుల్లో బిజీగా ఉండటంతో ఉత్తర్వులు జారీ కాలేదని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో నవంబర్ తొలి వారంలో 3.144 శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు వచ్చే అవకాశాలున్నాయి. 2019 జూలై 1 నుంచి పెంపు వర్తింపజేయనున్నారు.

18న సీజేఐగా బాబ్డే ప్రమాణం

- కీలకమైన పలు కేసులను విచారిస్తున్న జస్టిస్ శరత్ అరవింద్ బాబ్డే(63) సుప్రీంకోర్టు 47వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా నియమితులు అయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జస్టిస్ బాబ్డే నవంబర్ 18వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

- వివరాలు 5లో

ముందుగానే ఇచ్చేశాం

ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిల్లేవు: ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సమ్మెపై హైకోర్టులో దాఖలైన పిటిషన్ల విచారణ రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. తాము ఆర్టీసీకి ఎలాంటి బకాయి లేమని, బకాయిల కన్నా అదనంగా రూ.622 కోట్లు గత ఆరేళ్లలో చెల్లించామని కోర్టుకు ప్రభుత్వం నివేదించింది. ఆర్టీసీ వెల్లడించింది. ఆర్టీసీ సమ్మె చట్ట విరుద్ధమని ప్రకటించాలని, సమ్మె చేసే ఉద్యోగుల డిమాండ్లలో న్యాయబద్ధమైన వాటి పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్

- అదనంగా రూ.662 కోట్లు ఇచ్చాం
- జీహెచ్ఎంసీ చెల్లించాల్సింది కూడా ఏమీ లేదు
- ఆర్థిక మాంద్యం వల్ల రూ.47 కోట్లు ఇప్పుడు ఇవ్వలేం
- ఆర్టీసీ విభజన జరగలేదు.. ఆ పని కేంద్రం చేయాలి
- హైకోర్టుకు తేల్చి చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం
- విచారణ వచ్చే నెల 1కి వాయిదా

కార్పొరేషన్‌కు బకాయిలు చెల్లించేశామని, 2014-15 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రూ.4,253.36 కోట్లు చెల్లించామని, ఇది బకాయిల కంటే అధికమని పేర్కొంది. జీహెచ్ ఎంసీ కూడా రూ.1,492 కోట్ల బకాయిల్లో రూ.335 కోట్లు చెల్లించేసిందని, ప్రభుత్వం అదనంగా చెల్లించిన నేపథ్యంలో ఆర్టీసీకి జీహెచ్ఎంసీ కూడా చెల్లించాల్సినదేమీ లేదని రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది.

కేంద్రం పరిష్కరించాలి

విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. అసలు ఆర్టీసీ విభజన జరగలేదని,

మిగతా 2వ పేజీలో ▶

నేడు ఆర్టీసీ కార్మికుల సకల జనుల సమరభేరి

హైకోర్టు సూచనలతో పరిమిత స్థాయిలో నిర్వహణ

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియానికి మారిన వేదిక
- ఐదుగురికే ప్రసంగించే అవకాశం
- శాంతియుతంగా సభ నిర్వహణపై పోలీసులకు హామీ ఇవ్వాలని అశ్వత్థామరెడ్డికి న్యాయమూర్తి ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా 25వ రోజూ కొనసాగిన నిరసనలు
- సమ్మెకు ఏపీఎస్ఆర్టీసీ సంపూర్ణ మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా బుధవారం సకల జనుల సమరభేరి పేరుతో బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సభలో విపక్ష పార్టీలన్నీ పాల్గొన బోతున్నాయి. తొలుత ఈ సభను సరూర్‌నగర్ మైదానంలో భారీ స్థాయిలో నిర్వహించాలని అనుకున్నా.. హైకోర్టు సూచనల నేపథ్యంలో పరిమితులతో కూడిన సభలాగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 వరకు సభ జరగనుంది.

స్టేడియం సామర్థ్యం ఐదు వేలే...

సకల జనుల సమరభేరి సభను దాదాపు మూడు లక్షల మందితో భారీగా నిర్వహించాలని

మిగతా 2వ పేజీలో ▶

వర్షాలు ఆగట్లేదు వ్యాధులు తగ్గట్లేదు

ప్రతి ముగ్గురిలో ఇద్దరు జ్వరపీడితులు..

డెంగీ, మలేరియా జ్వరాలతో జనం విలవిల

- ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వైరల్ ఫీవర్లు
- అక్టోబర్ పోతున్నా ఆగని వర్షాలు
- వాతావరణంలో అనూహ్య మార్పులే కారణం
- రాష్ట్రంలో విజృంభిస్తున్న దోమలు
- డెంగీ మరణాలపై అధికారుల దోబూచులు
- శీతాకాలం ప్రారంభం కావడంతో ఫ్లూ భయం
- నియంత్రణ చర్యలపై దృష్టి పెట్టని అధికారులు
- ప్రజలకు తడిసి మోపెడవుతున్న వైద్య ఖర్చు

సాక్షి, హైదరాబాద్

వర్షాలు ఆగట్లేదు. వ్యాధులు తగ్గట్లేదు. జనానికి జ్వరాల బాధలు తప్పట్లేదు. జూలైలో ప్రారంభమైన జ్వరాలు ఇప్పటికీ తగ్గట్లేదు. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడ్డారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలతో భయాందోళనకు గురవుతున్నారు. సెప్టెంబర్ చివరి నాటికే వర్షాల తీవ్రత తగ్గిపోవాలి. కానీ అక్టోబర్ నెలాఖరుకు కూడా వర్షాలతో రాష్ట్రం తడిసి ముద్దవుతోంది. ఇప్పటికీ సాయంత్రం అయిందంటే చాలు అనేకచోట్ల క్యుములోనింబస్ మేఘాలతో ఒక్కసారిగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు నవంబర్‌లోనూ కొద్ది రోజులు కొనసాగే పరిస్థితి ఉండటంతో దోమలు మరింత విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం ఇద్దరే మృతి చెందినట్లు ఆరోగ్య శాఖ చెబుతున్నా అనధికారిక సమాచారం ప్రకారం డెంగీ కారణంగా 150 మందికిపైగా చనిపోయారు. అందులో ఒక్క నిలోఫర్ ఆసుపత్రిలోనే ఏడుగురు పసి పిల్లలు డెంగీతో చనిపోయారని అక్కడి వైద్యులే ఆఫ్ ది రికార్డు సంభాషణల్లో చెబుతున్నారు. అంకెలను తక్కువ చూపిస్తూ అధికారులు ప్రభుత్వాన్ని పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దేశంలోనే డెంగీలో తెలంగాణ 2వ స్థానంలో ఉందని ఏకంగా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రకటించిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఎన్నాళ్లో బాధ..?

డెంగీ, చికున్‌గున్యా వానాకాలం సీజన్‌లో వచ్చేవి కాగా, శీతాకాలంలో స్వైన్‌ఫ్లూ పుంజుకుంటుంది. వర్షాల వల్ల వాతావరణం చల్లగా ఉండటంతో డెంగీ, స్వైన్‌ఫ్లూ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వానాకాలం, చలికాలంలో వేర్వేరుగా వచ్చే ఈ రెండు

మిగతా 2వ పేజీలో ▶

ఎవరి పంతం వారిది!

- మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై వీడని ఉత్కంఠ
- 50:50 ఒప్పందం కుదరలేదన్న ఫడ్నవిస్
- బీజేపీతో సమావేశాన్ని రద్దు చేసుకున్న ఉద్ధవ్ ఠాక్రే

-5లో

మన హయాంలో 'ఫ్రీ'గా ఇచ్చాం సార్!

ఉపాధికి ఊతం.. పరిశ్రమలు హరితం

1,500 కోట్ల పెట్టుబడి అంచనా..

35,000 మందికి ఉపాధి

438 ఎకరాల్లో దండుమల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్

- కాలుష్యరహిత పరిశ్రమలకే అనుమతి
- వాక్ టు వర్క్ ప్లేస్ పేరిట కార్మికులకు ప్రత్యేక జనావాసాలు
- తొలి దశలో సిద్ధం కానున్న 450 ఎంఎస్ఎంఈలు
- నవంబర్ 1న పార్కును ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్‌లో ప్రత్యేక పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తోంది. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య (టిఫ్) సహకారంతో రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సౌకర్యాల కల్పన సంస్థ (టీఎస్ ఐఐసీ) ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన 'గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు'ను పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కె. తారక రామారావు నవంబర్ 1న ప్రారంభించనున్నారు. దేశంలోనే తొలి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుగా అభివర్ణిస్తున్న దండుమల్కాపూర్ పారిశ్రామికవాడలో తొలి దశలో ఏర్పాటవుతున్న 450 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రెండేళ్ల వ్యవధిలో ఉత్పత్తి ప్రారంభించాలనే నిబంధన విధించారు. సుమారు రూ. 1,500 కోట్ల పెట్టుబడి అంచనాతో 35 వేల మందికి ఉపాధి కల్పించే ఈ పారిశ్రామికవాడ అనేక ప్రత్యేకతలను కలిగి ఉంటుందని తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం 438 ఎకరాల్లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయగా, భవిష్యత్తులో 1,200 ఎకరాల్లో విస్తరించేందుకు టీఎస్ఐఐసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అద్దె స్థలాల్లోనే ఎక్కువ ఎంఎస్ఎంఈలు

రాష్ట్రంలో సుమారు 25 లక్షలకుపైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ ఎంఈ) ఉండగా వాటిలో 40 శాతం పరిశ్రమలకే సొంత స్థలాలు ఉన్నట్లు అంచనా. రాష్ట్రంలోని 142 పారిశ్రామికవాడల్లో 20 శాతంలోపు మాత్రమే ఎంఎస్ఎంఈ పరిశ్రమలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత

మిగతా 2వ పేజీలో ▶

ఏడో తరగతి.. ఐటీ ఉద్యోగి

- నెలకు రూ.25 వేల జీతం.. వారంలో 3 రోజులు ఉద్యోగం.. 3 రోజులు స్కూల్

మణికొండ

ఆ విద్యార్థి వారంలో మూడు రోజులు స్కూల్‌కు వెళ్లి పాఠాలు వింటాడు.. మరో మూడు రోజులు సాఫ్ట్‌వేర్ సంస్థలో డేటా సైంటిస్ట్‌గా ఉద్యోగం చేస్తాడు. చిన్నప్పటి నుంచే తల్లి దండ్రులు ప్రోత్సహించడంతో 12 ఏళ్ల వయసులోనే ఏకంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సాధించాడు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పి.రాజ్‌కుమార్, ప్రియ క్యాప్‌జెమినీలో ఉద్యోగం చేస్తూ మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో నివసిస్తున్నారు. వారి కుమారుడు శరత్ స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో రోజూ ల్యాప్‌టాప్‌ల్లో పనిచేయటాన్ని ఆ విద్యార్థి చిన్నప్పటి నుంచి నిశితంగా గమనిస్తూ వస్తున్నాడు. దీంతో ఏడేళ్ల వయసులోనే అతడిలో కోడింగ్, జావా తదితర సాఫ్ట్‌వేర్‌లపై ఆసక్తి పెరగడంతో వాటిని నేర్చుకున్నాడు. అతడిలోని టాలెంట్‌ను గమనించిన తల్లిదండ్రులు ఐటీ ఉద్యోగిగా పనికి వస్తాడని నిర్ణయించారు. పలు ఐటీ సంస్థల ఉద్యోగాలకు దరఖాస్తు చేసి ఇంటర్వ్యూలకు వెళ్లాడు. ఇటీవల మోంటైగ్నే సంస్థలో నెలకు రూ.25 వేల గౌరవ వేతనంతో శరత్‌కు డేటా సైంటిస్ట్‌గా ఉద్యోగం దక్కింది. దాంతో పాటుగా కొన్ని రోజులు ఉద్యోగం, కొన్ని రోజులు చదువుకునేందుకు అవకాశం కల్పించేందుకు అంగీకరించారు.

మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందనలు..

12 ఏళ్ల వయసులో ఏడో తరగతి చదువుతూ డేటా సైంటిస్ట్‌గా ఉద్యోగం దక్కించుకున్న శరత్‌ను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అభినందించారు. శరత్ తల్లిదండ్రులు మంగళవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా శరత్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఉగ్రవాదాన్ని ఖండించాల్సిందే

- భారత్, సౌదీ ఉమ్మడి ప్రతిన
- సౌదీ రాజు సల్మాన్‌తో మోదీ భేటీ
- సౌదీ అరేబియాతో భారత్ స్ట్రాటెజిక్ పార్ట్‌నర్‌షిప్ కౌన్సిల్ ఒప్పందం

-5లో

క్లుప్తంగా...

నేడు ఈఆర్సీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) చైర్మన్‌గా తన్నీరు శ్రీరంగారావు, సభ్యులుగా ఎండీ మనోహర్ రాజు (టెక్నికల్), బండారు కృష్ణయ్య (ఫైనాన్స్) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు నగరంలోని ఫ్యాప్సీ భవన ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి వీరితో ప్రమాణం చేయించనున్నారు.

నేడు ఎమ్మెల్యేగా సైదిరెడ్డి ప్రమాణ స్వీకారం

సాక్షి, హైదరాబాద్: హుజూర్‌నగర్ శాసన సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన శానంపూడి సైదిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చాంబర్‌లో జరిగే ఈ కార్యక్రమంలో సైదిరెడ్డితో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసన మండలి సభ్యులు పాల్గొంటారు. హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి ఈ నెల 21వ తేదీన జరిగిన ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన శానంపూడి సైదిరెడ్డి తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పద్మావతిపై 43 వేల ఓట్లకు పైగా భారీ మెజారిటీతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

డీజీపీ కార్యాలయంలో షార్ట్‌సర్క్యూట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) కార్యాలయంలో స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో స్వల్పంగా మంటలు, పొగలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే కరెంటు సరఫరా నిలిపివేసి, కాసేపటి తరువాత తిరిగి పునరుద్ధరించారు. వైరింగ్‌లో లోపాల కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. కాగా, దీనిపై డీజీపీ కార్యాలయం ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.

రాష్ట్రానికి ఐఏఎస్ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి సి.సుదర్శన్‌రెడ్డిని రాష్ట్రానికి రిలీవ్ చేస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2002 బ్యాచ్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం కేంద్ర రక్షణ శాఖలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లో 2020 ఏప్రిల్ 26 వరకు ఆయన ఈ పోస్టులో కొనసాగాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో పదోన్నతి పొందడానికి వీలుగా ముందే రిలీవ్ చేస్తున్నట్లు సిబ్బంది వ్యవహారాల శాఖ పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి పని చేశారు.

పౌర సరఫరాల శాఖ కన్సల్టెంట్‌గా అశోక్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: పౌర సరఫరాల శాఖ కన్సల్టెంట్‌గా రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ వి.అశోక్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాఖ పరిధిలో జరుగుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం కొనుగోళ్లు తదితర ఆపరేషన్స్‌ను ఆయన పర్యవేక్షిస్తారు. దీంతో పాటు పౌర సరఫరాల శాఖ, సంబంధిత కార్పొరేషన్ మధ్య సమన్వయం చేస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏడాది పాటు ఆయన సేవలు అందించనున్నారు. ఇక జిల్లా వినియోగదారుల ఫోరంలో మహిళా సభ్యులు, ఇతర సభ్యుల నియామకాలపై రెండు ఉత్తర్వులు విడుదల చేసింది. మొత్తంగా 24 మందిని వివిధ జిల్లాల వినియోగదారుల ఫోరమ్‌లలో సభ్యులుగా నియమించింది.

ప్రకృతి చికిత్సకు ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకృతి చికిత్స తీసుకునేందుకు బెంగళూరుకు వెళ్లారు. బుధవారం నుంచి పది రోజులపాటు జిందాల్ నేచర్‌కేర్ సెంటర్‌లో బసచేసి చికిత్స పొందుతారు. గత ఏడాది డిసెంబర్ నుంచి వరుసగా వస్తున్న ఎన్నికలతో కలిగిన మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కోసమే ఆయన ప్రకృతి చికిత్సకు వెళ్తున్నారని, ప్రతియేటా ప్రకృతి చికిత్సకు వెళ్లడం ఉత్తమ్‌కు అలవాటని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

జూనియర్ కాలేజీల్లో కౌన్సెలర్లు

- విద్యార్థి ఆత్మహత్యల నివారణకు ఇంటర్ బోర్డు చర్యలు
- కాలేజీ లెక్చరర్లకు సైకాలజిస్టులతో త్వరలో శిక్షణ
- వారి ద్వారా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించేందుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు చర్యలు చేపడుతోంది. చదువులో వెనుకబడిపోతున్నామన్న ఆందోళనతో ఆత్మన్యూనతా భావానికి గురయ్యే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కసరత్తు చేస్తోంది. విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించేలా, వారికి భవిష్యత్తుపై భరోసా కల్పించేలా కౌన్సెలింగ్ ఇప్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందుకోసం విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కౌన్సెలర్లను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. బయట నుంచి కాకుండా కాలేజీల్లో బోధించే లెక్చరర్లలో ఒకరిని కౌన్సెలర్‌గా నియమించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 404 మంది లెక్చరర్లకు త్వరలోనే సైకాలజిస్టులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సైకాలజిస్టుల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన లెక్చరర్లు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గేలా కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. ముందుగా ప్రభుత్వ కాలేజీల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆ తరువాత ప్రైవేటు జూనియర్ కాలేజీల్లోనూ అమలు చేసేలా చూడాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది. సైకాలజిస్టుల ఆధ్వర్యంలో శిక్షణ పొందే లెక్చరర్లు కౌన్సెలర్లుగా నియమితులయ్యాక విద్యార్థులు ఒత్తిడి తట్టుకోవడం ఎలా అనే అంశాలతోపాటు పరీక్షల సూచనలు, సబ్జెక్టులను ఎలా గుర్తుపెట్టుకోవాలన్న దానిపై మెమరీ టిప్స్ కూడా నేర్పించనున్నారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్ విషయంలో వీడియో లెక్చర్స్‌ను విద్యార్థులకు చూపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కాలేజీల్లో కలివిడిగా ఉండని విద్యార్థులను గుర్తించి వారు చదువులో ఎలా ఉన్నారన్న అంశాలను తొలుత పరిశీలించనున్నారు. వారు కలివిడిగా ఉండకపోవడానికి కారణాలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆ తరువాత విద్యార్థులందరికీ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించనున్నారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టి బాగా చదువుకునేలా అవగాహన కల్పించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ వెల్లడించారు.

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు.. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేలా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. సెకండియర్ విద్యార్థులు ఎవరైనా ఒకవేళ ఫస్టియర్ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయితే ఆయా సబ్జెక్టుల్లో కోచింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు బాగా చదివే విద్యార్థులు ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్ అడ్వాన్స్‌డ్ వంటి పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రత్యేక కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ శిక్షణను నవంబర్ 8 లేదా 9న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే బోర్డు ప్రతి సబ్జెక్ట్‌లో స్పెషల్ కంటెంట్‌ను తయారు చేయించి వాటిని సీడీల్లో భద్రపరించింది. వాటిని త్వరలోనే అన్ని కాలేజీలకు పంపించనుంది. మరోవైపు ఆన్‌లైన్ పాఠాలను కూడా అందించే ఏర్పాట్లు చేస్తోంది. అన్ని కాలేజీల్లోని విద్యార్థులు ఒకేసారి పాఠాలు వినేలా చర్యలు చేపడుతోంది.

'తిరునక్షత్ర' మహోత్సవాలకు హాజరైన గవర్నర్

శంషాబాద్ రూరల్ (రాజేంద్రనగర్): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని జీవా ప్రాంగణంలో జరుగుతున్న శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి 'తిరునక్షత్ర'మహోత్సవాలకు మంగళవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యారు. ఆశ్రమంలో చినజీయర్ స్వామిని కలిసి పండ్లు, కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దజీయర్ స్వామిపై రూపొందించిన 'సత్య సంకల్ప'గ్రంథాన్ని జీయర్ స్వామి గవర్నర్‌కు అందజేశారు. గ్రంథంలోని ఘట్టాలను ఆమెకు వివరించారు. శ్రీ రామానుజ సహస్రాబ్ది ప్రాజెక్టు 'సమతాస్ఫూర్తి'కేంద్రం విశేషాలను గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ దంపతులకు జీయర్ స్వామి మంగళశాసనాలు అందజేశారు.

ఉపాధికి ఊతం.. పరిశ్రమలు హరితం

▶ మొదటి పేజీ తరువాయి

ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్రంలో ప్రత్యేక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిఫ్ కోరింది. ఈ నేపథ్యంలో దండుమల్కాపూర్‌లో తొలి దశలో 371 ఎకరాలు, రెండో దశలో 67 ఎకరాలు కలుపుకొని మొత్తంగా 438 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఎకరాకు రూ. 14 లక్షల చొప్పున టిఫ్‌కు కేటాయించింది. ఇందులో పరిశ్రమల ఏర్పాటుకు హైదరాబాద్‌తోపాటు పొరుగు జిల్లాల నుంచి 1,200 మంది దరఖాస్తు చేసుకోగా తొలి విడతలో 450 మందికి ప్లాట్లు కేటాయించారు. టిఫ్ సమర్పించిన నివేదికను అనుసరించి పారిశ్రామిక పార్కులో మౌలిక సౌకర్యాల కల్పన ప్రణాళికను రూపొందించారు. పారిశ్రామిక పార్కుకు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని అనుసంధానిస్తూ 2.5 కిలోమీటర్ల పొడవైన అప్రోచ్ రోడ్డుతోపాటు రోడ్లు, మురుగునీటి, వర్షపునీటి కాలువలు, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాలను అభివృద్ధి చేశారు. అప్రోచ్ రోడ్డును 100 అడుగుల వెడల్పుతో నిర్మించారు. బాహ్య మౌలిక సౌకర్యాల కల్పనకు టీఎస్ఐఐసీ రూ. 35 కోట్లు, అంతర్గత మౌలిక సౌకర్యాల కల్పనకు టిఫ్ రూ. 150 కోట్ల మేర ఖర్చు చేశాయి.

పార్కులో ఏర్పాటయ్యే పరిశ్రమలు

- ఎలక్ట్రికల్
- ఎలక్ట్రానిక్స్
- వైమానిక రంగం
- ఆహార శుద్ధి
- డ్రిల్లింగ్
- రక్షణ రంగం

సకల సౌకర్యాలు...

రెడ్ కేటగిరీకి చెందిన కాలుష్యకారక పరిశ్రమలకు ఈ పార్కులో అనుమతి ఇవ్వకూడదని నిర్ణయించడంతోపాటు గ్రీన్ కేటగిరీ పరిశ్రమలనే ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం మురుగు నీటి, వాననీటి కాలువలు, సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా పార్కుకు నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక పైపులైన్లు నిర్మించారు. భవిష్యత్తులో ఉమ్మడి సౌకర్యాల కేంద్రం, పోలీసు స్టేషన్, అగ్నిమాపక కేంద్రం, ట్రక్ టర్మినల్, బ్యాంకులు, ఏటీఎంలు, పోస్టాఫీసు ఏర్పాటు చేయనున్నారు. పార్కులో వివిధ సంస్థలు తయారు చేసే పారిశ్రామిక ఉత్పత్తులతో కూడిన ప్రదర్శనశాల ఏర్పాటు చేయడంతోపాటు 'మల్టీ ప్రోడక్ట్' మార్కెటింగ్‌కు సంబంధించి మెళకువలపై పారిశ్రామికవేత్తలకు శిక్షణ, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారు.

పార్కులోనే టౌన్‌షిప్‌లు...

'వాక్ టు వర్క్ ప్లేస్' నినాదంతో పారిశ్రామిక పార్కులో సమీకృత జనావాసాలు (ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లు) నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం టీఎస్ఐపాస్‌తోపాటు నూతన మున్సిపల్ చట్టం నిబంధనల మేరకు పారిశ్రామికవాడల్లోనే టౌన్‌షిప్‌లు నిర్మించే యోచనకు దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ గ్రీన్ పార్కులో శ్రీకారం చుడుతున్నారు. దండుమల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును 1,242.36 ఎకరాల్లో అభివృద్ధి చేయాలని టీఎస్ఐఐసీ ప్రతిపాదించగా ఇప్పటివరకు 1,087 ఎకరాల భూసేకరణ పూర్తయింది. మరో 155 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా పారిశ్రామికవేత్తల నుంచి వస్తున్న ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని మరో 700 ఎకరాల భూసేకరణకు అనుమతి ఇవ్వాలని టీఎస్ఐఐసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాక గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కును దశలవారీగా అభివృద్ధి చేసేందుకు టీఎస్ఐఐసీ ప్రణాళికలు రచిస్తోంది.

దేశంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కు

భారీ పరిశ్రమలకు దీటుగా ఎంఎస్ఎంఈ పరిశ్రమలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. టిఫ్ అభ్యర్థన మేరకు రెండేళ్ల క్రితం ప్రారంభమైన దండుమల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. రాబోయే రోజుల్లో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు టీఎస్ఐఐసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ దండుమల్కాపూర్ పార్కు ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

– గ్యాదరి బాలమల్లు, టీఎస్ఐఐసీ చైర్మన్

కాలుష్యరహిత పరిశ్రమలకే చోటు

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో కాలుష్యరహిత పరిశ్రమలకే అనుమతి ఇస్తాం. పార్కులో పరిశ్రమల స్థాపనకు అనేక మంది ముందుకు వస్తుండటంతో ప్లాట్ల కోసం పోటీ ఏర్పడింది. రద్దీని తట్టుకునేందుకు మొత్తంగా 2 వేల ఎకరాల భూసేకరణ దిశగా టీఎస్ఐఐసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుతో రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమల దశ, దిశ పూర్తిగా మారిపోతుంది. ప్రభుత్వం నుంచి ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు లభిస్తున్న ప్రోత్సాహం స్ఫూర్తిదాయకంగా ఉంది. అతి తక్కువ ధరలో పరిశ్రమల యజమానులకు ఇక్కడ ప్లాట్లు కేటాయించాం. చదరపు గజం ధర రూ. 1,600 లోపే ఉంది.

– కొండవీటి సుధీర్‌రెడ్డి, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు

ముందుగానే ఇచ్చేశాం

▶ మొదటి పేజీ తరువాయి

ఆస్తులు, అప్పులను తెలంగాణ, ఏపీలకు పంపకాల వంటి ఇతర సమస్యలను కేంద్రం పరిష్కరించాల్సి ఉందని, ఆర్టీసీలో 31 శాతం వాటా కేంద్రానికి కూడా ఉందని చెప్పింది. దీంతో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ముందుగానే రీయింబర్స్‌మెంట్ చేస్తున్నట్లు ఆర్టీసీకి తెలిపారా.. ఇవ్వాల్సింది లేదని కూడా చెప్పారా లేదా అని ప్రశ్నించింది. ముందుగానే డబ్బులు ఇచ్చేశామని ప్రభుత్వం ఇప్పుడు చెబుతున్నందున ఆర్టీసీకి బకాయిలు రావాల్సినవి ఉన్నాయో లేదో, ఉంటే ఎంత బకాయిలు రావాలో తెలియజేయాలని ఆర్టీసీ ఎండీని కోర్టు ఆదేశించింది.

ఆర్టీసీ విభజన కాలేదు..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 9వ షెడ్యూల్ ప్రకారం ఆర్టీసీ ఇప్పటికీ ఉమ్మడిగానే ఉందని, ఈ వ్యవహారం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని ఏజీ చెప్పారు. 'జనాభా నిష్పత్తి ప్రకారం తెలంగాణకు 42 శాతం, ఏపీకి 58 శాతం బకాయిల చెల్లింపులకు అడ్డుంకులు ఏమున్నాయి. ఐదేళ్లుగా కేంద్రం వద్ద ఈ సమస్యను పరిష్కరించుకోకుండా ఏం చేస్తున్నారు' అని ధర్మాసనం ప్రశ్నించింది. సోమవారమే దీనిపై కేంద్రానికి లేఖ రాశామని ఏజీ జవాబు చెప్పారు. దీంతో ధర్మాసనం కేంద్రాన్ని కూడా ప్రతివాదిగా చేసింది. ఈ విషయంలో కేంద్ర వైఖరి తెలపాలని ఆదేశించింది. తదుపరి విచారణ నవంబర్ 1న జరుపుతామని పేర్కొంది.

ఆంకెలాట ఆడుతున్నట్లు ఉంది..

ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లోని అంశాల్ని పరిశీలించిన ధర్మాసనం.. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి అంకెలాట ఆడుతున్నట్లు అనిపిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బకాయిలు చెల్లించామని చెబుతున్నారే గానీ, బకాయి ఏమీ లేదని చెప్పట్లేదని తప్పుపట్టింది. ఇందుకు ఏజీ బదులిస్తూ.. పూర్తి వివరాలిచ్చేందుకు రెండు రోజుల సమయం కావాలంటే హైకోర్టు ఇవ్వలేదని చెప్పారు. 'ల్యాప్‌టాప్ క్లిక్ చేస్తే పూర్తి వివరాలు అందించే ఈ రోజుల్లో ఆర్టీసీకి ఎంత మేరకు బకాయిలు చెల్లించాలో చెప్పడానికి అంత సమయం ఎందుకు? రూ.4,253 కోట్లు చెల్లించామని చెబుతున్నారు. అందులో రూ.850 కోట్లు ఆర్టీసీ అప్పు తీసుకునేందుకు ప్రభుత్వం గ్యారెంటీగా ఉండటాన్ని కూడా డబ్బు ఇచ్చినట్లు ఎలా చెబుతారు? ఆర్టీసీకి అప్పు పుట్టేందుకు ప్రభుత్వం గ్యారెంటీగా ఉంటుంది. ఆ అప్పుపై వడ్డీలో కూడా ఒక్క రూపాయి ప్రభుత్వం చెల్లించదు. అలాంటప్పుడు గ్యారంటీగా ఉన్న మొత్తాన్ని కూడా ఆర్టీసీకి ఇచ్చామని ఎలా చెబుతారు? ఎప్పుడో డబ్బులిచ్చి 2018–19లో చెల్లించాల్సినవి కూడా ఇచ్చామని ఎలా చెబుతారు'అని హైకోర్టు ప్రశ్నలు సంధించింది. ప్రజాహితంతో అధికారులు వివరాలిచ్చారని ఏజీ చెప్పగానే.. ధర్మాసనం స్పందిస్తూ.. 'వివరాలన్నీ వేగ్‌గా ఉన్నాయి. క్లిస్టర్ క్లియర్‌గా లేనేలేవు. సూటిగా చెప్పే ప్రయత్నమే కనబడలేదు'అంటూ వ్యాఖ్యానించింది.

బడ్జెట్ లెక్కలు చెప్పండి

'బడ్జెట్‌లో ఆర్టీసీకి 2013–2019 సంవత్సరాలకు ఎంత కేటాయించారు? తాజా బడ్జెట్ ఎంత.. ఇప్పటి వరకు ఎంత విడుదల చేశారు. ఇంకా ఎంత బడ్జెట్ విడుదల చేయాల్సి ఉందో తెలపండి. ఆర్టీసీ యూనియన్ల ప్రధాన 4 డిమాండ్ల పరిష్కారానికి అవసరమైన రూ.47 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తుందో లేదో కూడా స్పష్టం చేయాలి'అని కోర్టు పేర్కొనగా.. ఆర్థికమాంద్యం నేపథ్యంలో రూ.47 కోట్లు విడుదల చేసేందుకు సమయం కావాలని ఏజీ చెప్పారు. దీంతో ధర్మాసనం వెంటనే స్పందిస్తూ.. 'ఇటీవల జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ఫలితాల తర్వాత ఆ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులకు రూ.47 కోట్లు ఇవ్వాలంటే ఆర్థిక మాంద్యమని చెబుతున్నారు. విద్య, వైద్యం, సంక్షేమ కార్యక్రమాలకే ఆదాయం సరిపోతోందని ప్రభుత్వం చెబుతోంది. మరి ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఆర్టీసీ లేదా' అని ప్రశ్నించింది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఆర్టీసీకి బడ్జెట్‌లో కేటాయించిన రూ.550 కోట్లకు రూ.425 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని, మిగిలిన రూ.125 కోట్లు వచ్చే మార్చిలోగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటోందని ఏజీ చెప్పారు.

ఊసరవెల్లి రంగులు మార్చినట్లు..

పిటిషనర్ తరపు న్యాయవాది కృష్ణయ్య వాదనలు వినిపిస్తూ.. ఆర్టీసీ సమ్మె చట్ట విరుద్ధమని ప్రకటించాలని, ఆర్టీసీ కార్మికులు విధుల్లో చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలని పలుసార్లు కోరారు. సమ్మె చట్ట విరుద్ధమంటూనే, ఆర్టీసీ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నారంటూ పరస్పర విరుద్ధంగా చెప్పడం ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. సమ్మె విరమించాలని ఆదేశిస్తే కార్మికులు ఏం చేస్తారో.. సమ్మె చట్ట విరుద్ధమంటే ఏమవుతుందో కూడా ఆలోచించాలని హితవు పలికింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనపై ఆర్టీసీ వైఖరిని తెలిపేందుకు సోమవారం వరకు గడువు కావాలని ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ శ్రీనివాసన్ అయ్యంగార్ కోరగా అందుకు ధర్మాసనం అంగీకరించలేదు.

కానుకకు జవాబుదారీ ఉంటుందా?

ఆర్టీసీ బకాయిలు ముందుగానే చెల్లించేశామని ప్రభుత్వం చెప్పడంతో ఆ విషయాన్ని ముందుగానే కార్పొరేషన్‌కు చెప్పారా అని ప్రశ్నిస్తూ 'మీకు నేను రూ.3 లక్షలు అప్పు ఉన్నాను. మీ కుమార్తె వివాహానికి నేను అప్పుతో కలిపి ప్రేమతో రూ.5 లక్షలు ఇచ్చాను. అప్పు పోను మిగిలిన రూ.2 లక్షలు కానుక అనుకుంటారు కదా? మరి ఆ రూ.2 లక్షలకు ఇప్పుడు మీరు జవాబుదారీ అని నేను అంటే ఎలా? అని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన జవాబు రాలేదు.

నేడు ఆర్టీసీ కార్మికుల సకల జనుల సమరభేరి

▶ మొదటి పేజీ తరువాయి

జేఏసీ తొలుత నిర్ణయించింది. వీరిలో దాదాపు లక్షన్నర మంది కార్మికుల కుటుంబ సభ్యులే ఉంటారని అంచనా వేసింది. మరో లక్షన్నర మందిని రాజకీయ పార్టీల సహకారంతో సమీకరించాలని భావించి అన్ని విపక్షాలతో సమావేశమై ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. సమ్మెకు విపక్షాలన్నీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుండటంతో, జనసమీకరణకు ఆయా పార్టీలన్నీ హామీ కూడా ఇచ్చాయి. సరూర్‌నగర్ మైదానంలో సభకు ప్రణాళిక సిద్ధం చేసుకుని అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ సభకు అనుమతి ఇవ్వలేమని పోలీసులు చెప్పడంతో మంగళవారం జేఏసీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇవ్వడంతో వేదికను ఇండోర్ స్టేడియంలోకి మార్చాల్సి వచ్చింది. ఈ స్టేడియం సామర్థ్యం ఐదు వేలు మాత్రమే కావడంతో జనసమీకరణ కసరత్తును విరమించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉధృతంగా నిరసనలు..

హైకోర్టు వ్యాఖ్యలతో కార్మికుల్లో ఉత్సాహం పెరిగింది. దీంతో గత రెండు రోజులుగా వారు నిరసనల హోరు పెంచారు. మంగళవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, విపక్షాల కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనలు నిర్వహించారు. మరోవైపు ఆర్టీసీ పరిరక్షణ, హక్కుల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేస్తున్నది వీరోచిత పోరాటమని ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ కొనియాడింది. వారి పోరాటానికి ఏపీఎస్ఆర్టీసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

సభకు షరతులతో హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ జేఏసీ బుధవారం తలపెట్టిన సభకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. ఇందుకు అనుగుణంగా అనుమతివ్వాలని పోలీసులను ఆదేశించింది. సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆర్టీసీ జేఏసీ ఈనెల 24న పోలీసులకు దరఖాస్తు చేసుకుంది. అయితే, పోలీసుల నుంచి అనుమతి రాకపోవడంతో జేఏసీ నేతలు మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ టి.వినోద్‌కుమార్ షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సాయంత్రం 3 నుంచి 6 గంటల మధ్య సభ నిర్వహించి, 7 గంటల కల్లా ఖాళీ చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుతంగా నిర్వహిస్తామని పోలీసులకు జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి హామీ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. గుంపులుగా కాకుండా, నలుగురికి మించకుండా సభకు వెళ్లి, తిరిగి రావాలని, ఎలాంటి ఊరేగింపులు నిర్వహించొద్దని స్పష్టంచేశారు. అలాగే సభలో ప్రసంగించే వారి సంఖ్యను ఐదుగురికి పరిమితం చేయాలని పేర్కొన్నారు. మరో ఒకరిద్దరికి అవకాశం ఇవ్వొచ్చని, ప్రసంగించే వారి పేర్లను పోలీసులకు ముందుగానే ఇవ్వాలని సూచించారు. సభలో ఎలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని, ఐదువేల మందికి మించి ఇందులో పాల్గొనవద్దని ఆదేశించారు. సీసీటీవీల వినియోగానికి, పోలీసులు

బాబ్లీ గేట్ల మూసివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన 80 కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మంగళవారం మూసి వేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం త్రిసభ్య కమిటీ పర్యవేక్షణలో గేట్లు మూసి వేయడంతో ఎగువ ప్రాంతాల నుంచి ఎస్సారెస్పీకి వచ్చే వరదలకు బ్రేకు పడింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జూలై 1న బాబ్లీ గేట్లు ఎత్తి అక్టోబర్ 29న మూసి వేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం వరకు ఒక్కొక్కటి మూసి

ఎస్సారెస్పీకి వరద తగ్గుముఖం

వేశారు. తెలంగాణ తరఫున ఎస్సారెస్పీ ఈఈ రామారావు, డీఈఈ జగదీశ్, సీడబ్ల్యూసీ తరఫున ఈఈ గంగాధర్, మహారాష్ట్ర నుంచి నాందేడ్ ఈఈ ఎన్‌పీ గవానే, ఏపీ తరఫున ఈఈ మోహన్‌రావు తదితరులు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు.

ఎస్సారెస్పీ గేట్ల మూత

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో మంగళవారం మధ్యాహ్నం వరద గేట్లను మూసి వేశారు. వారం నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగడంతో ఎస్సారెస్పీ వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలిన సంగతి తెలిసిందే. మంగళవారం వరద తగ్గుముఖం పట్టడంతో ఉదయం నుంచి గేట్లను మూసి వేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి 16 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, కాకతీయ కాలువ ద్వారా 5,500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500, మిషన్ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాలకు 142 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా, విద్యుదుత్పత్తి కొనసాగుతోంది.

బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మూసి వేసిన దృశ్యం

క్లుప్తంగా...

కామారెడ్డిలో పిడుగుల వాన

- వీఆర్ఏ మృతి
- దెబ్బతిన్న ఇళ్లు

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/రాజంపేట: కామారెడ్డి జిల్లాలో సోమవారం రాత్రి పిడుగుల వాన పడింది. పిడుగుపాటుకు ఓ వీఆర్ఏ మృతి చెందగా.. పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన వీఆర్ఏ మంద లచ్చయ్య (41) గ్రామ శివారులోని తన పొంలో పిడుగుపాటుకు బలయ్యాడు. అలాగే.. ఎల్లారెడిలోని ఏఎస్సై వినయ్‌కుమార్ ఇంటిపై పిడుగు పడటంతో కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. తిమ్మారెడ్డి గ్రామంలో ఓ ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్‌తో పాటు విద్యుత్ తీగలు దగ్ధమయ్యాయి. ఇదే గ్రామంలో ఇంటి పైకప్పు నేల కూలింది. రాజంపేట మండలం సిద్ధాపూర్‌లో కొబ్బరి చెట్టు కాలిపోయింది.

ఐఐటీలో విద్యార్థి ఆత్మహత్య

సంగారెడ్డి రూరల్/కూకట్‌పల్లి: సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రం శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఓ విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నిజాంపేటలోని ఈశ్వర్ విల్లాస్‌లో నివాసం ఉండే శ్రీనివాస్ పెద్ద కుమారుడు సిద్ధార్థ్ (20) హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున అతడు ఉం టున్న హాస్టల్ భవనం మూడో అంతస్తు పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అం తకుముందు తన మిత్రుడికి సూసైడ్ నోట్‌ను ఈ మెయిల్ ద్వారా పంపించాడు. మరోవైపు మార్కులు తక్కువ రావడంతో కలత చెందిన సిద్ధార్థ్ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సైల్ ప్రయోగ కేంద్రంపై ప్రజాభిప్రాయ సేకరణ

వ్యతిరేకించిన గిరిజనులు, అఖిలపక్ష నాయకులు

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండలో మిస్సైల్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుపై గిరిజనులు, అఖిలపక్ష నాయకులు వ్యతిరేకించారు. భారత డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), రెవెన్యూ అధికారులు ఐదుదొనాల తండా గిరిజనుల అభిప్రాయ సేకరణ నిమిత్తం మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దీనికి గిరిజనులు, అఖిలపక్ష నాయకులు హాజరుకాగా.. మిస్సైల్ ప్రయోగ కేంద్రం వద్దని వారు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. తరాలు గా అడవిని నమ్ముకొని జీవిస్తున్నామని, తమ పొట్టకొట్టొద్దని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బీడీఎల్ డైరెక్టర్ రాధాకృష్ణ, జీఎం శ్రీనివాస్‌లు గిరిజనులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రైతుల భూములు తీసుకొవడం లేదని, అటవీ భూములను తీసుకుంటున్నామని, అది 125 ఎకరాలు మాత్రమేనని తెలిపారు. గిరిజనులకు, చుట్టుపక్కల వారికి ఎలాంటి నష్టమూ జరగదని చెప్పారు. అధికారులు గోబ్యాక్ అంటూ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు.

'నేతకాని' బతుకమ్మ వేడుకలు

వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్తులు మంగళవారం బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. దీపావళి పండుగ మొదలుకుని మూడు రోజుల పాటు ఇక్కడ బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. చివరి రోజు భారీ ప్రదర్శన నిర్వహించారు. బతుకమ్మలను ఎత్తుకుని భక్తి పాటలు పాడుతూ ముందుకు సాగారు. చెరువు కట్టపై బతుకమ్మలను పేర్చి ఆటలాడారు. అనంతరం నిమజ్జనం చేశారు. కాగా, 200 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నేతకాని కులస్తులు తెలిపారు.

హసన్‌పర్తి

యువత కోసమే శిక్షణా కేంద్రాలు

యాదగిరిగుట్ట: నిరుద్యోగ యువతకు తగిన నైపుణ్యాలు అందించడమే కాకుండా జంట నగరాల్లో పనిచేస్తున్న సెట్విన్ లాంటి శిక్షణా కేంద్రాల్లో ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందని టూరిజం, యువజన సర్వీసులు, ఎక్సైజ్, పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ప్రభుత్వ విప్ గొంగిడి సునితా మహేందర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని పాత జిల్లాలో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాలను ఏర్పాటు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు సుమారు 22 కోర్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ప్రదానంగా ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులు, ఎయిర్ కండిషనింగ్, మొబైల్ సర్వీసింగ్, సీసీటీవీ, డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్, సోలార్ టెక్నిషియన్ వంటి తదితర కోర్సులు ఉంటాయన్నారు. మొదటి దశలో మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో భాగంగానే యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి రూ.25 లక్షల వ్యయంతో యాదగిరిగుట్టలో 5 వృత్తులతో శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. యాదాద్రికి దగ్గర్లో ఉన్న బస్వాపూర్ రిజర్వాయర్ వద్ద మరింత అభివృద్ధికి ఆ ప్రాంతంలో 90 ఎకరాల భూమిని సేకరించినట్లు చెప్పారు. ఇక్కడి ప్రాంతం టూరిజం స్పాట్‌గా మార్చేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే బస్వాపూర్ వద్ద ఎలాంటి అభివృద్ధి చేయాలనే అంశాలపై సీఎం కేసీఆర్, పర్యాటక శాఖ అధికారులతో చర్చిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ క్షీరాభిషేకం చేశారు.

కారంపొడి చల్లి.. రాళ్లతో దాడి

- అటవీ అధికారులపై గిరిజన కుటుంబం దాష్టీకం
- బీట్ అధికారికి గాయాలు
- ప్రతిఘటించి తరిమివేసిన అటవీ అధికారులు

బెల్లంపల్లి: రిజర్వ్ ఫారెస్టు భూమిని సాగు చేస్తున్నారని అడ్డుకోబోయిన అటవీశాఖ అధికారులపై ఓ గిరిజన కుటుంబం కారంపొడి చల్లి రాళ్లతో దాడికి పాల్పడింది. ఈ దాడిలో ఓ ఫారెస్టు బీట్ అధికారి చేతికి, మెడకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధి కుశ్నపల్లి రేంజ్ రెబ్బెన బీట్ పరిధిలో చోటుచేసుకుంది. కుశ్నపల్లి డిప్యూటీ ఎఫ్ ఆర్వో కల్పనాదేవి కథనం ప్రకారం.. రెబ్బెన బీట్ పరిధిలోని కొంత భూమిని బాలూనాయక్ కుటుంబం సాగు చేస్తోంది. రిజర్వ్ ఫారెస్టు భూమిలో బాలూనాయక్ కుటుంబం నాటిన మొక్కలను అధికారులు తొలగించి అటవీ భూమిలో అడుగు పెట్టొద్దని హెచ్చరించారు. అయితే మళ్లీ మంగళవారం ఆ కుటుంబం మొక్కలు నాటుతున్నట్లు అందిన సమాచారంతో కుశ్నపల్లి ఎఫ్ఆర్వో గోవిందసింగ్ సర్దార్, పలువురు డిప్యూటీ ఎఫ్ఆర్వోలు, ఫారెస్టు బీట్ అధికారులతో ఘటనాస్థలికి చేరుకుని

స్వప్నను పరామర్శిస్తున్న అటవీ అధికారులు

మొక్కలు నాటొద్దని మరోసారి హెచ్చరించారు. అయితే ఆ భూమి తమదేనని బాలూనాయక్ కుటుంబం అధికారులతో ఘర్షణకు దిగింది. ముందే అనుకొని తెచ్చుకున్న కారంపొడిని అధికారులపై చల్లి రాళ్లతో దాడి చేశారు. అడ్డుకోబోయిన రెబ్బెన ఫారెస్టు బీట్ అధికారి స్వప్నపై బాలూనాయక్ భార్య దాడి చేయగా ఆమెకు ఎడమ చేయి, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. తేరుకున్న అధికారులు ప్రతిఘటించి బాలూనాయక్ కుటుంబాన్ని గ్రామ పొలిమేరలదాకా తరిమారు. ఈ ఘటనపై అటవీ అధికారులు నెన్నెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయపడిన ఫారెస్టు బీట్ అధికారి స్వప్నను చికిత్స కోసం బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తళుక్కుమన్న తెల్లబంగారం

కొత్త పత్తితో ఏనుమాముల మార్కెట్ కళకళ

- ప్రారంభ ధర క్వింటాలుకు రూ. 5,111

వరంగల్: ఈ ఏడాది కొత్త పత్తి సీజన్ ప్రారంభమైంది. పండుగల అనంతరం వరంగల్ ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్ యార్డు మంగళవారం కొత్త పత్తితో కళకళలాడింది. పెద్ద ఎత్తున పత్తిని విక్రయించేందుకు రైతులు రావడంతో చాంబర్ ఆఫ్ కామర్స్, కాటన్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు మార్కెట్‌కు తరలివచ్చారు. మార్కెట్‌కు వచ్చిన కొత్తపత్తికి రైతులు, ఆడ్తిదారులు, కమీషన్‌దారులు పూజలు నిర్వహించాక వేలం పాడారు. తొలి పాటను కవితా కాటన్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు క్వింటాలుకు రూ.5,111 చెల్లించి కొనుగోలు చేశారు. మొదటి రోజున 6,943 బస్తాల పత్తి వచ్చిందని అధికారులు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తికి మద్దతు ధర రూ.5,550–రూ. 5,450 వరకు ప్రకటించగా దాదాపు అదే ధర మార్కెట్‌లో పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డెంగీ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలి
- మానవ హక్కుల వేదిక డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డెంగీ మరణాలకు పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. డెంగీ నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోవడంతో మరణాలు పెరిగాయని తెలిపింది. డెంగీతో మరణించిన మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ రకాల సీజనల్ వ్యాధులు, డెంగీ కారణంగా చనిపోయిన కుటుంబాలను కలసి వివరాలు సేకరించినట్లు చెప్పింది. ఈ మేరకు మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్. జీవన్‌కుమార్, వేమన వసంతలక్ష్మి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

గిరిజనులకు రిజర్వేషన్లు పెంచాలి

పలు రాజకీయ పార్టీల నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన గిరిజనులకు రిజర్వేషన్లు 12 శాతానికి పెంచాలని పలు రాజకీయ పార్టీల నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారం, రిజర్వేషన్‌ల అమలుతో పాటు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గిరిజనుల హక్కుల సాధన కోసం తెలంగాణ గిరిజన లంబాడీ జాక్ (టీజీఎల్ జేఏసీ) ఆధ్వర్యంలో డిసెంబర్ 8న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టిన 'లంబాడోళ్ల తడాఖా'తెలంగాణ గిరిజన లంబాడీ మహాసంగ్రామ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ, బీజేపీ నేత వివేక్ వెంకటస్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ తదితరులు కలిసి ఆవిష్కరించారు.

పరిష్కారంకాని డిమాండ్లపై కమిటీ వేయాలి

సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులకు సంబంధించి పరిష్కారంకాని డిమాండ్లు, అంశాలపై ప్రభుత్వపరంగా కమిటీని వేసి పరిశీలించాలని సీపీఐ సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావంతో పాటు రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు తన నిరవధిక దీక్షను కొనసాగించనున్నట్లు 'సాక్షి'కి వెల్లడించారు. సీఎంగా తాను ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టిన రాజ్యాంగంపై కేసీఆర్‌కు గౌరవముంటే చర్చల ద్వారా ఆర్టీసీ సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిమ్స్ ఆస్పత్రిలో నాల్గవ రోజు దీక్షను కొనసాగిస్తున్న ఆయన సాక్షితో మాట్లాడుతూ హైకోర్టు చేసిన సూచనలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి సమ్మె ద్వారా ఏర్పడిన ప్రతిష్టంభనను దూరం చేయాలని కోరారు.

సేల్ ఇన్ ఇండియాగా మారింది

ఏఐసీసీ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్

సాక్షి, హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేస్తున్నారని, ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేలా ఆయన ఒప్పందాలు చేసుకుంటున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ దుయ్యబట్టారు. మేకిన్ ఇండియా నినాదం ఇప్పుడు సేల్ ఇన్ ఇండియాగా మారిందని, చైనా వస్తువులు విచ్చలవిడిగా దేశీయ మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయని ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్, అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు ప్రస్తుతం నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్యూటీ ఫ్రీ విధానం వల్ల భారతదేశ రైతులకు, వ్యాపారులకు నష్టమని, ఇండియా, చైనాల మధ్య ఒప్పందాలపై ఇంతవరకూ అధికారికంగా కేంద్రం ఎలాంటి ప్రకటన చేయలేదని చెప్పారు.

జర్మనీ చేరుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం జర్మనీ చేరుకున్నారు. తెలంగాణ విత్తన రంగ అభివృద్ధి కోసం ఆయన నేతృత్వంలో వెళ్లిన బృందానికి బెర్లిన్ విమానాశ్రయంలో జర్మనీ ప్రతినిధులు సాదరస్వాగతం పలికారు. ఇండో-జర్మన్ విత్తన రంగ సహకార ప్రాజెక్ట్ ద్వారా జర్మనీ ఆహార, వ్యవసాయ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ బృందం పర్యటనకు వెళ్లింది. నవంబర్ 6 వరకు ఎనిమిది రోజుల పాటు జర్మనీ, నెదర్లాండ్స్ దేశాల్లో పర్యటించనుంది. విత్తన రంగ అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ, వ్యవసాయ రంగ పథకాలు, సహకార సంఘాల వ్యవస్థ, పంటల సాగు విధానాలపై అధ్యయనం చేయనుంది. ఈ బృందంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చెన్నమనేని రమేశ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, డైరెక్టర్ కేశవులు ఉన్నారు.

చెన్నమనేని, ఆదిలకు హోంశాఖ నోటీసులు

రేపు వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలు ఎదుర్కొంటున్న వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఈ నెల 31న సాయంత్రం 4 గంటలకు వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని వారిద్దరికీ కేంద్ర హోంశాఖ నోటీసులు జారీ చేసింది. డాక్టర్ రమేష్ చెన్నమనేని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో తెలంగాణ హైకోర్టు జూలై 10న ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత చెన్నమనేని నుంచి రాతపూర్వక అభ్యర్థన వచ్చిందని, ఈ నేపథ్యంలో ఇరుపక్షాలకు వ్యక్తిగత విచారణకు అవకాశం కల్పిస్తున్నట్టు హోంశాఖ ఈ నోటీసులో పేర్కొంది. చెన్నమనేని రమేష్, ఆది శ్రీనివాస్ ఇద్దరూ తమ వద్ద ఉన్న సాక్ష్యాధారాలతో ఈ విచారణకు రావాలని పేర్కొంది. విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావొచ్చని, లేదా తమ తరపు న్యాయవాదిని పెట్టుకోవచ్చని, ఒకవేళ హాజరు కాని పక్షంలో అందుబాటులో ఉన్న ఆధారాలతో కేసును పరిష్కరిస్తామని హోంశాఖ ఆ నోటీసులో పేర్కొంది.

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, పి.ఆర్.రీజియన్, కరీంనగర్
ఇ-ప్రాక్యూర్‌మెంట్ నోటీసు

e-Proc. Notice No.15-17/SE/2BHK/Tenders/2019-20 తేది:26.10.2019

పనుల సంఖ్య (3), పని పేరు: కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో (30) 2-బెడ్‌రూమ్ ఇళ్లు (ఫ్రీఫ్ స్ట్రక్చర్) నిర్మాణం, కోరుట్ల మండలంలోని ఐలాపూర్ గ్రామంలో (25) 2-బెడ్‌రూమ్ ఇళ్లు (ఫ్రీఫ్ స్ట్రక్చర్) నిర్మాణం, జగిత్యాల (అర్బన్) మున్సిపాలిటీలో (360) 2-బెడ్‌రూమ్ ఇళ్లు (ఫ్రీఫ్ స్ట్రక్చర్) నిర్మాణం. **మొత్తం ECV: రూ.2,185.20 లక్షలు.** బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ మరియు ముగింపు తేది: 01.11.2019 నుండి 08.11.2019. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tenders.telangana.gov.in నుండి పొందవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, పి.ఆర్.రీజియన్, కరీంనగర్

DIPR RO. No. 1497-DP/CL/Advt/1/2019-20, Dt: 29.10.2019

సవరణ

తేది: 26-10-2019 రోజున సాక్షి దినపత్రిక మెయిన్ ఎడిషన్ 11వ పేజీలో ప్రచురితమైన తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, రామగుండం - "పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ" ప్రకటనలో కింద నంబరును ఈ క్రింది విధంగా చదువుకోగలరు.

6)	కార్యకలాపాల స్వభావం మరియు ఉత్పత్తి :	భూగర్భ గనుల ద్వారా జరుగు బొగ్గు ఉత్పత్తి వివరములు.	
	గని	ప్రస్తుత వార్షిక బొగ్గు ఉత్పత్తి మి. టన్నులు (MTPA)	ప్రతిపాదిత వార్షిక బొగ్గు ఉత్పత్తి మి. టన్నులు (MTPA)
	జి.డి.కె. 1&3 ఇంక్లైన్,	0.344	0.486
	జి.డి.కె. 2&2A ఇంక్లైన్,	0.450	0.648
	జి.డి.కె. 5 ఇంక్లైన్	0.360	0.600
	మొత్తం	1.154	1.734

సం/- ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్, తెలంగాణ రాష్ట్రకాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, రామగుండం

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
నమోదిత కార్యాలయం: ద అన్నపూర్ణ నగర్ పబ్లిక్ సర్వెంట్స్ కో-ఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ, ప్లాట్ నం.80/A, 81/A, గోరంట్ల, గుంటూరు

యూకలిప్టస్ డేబార్క్‌డ ఉడ్ బిల్లెట్స్ అమ్మకం ప్రకటన

Ref.No.OP.001/EDWB/2019-20/922 తేది: 28.10.2019

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ యొక్క యూకలిప్టస్ క్లోనల్ ప్లాంటేషన్‌తో మిళితమైన (01) యూనిట్ వెదురు నుండి దాదాపు 5000 cum యాంటిసిపేటెడ్ **యూకలిప్టస్ డీబార్క్‌డ ఉడ్ బిల్లెట్స్ 14 నవంబర్, 2019**న 11.00 గం. నుండి 13.00 గం. వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇ-పోర్టల్ అనగా "https://www.konugolu.ap.gov.in"లో "Konugolu" వద్ద ఇ-టెండరు సహిత ఇ-వేలం ద్వారా జరుపుటకు ప్రతిపాదించడమైనది. మిగతా విక్రయించబడని/నిర్ధారించబడని యూనిట్ **28 నవంబర్ 2019**న మళ్లీ ప్రదర్శించబడును. మరిన్ని వివరాలకు దర్శించండి: వెబ్‌సైట్స్ "https://www.konugolu.ap.gov.in" మరియు "https://www.apfdcl.com"

సం/- వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్

DIPR RO.No.202 PP/CL/Advt/1/1/2019-20, Dt. 29.10.19

వరదే.. వరమయ్యింది

- మురిపించిన కృష్ణా జల ప్రవాహాలు
- ఇప్పటికే 100 టీఎంసీల వరద జలాల వినియోగం
- ఇందులో పాలమూరు ప్రాజెక్టుల కిందే 53 టీఎంసీల వాడకం
- కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమాల పరిధిలో 952 చెరువులకు కృష్ణా జలాల మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ బేసిన్‌లో పదేళ్ల అనంతరం విస్తారంగా కురిసిన వర్షాలతో పోటెత్తిన వరదలు రాష్ట్రానికి కొత్త ఊపిరిలూదాయి. ఆగస్టు తొలివారం నుంచి విరామం లేకుండా కొనసాగిన వరదలు ప్రాజెక్టుల కింది తాగు, సాగు అవసరాలకు వరంగా మారాయి. బేసిన్‌లో కురుస్తున్న వర్షాలతో పెరిగిన ప్రవాహాల మాదిరే, రాష్ట్ర వినియోగం సైతం గణనీయంగా పెరిగింది. ఆగస్టు నుంచి మూడు నెలల వ్యవధిలో జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద ఏకంగా 100 టీఎంసీల మేర నీటి వినియోగం జరిగింది. ప్రాజెక్టుల్లో కనీస నీటి మట్టాలకు ఎగువన మరో 340 టీఎంసీల లభ్యత జలాలు ఉండగా, ప్రస్తుతం ప్రాజెక్టుల్లో స్థిరంగా ప్రవాహాలు కొనసాగుతుండటం రాష్ట్రానికి వరంగా మారింది.

'పాలమూరు'కు ప్రాణం..

జూరాల, శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు జూలై మొదటి వారం నుంచి ప్రవాహాలు మొదలైనా, ఆగస్టు నుంచి ఉధృతంగా కొనసాగుతూ వచ్చాయి. 2009-10 తర్వాత ఆ స్థాయిలో వరదలు కొనసాగడంతో శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు 6 సార్లు, సాగర్ గేట్లు ఏడు సార్లు ఎత్తాల్సి వచ్చింది. ఇప్పటివరకు జూరాలకు 1,348 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టుకు 1,650 టీఎంసీలు రాగా, సాగర్‌కు 1,145 టీఎంసీల వరద వచ్చింది. ఇందులో ఇప్పటికే తెలంగాణలో 100 టీఎంసీల మేర నీటి వినియోగం జరిగింది. బేసిన్ పరిధిలోని జిల్లాల్లోనూ వర్షాలు కురవడంతో ప్రాజెక్టుల నుంచి అవసరం మేరకే నీటిని వినియోగించుకున్నారు. అయినప్పటికీ గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే గరిష్ట నీటి వినియోగం జరిగింది. పాలమూరు జిల్లాలో జూరాలపై ఆధారపడ్డ నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ఎత్తిపోతల పథకాలతో పాటు, శ్రీశైలంపై ఆధారపడ్డ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల కింద గతంలో ఎన్నడూలేని రీతిలో 53 టీఎంసీల మేర నీటి వినియోగం జరిగింది. నెట్టెంపాడు కిందే 16 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 952 చెరువులను నింపారు. గత ఏడాది ఇదే సమయానికి ఈ నాలుగు ఎత్తిపోతల పథకాలు, జూరాల కింద వినియోగం 20 టీఎంసీలను దాట లేదు. గత ఏడాదంతా కలిపి అన్ని ప్రాజెక్టుల కింద వినియోగం కేవలం 75 టీఎంసీలు మాత్రమే ఉంది. ప్రస్తుతం జూరాలకు స్థిరంగా 1.38 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతుండటంతో దానిపై ఆధారపడ్డ ఎత్తిపోతల పథకాలకు నీటి వినియోగం జరుగుతూనే ఉంది. మరో పది రోజులపాటు వరద ఇదే రీతిన కొనసాగే అవకాశాల నేపథ్యంలో మరిన్ని చెరువులు నింపనున్నారు. ఇదే జరిగితే రబీలోనూ ప్రాజెక్టుల కింది ఆయకట్టుకు నీటి కొరత ఉండదు. ఇక వీటికి తోడు సాగర్ ఎడమ కాల్వ కింద తాగు, సాగునీటి అవసరాలకు ఇప్పటికే 24 టీఎంసీల మేర నీటిని వినియోగించారు. ఏఎంఆర్‌పీ కింద 13 టీఎంసీలు, జలమండలి కింద అవసరాలకు 7 టీఎంసీల మేర వినియోగం జరిగింది. ఇదిగాక కనీస నీటి మట్టం 834 అడుగులకు ఎగువన శ్రీశైలంలో 160 టీఎంసీలు, సాగర్‌లో 510 అడుగులకు పైన 180 టీఎంసీలు కలిపి 340 టీఎంసీల లభ్యత ఉంది. ఈ వినియోగం వచ్చే ఏడాది మళ్లీ జూన్ వరకు జరిగినా, గత ఏడాది మొత్తంగా జరిగిన వినియోగం 207 టీఎంసీల మార్కును తెలంగాణ దాటనుంది.

కృష్ణా జలాల వినియోగం (టీఎంసీల్లో)

ఏడాది	తెలంగాణ
2014-15	248.12
2015-16	74.83
2016-17	150.03
2017-18	183.16
2018-19	207.89
2019-20	100 (ఇప్పటి వరకు)

పాలమూరు ప్రాజెక్టుల కింద నీటి వినియోగం.. (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	నీటి వినియోగం	నింపిన చెరువులు
కల్వకుర్తి	16	450
నెట్టెంపాడు	9	100
భీమా	11.50	210
కోయిల్‌సాగర్	4	36
జూరాల	12	151
ఆర్డీఎస్	1	5

ఆర్టీసీ కార్మికులను సీఎం వేధిస్తున్నారు: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: తన మొండి వైఖరితో సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికులను వేధిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తాము అండగా ఉంటామని చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఉత్తమ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మె విషయంలో ప్రభుత్వం మొండివైఖరితో సాగడం మంచిది కాదన్నారు. సమ్మె పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన ఆయన, ఆర్టీసీ ఉద్యమంలో కాంగ్రెస్ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ఏఐసీసీ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్, శ్రీనివాసరావులు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ తిరోగమన దిశలో పయనిస్తున్న తీరును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా వివరించారు. సమావేశంలో కుంతియా, జానారెడ్డి, భట్టి, రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దాసోజు శ్రవణ్, కుసుమకుమార్, సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు, సీతక్క, పొడెం వీరయ్య, పార్టీ నేతలు వి.హనుమంతరావు, వేణుగోపాల్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ల ముట్టడి.. ఆందోళనలు

- టీఆర్ఎస్ తీరుపై నిరసనలకు సిద్ధమైన టీపీసీసీ
- బీజేపీ ఆర్థిక తిరోగమన విధానాలపైనా ఉద్యమం
- నవంబర్ 8న కలెక్టరేట్ల ముట్టడి
- 11న గాంధీభవన్ నుంచి హైదరాబాద్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర

కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో జానారెడ్డి, భట్టి విక్రమార్క, కుంతియా, రేవంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక దుర్వినియోగం, కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తోన్న ఆర్థిక తిరోగమన విధానాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ రెండు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా పేద ప్రజలు కష్టాలు పడాల్సి వస్తోందని, దీనికి నిరసనగా నవంబర్ 8న అన్ని జిల్లాల కలెక్టరేట్లను ముట్టడించాలని పార్టీ శ్రేణులను కోరింది. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో నిర్ణయించారు. నవంబర్ 11న గాంధీభవన్ నుంచి పాదయాత్రగా వెళ్లి హైదరాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. కోర్ కమిటీలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ఆర్టీసీ సమ్మె, మున్సిపల్ ఎన్నికలపై నేతలు చర్చించారు.

ఆ బాధ్యత నాదే..

హుజూర్‌నగర్ ఉపఎన్నికపై జరిగిన చర్చ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే పూర్తి బాధ్యత వహిస్తానని తెలిపారు. టీఆర్ఎస్ పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేసి ప్రలోభాలకు గురిచేసినప్పటికీ పార్టీకి 70 వేల ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. అయినా ఓటమిని సమీక్షించుకుని ముందుకెళ్దామని చెప్పారు. త్వరలోనే జరుగుతాయని భావిస్తున్న మున్సిపల్ ఎన్నికలపై ఇప్పటికే పార్టీ ఆధ్వర్యంలో కసరత్తు ప్రారంభమైందని, ఈ కసరత్తును ముమ్మరం చేయాలని కోర్‌కమిటీ పార్టీ కేడర్‌ను కోరింది. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు, స్థానిక పట్టణ కమిటీలు అన్ని విధాలా ఎన్నికలు ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సూచించింది. దీంతో పాటు రాజకీయ పార్టీల కార్యాలయాలకు భూకేటాయింపుల్లో భాగంగా జిల్లాల్లో తమ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి కూడా స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు, కలెక్టర్లతో సమన్వయం చేసుకునే బాధ్యతను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్‌కు అప్పగించారు. అదే విధంగా గతంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం కోసం కేటాయించిన గాంధీభవన్ పక్కనే ఉన్న హౌసింగ్ బోర్డు స్థలం విషయంలో న్యాయపరమైన అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఆ స్థలం నుంచి పార్టీ పరంగా వైదొలగాలని, పార్టీ రాష్ట్ర కార్యాలయం కోసం హైదరాబాద్‌లో మంచి ప్రదేశంలో తమకు స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరాలని కూడా కోర్ కమిటీ నిర్ణయించింది. ఇక, ఆర్టీసీ కార్మికులకు అండగా ఉండాలని, ఈ మేరకు నేడు జరగనున్న సకల జనుల సభకు మద్దతివ్వడంతో పాటు పార్టీ నేతలు పాల్గొనాలని నిర్ణయించింది.

క్రమశిక్షణ ఏదీ?: వీహెచ్

కోర్ కమిటీ సమావేశంలో భాగంగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. పార్టీలో క్రమశిక్షణ లేకుండా పోయిందని, కొందరు నేతలు వ్యవహరిస్తున్న తీరు ఇబ్బందికరంగా ఉందని వ్యాఖ్యానించారు. దీన్ని కట్టడి చేయాలని, పార్టీ నియమావళిని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కోర్ కమిటీ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎ.రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జెట్టి కుసుమకుమార్, ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, శ్రీనివాస కృష్ణన్, సలీం అహ్మద్, సంపత్‌కుమార్, చిన్నారెడ్డి, షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా హుజూర్‌నగర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. కొత్తగా సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇటీవల హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘనవిజయం సాధించిన అనంతరం ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం కేసీఆర్, హుజూర్‌నగర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటైంది. మంగళవారం ఈ మేరకు రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు. కోదాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెర్వు, చింతపాలెం (మల్లారెడ్డిగూడెం) మండలాలు, సూర్యాపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని గరిడేపల్లి, పాలకవీడు, నేరేడుచర్ల మండలాలను కలుపుతూ హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు.

హెచ్ఐవీ, డయాబెటిస్ కిట్లలో చేతివాటం

- ఈఎస్ఐ మెడికల్ కిట్ల కొనుగోళ్లలో కొత్తకోణం
- రూ.60 కోట్ల కొనుగోళ్లలో రూ.1.02 కోట్లు పక్కదారి
- దేవికారాణి, పద్మ కార్యాలయ సిబ్బంది పాత్రపై ఏసీబీ ఆరా

సాక్షి, హైదరాబాద్: ఈఎస్ఐకి చెందిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) విభాగంలో మరో కొత్త అవినీతి కోణాన్ని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వెలికితీసింది. మెడికల్ కిట్ల కోసం పెట్టిన ఇండెంట్లలో గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో మాజీ డైరెక్టర్ దేవికారాణి, మాజీ జేడీ పద్మతోపాటు ఓమ్నీ మెడీ ఫార్మా కంపెనీల పాత్ర ఉండటం గమనార్హం. ఇప్పటికే ఈ కేసులో దేవికారాణి, పద్మ, ఓమ్నీ మెడీ సిబ్బందిని విచారించిన ఏసీబీ అధికారులు రాబట్టిన పలు కీలక విషయాల ఆధారంగా కేసులో ముందుకెళ్తున్నారు.

ఏం జరిగింది?

ఐఎంఎస్‌లో 2017-18కి సంబంధించిన మెడికల్ కిట్ల కోసం దాదాపు రూ.60 కోట్ల బడ్జెట్ కేటాయింపు జరిగింది. ఈ నిధులతో హెచ్ఐవీ, డయాబెటిస్, హిమోగ్లోబిన్ తదితర కీలక వైద్య పరీక్షలకు సంబంధించిన కిట్లు కొనుగోలు చేయాలి. అలా కొనుగోలు చేసిన మెడికల్ కిట్లలో సగానికిపైగా ఈఎస్ఐ డిస్పెన్సరీలకు చేరనేలేదని ఏసీబీ దర్యాప్తులో తేలింది. 2017-18 సంబంధించి మొత్తం 22 పర్చేసింగ్ ఆర్డర్లు ఉన్నాయి. ఇందులో ఏసీబీ అధికారులు 2 పర్చేసింగ్ ఆర్డర్లు మాత్రమే పరిశీలించారు. హెచ్ఐవీ, డయాబెటిస్, హిమోగ్లోబిన్ కిట్లు ఒక్కోటి రూ.1,750 చొప్పున మొత్తం 1,000 కిట్లు కొనుగోలు చేశారు. వీటి విలువ రూ.1.76 కోట్లు. అందులో 583 కిట్లు స్థానిక ఈఎస్ఐ డిస్పెన్సరీలకు చేరలేదని దర్యాప్తులో తెలింది. వీటి విలువ రూ.1.02 కోట్లుగా తేల్చారు. ఈ కిట్లన్నీ సరఫరా చేసింది ఓమ్నీ మెడీ ఫార్మా కంపెనీగా గుర్తించారు. సదరు సంస్థ యజమాని హరిబాబు, మెడికల్ రిప్రజెంటేటివ్ నాగరాజులు కూడా పాలుపంచుకున్నట్లు సమాచారం.

ఏడు డిస్పెన్సరీలు ఇవే..!

దేవికారాణి, పద్మ కేంద్రంగా సాగిన ఈ దందాలో కొనుగోలు చేసిన వాటిలో సగానికిపైగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించారన్న ఆరోపణలున్నాయి. వీటిలో బొల్లారం, కాటేదాన్, శభాష్‌పల్లి, సదాశివపేట్, బొంతపల్లి, చర్లపల్లి, జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీలకు పంపినట్లు రికార్డుల్లో రాసినా.. అక్కడ నమోదు కాకపోవడం గమనార్హ

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో చెలరేగిన కార్చిచ్చు సొనమా కౌంటీలో రోడ్ల మీదకు సైతం విస్తరించిన దృశ్యం

ప్రియమైన అన్నయ్యకు..

సాక్షి, న్యూఢిల్లీ: అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక 'భాయ్ దూజ్' పర్వదినం. ఉత్తర భారతదేశంలో దీపావళి పండుగ తరువాత జరుపుకునే ఈ వేడుక సందర్భంగా సోదర, సోదరీమణులు ఒకరికొకరు ఆశీస్సులు పొందడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీ. భాయ్ దూజ్ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ తన సోదరుడు రాహుల్ గాంధీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కొన్ని ఫొటోలను ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. రాహుల్‌తో చిన్నప్పటి, ఇప్పటి ఫోటోలను ట్విటర్‌లో షేర్‌చేస్తూ 'లవ్ యూ' అంటూ సోదరుడిపై ఆప్యాయతను వ్యక్తం చేశారు.

రాహుల్-ప్రియాంక చిన్ననాటి ఫొటో



కేదర్‌నాథ్ ఆలయాన్ని శీతాకాల సీజన్‌లో ఆరు నెలల పాటు మూసేయనున్న సందర్భంగా రుద్ర ప్రయాగ్‌లో ఊరేగింపు నిర్వహించిన దృశ్యం

దీపావళి సందర్భంగా న్యూయార్క్‌లోని ప్రఖ్యాత ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పైభాగం నారింజ రంగులో వెలిగిపోతున్న దృశ్యం.

తదుపరి సీజేఐ జస్టిస్ బాబ్డే

18న ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ: కీలకమైన పలు కేసులను విచారిస్తున్న జస్టిస్ శరత్ అరవింద్ బాబ్డే(63) సుప్రీంకోర్టు 47వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జస్టిస్ బాబ్డే నవంబర్ 18వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 2021 ఏప్రిల్ 23 వరకు అంటే 17 నెలల పాటు జస్టిస్ బాబ్డే పదవిలో కొనసాగుతారు. సుప్రీంకోర్టులో సీనియారిటీ ప్రకారం జస్టిస్ బాబ్డే రెండో స్థానంలో ఉన్నారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ పదవీకాలం నవంబర్ 17వ తేదీతో ముగియనుంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 1956 ఏప్రిల్ 24న బాబ్డే జన్మించారు. ఈయన తండ్రి ప్రముఖ న్యాయవాది అరవింద్ శ్రీనివాస్ బాబ్డే. నాగపూర్ యూనివర్సిటీ నుంచే బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1978లో బాబ్డే మహారాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా చేరారు. బాంబే హైకోర్టులో 21 ఏళ్లు పనిచేశారు. 1998లో ఆయన్ను సీనియర్ న్యాయవాదిగా నియమించారు. 2000లో బోంబే హైకోర్టు అడిషనల్ జడ్జిగా, 2012లో మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2013 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

నియామకపత్రాన్ని జస్టిస్ బాబ్డేకు అందిస్తున్న ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా

కీలక తీర్పుల్లో జస్టిస్ బాబ్డే

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గోప్యత పౌరుడి ప్రాథమికహక్కు అంటూ 2017లో చారిత్రక తీర్పునిచ్చిన తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ బాబ్డే కూడా ఒకరు. జస్టిస్ బాబ్డే సహా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని 9 మంది సభ్యుల ధర్మాసనం గోప్యత హక్కుకు రాజ్యాంగం రక్షణ కల్పించిందని వ్యాఖ్యానించింది. దేశ పౌరులెవరూ కూడా ఆధార్ కార్డు లేని కారణంగా కనీస సదుపాయాలను గానీ, ప్రభుత్వ సేవలకూ గానీ దూరం కారాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాలుష్యాన్ని వెదజల్లుతోన్న టపాసులను కాల్చడాన్ని పూర్తిగా నిషేధించాలన్న వాదనను ఈ ఏడాది మార్చిలో జస్టిస్ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది. కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. రాజకీయంగా అత్యంత సున్నితమైన రామజన్మభూమి, బాబ్రీ మసీదు వివాదం కేసును విచారిస్తోన్న ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ బాబ్డే కూడా ఉన్నారు. యావద్దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఈ కేసుపై సుప్రీంకోర్టు నవంబర్ 15న తుదితీర్పును వెలువరించనుంది. ఆ తరువాత రెండు రోజులకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేయనున్నారు.

క్లుప్తంగా...

రైల్వేలో ఓటీపీ ఆధారిత రీఫండ్

న్యూఢిల్లీ: అధీకృత రైల్వే ఏజెంట్ల టికెట్ బుకింగ్ వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) ఓటీపీ ఆధారిత రీఫండ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా ప్యాసింజర్లు టికెట్ బుకింగ్‌ను రద్దు చేసుకున్నప్పుడు ఆ టికెట్‌కు చెల్లించిన మొత్తాన్ని పాస్‌వర్డ్ ద్వారా తిరిగి వాపసు పొందవచ్చు. అయితే ఇది గుర్తింపు పొందిన ఏజెంట్ల ద్వారా బుకింగ్ చేసుకున్న ఈ-టికెట్లకు మాత్రమే వర్తిస్తుందని ఐఆర్‌సీటీసీ తెలిపింది. ఈ నూతన విధానం ప్రకారం ఒక వినియోగదారుడు గుర్తింపు పొందిన ఐఆర్‌సీటీసీ ఏజెంట్ ద్వారా తీసుకున్న టికెట్ రద్దు చేసుకున్నప్పుడు అతని మొబైల్‌కి వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) మెసేజ్ వస్తుంది. ఈ పాస్‌వర్డ్‌ను టికెట్ ఏజెంట్‌కు ఇస్తే ఆ రీఫండ్‌ను వినియోగదారుడి ఖాతాలో జమ చేస్తారు. 'అంతకుముందైతే ఏజెంట్లు తమ మొబైల్ నంబర్ ద్వారా టికెట్ బుకింగ్ చేసేవారు. అప్పుడు టికెట్ రద్దు వివరాలు అతని మొబైల్ నంబర్‌కే వెళ్లేవి. దీంతో ఏజెంట్లు టికెట్‌కు సంబంధించిన పూర్తి రీఫండ్‌ను వినియోగదారులకు చెల్లించేవారు కాదు'అని ఐఆర్‌సీటీసీ అధికారి వివరించారు.

ఒకే ఫ్యాకల్టీ రెండు చోట్ల పనిచేస్తే!

న్యూఢిల్లీ: ఇంజనీరింగ్ కాలేజీల్లో పనిచేసే ఫ్యాకల్టీ రెండు చోట్ల పని చేస్తే కఠిన చర్యలు తప్పవని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) హెచ్చరించింది. ఒకే మాతృ సంస్థల్లోని వేర్వేరు క్యాంపస్‌లలో పని చేసినా చర్యలు తప్పవని తెలిపింది. ఇలా చేసే వారిని అనుమతులు పొడిగించే (ఈఓఏ) విషయంలో సమస్యలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించింది. ఒకే మాతృసంస్థలోని ఫ్యాకల్టీని ఆయా సంస్థల యాజమాన్యాలు ఇతర కాలేజీలకు కూడా తరలించి పాఠాలు చెప్పిస్తున్నారని, దీనివల్ల బోధనలో నాణ్యత తగ్గుతుందని మండలి అభిప్రాయపడింది.

ఇకపై వృద్ధులకూ ఉచిత రవాణా: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మహిళలకు కల్పించినట్టే ఉచిత రవాణా పథకాన్ని త్వరలో వృద్ధులకు, విద్యార్థులకు వర్తింపజేస్తామని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రకటించారు. ఈ పథకం సమాజంలో లింగ వివక్షను రూపుమాపడానికి, తద్వారా మహిళా సాధికారతకు తోడ్పడుతుందని కేజ్రీవాల్ తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు మంగళవారం ఈ పథకం కింద కండక్టర్లు రూ .10 ముఖ విలువ కలిగిన పింక్ టికెట్లు ఇచ్చారు. టిక్కెట్ల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం రవాణాశాఖకు తిరిగి చెల్లిస్తుంది. సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు కూడా రాబోయే రోజుల్లో కూడా ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

ఆ సంతకం కాఫీ డే సిద్ధార్థదే

బొమ్మనహళ్లి (బెంగళూరు): ప్రముఖ వ్యాపారవేత్త, కెఫె కాఫీ డే అధినేత వీజీ సిద్ధార్థ తన మరణానికి ముందు రాసిన లేఖలో చేసిన సంతకం ఆయనదేనని ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులు తేల్చారు. వెలుగు చూసిన లేఖలో సిద్ధార్థ ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, ఐటీ అధికారుల వేధింపులు కూడా ఉన్నాయని ఆరోపించిన సంగతి తెలిసిందే. ఆ లేఖ అసలుదా.. కాదా అని తేల్చేందుకు పోలీసులు ఆ లేఖను ఆగస్టులో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. పలు సందర్భాల్లో చేసిన సంతకాలను, ఆ లేఖలో చేసిన సంతకాన్ని ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలించి ఈ నిర్ధారణకొచ్చారు.

ఎవరి పంతం వారిది!

- మహారాష్ట్రలో వీడని ఉత్కంఠ
- 50:50 కుదరలేదన్న ఫడ్నవిస్
- బీజేపీతో ఉద్ధవ్ భేటీ రద్దు

సాక్షి, ముంబై/న్యూఢిల్లీ: మహారాష్ట్ర సీఎం పదవి కోసం బీజేపీ,శివసేన మధ్య ఏర్పడిన పీటముడి బిగుస్తోంది. ఎన్నికలకు ముందు పొత్తు ఏర్పాటైనప్పుడు బీజేపీ హామీ ఇచ్చినట్టుగా రొటేషన్ పద్ధతిలో సీఎం పదవిని చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలని శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే పట్టుబడుతున్నారు. దీనిపై తొలిసారి నోరు విప్పిన దేవేంద్ర ఫడ్నవీస్ మాత్రం పార్టీల మధ్య అలాంటి ఒప్పందమేమీ జరగలేదని కుండబద్దలు కొట్టినట్టు వెల్లడించారు. మరో అయిదేళ్లు బీజేపీ నేతృత్వంలో కూటమి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. బుధవారం కొత్తగా ఎన్నికై న బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకుంటారని వెల్లడించారు. ఫడ్నవీస్ వ్యాఖ్యలతో ఉద్ధవ్ ఠాక్రే బీజేపీతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి సమావేశాన్ని రద్దు చేసుకున్నారు. కాగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి అమిత్ షా మంగళవారం ముంబైకి రానున్నారని దీంతో ముఖ్యమంత్రి పీఠంపై చిక్కు ముడి వీడనుందని భావించారు. అయితే అమిత్ షా పర్యటన రద్దు కావడంతో ఈ విషయంపై ఉత్కంఠ పెరిగింది. 50:50 ఫార్ములా అంశాల గురించి అమిత్‌షా.. ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడి ఖరారు చేస్తారని బీజేపీ సీనియర్ నేత చంద్రకాంత్ పాటిల్ వెల్లడించారు.

మహారాష్ట్రలో దుష్యంత్ లేడు: శివసేన విసుర్లు

శివసేన తమకు అధికార దాహం లేదని, చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతున్నామనే చెబుతోంది. రాజకీయాల్లో తాము ఎప్పుడూ నిజాయితీగా వ్యవహరిస్తామని ఆ పార్టీ నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. తమ ముందు ఎన్నో ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు జరిగిన ఒప్పందానికి కట్టుబడి బీజేపీతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకే తమ అధినేత ఉద్ధవ్ మొగ్గు చూపిస్తున్నారని అన్నారు. హరియాణాలో దుష్యంత్ తండ్రి జైల్లో ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. మహారాష్ట్రలో దుష్యంత్‌లెవరూ లేరని, అందుకే ప్రభుత్వం ఏర్పాటుకు ఆలస్యమవుతోందని సంజయ్ రౌత్ బీజేపీపై చెణుకులు విసిరారు.

బీజేపీ ముందున్న మార్గాలేంటి!

బీజేపీ సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మరో 40 సీట్లు కావాలి. శివసేన రొటేషన్ పద్ధతిలో సీఎం డిమాండ్‌ను విడిచిపెట్టకపోతే బీజేపీ ఎన్సీపీతో చేతులు కలిపినా ఆశ్చర్యపడనక్కర్లేదని విశ్లేషకుల అంచనా. శివసేనకు మద్దతునివ్వబోమని ఇప్పటికే శరద్‌పవార్ పార్టీ ఎన్సీపీ తేల్చి చెప్పేసింది. ఈసారి ఎన్నికల్లో 54 సీట్లతో ఎన్సీపీ బలమైన శక్తిగానే అవతరించింది. ఈ రెండు పార్టీలు చేతులు కలిపితే వారి బలం 159కి చేరుకుంటుంది. అందులోనూ పవార్ చుట్టూ ఈడీ ఉచ్చు బిగుస్తూ ఉండడంతో ఎన్సీపీ రాజీపడే అవకాశాలున్నాయనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఈసారి ఎన్నికల్లో 17 మంది బీజేపీ రెబెల్ అభ్యర్థులు గెలిచారు. వారందరినీ తమ వైపు తిప్పుకొని బలం పెంచుకోవడం ద్వారా శివసేనను బలహీనపరిచి తామే అయిదేళ్లు పాలించే వ్యూహాన్ని కూడా బీజేపీ పరిశీలిస్తోంది. 105 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ రెబెల్ అభ్యర్థుల్ని తమ వైపు తిప్పుకుంటే 125కి బలం చేకూరుతుంది. మరోవైపు శివసేన కూడా స్వతంత్ర అభ్యర్థులపై వలవేస్తూ తన పవర్ చూపిస్తోంది. శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే నాన్చుడు ధోరణి ఆ పార్టీ ఎమ్మెల్యేల్లో అసంతృప్తిని పెంచుతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్, ఎన్సీపీపై పోరాటం చేసిన తమకు అధికారాన్ని పంచుకునే అవకాశం వచ్చినప్పుడు దానిని జారవిడుచుకోకూడదని వారు భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు సంకేతాలు పంపుతున్నాయి. 45 మంది శివసేన ఎమ్మెల్యేలు బీజేపీతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు మొగ్గు చూపిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

వలసకూలీలపై ఉగ్ర కాల్పులు

ఆరుగురు దుర్మరణం

శ్రీనగర్: కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి రద్దు చేసిన అనంతర పరిస్థితులను పరిశీలించేందుకు యూరోపియన్ యూనియన్(ఈయూ) బృందం పర్యటిస్తున్న సమయంలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. బెంగాల్‌కు చెందిన ఆరుగురు వలస కార్మికులను పొట్టనబెట్టుకున్నారు. సీఆర్పీఎఫ్ బలగాలపైకి కాల్పులు జరిపారు. శ్రీనగర్‌లో జరిగిన అల్లర్లలో నలుగురికి గాయాలయ్యాయి. బెంగాల్‌కు చెందిన కార్మికులు కుల్గామ్ జిల్లాలో పనిచేస్తున్నారు. మంగళవారం ఉగ్రవాదులు వీరిపైకి కాల్పులు జరపగా ఆరుగురు మృతి చెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు.

ఈయూ బృందం పర్యటన

ఆర్టికల్ 370 రద్దు తర్వాత క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు 23 మందితో కూడిన ఈయూ బృందం మంగళవారం శ్రీనగర్ చేరుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బీవీఆర్ సుబ్రహ్మణ్యం, పోలీసు చీఫ్ దిల్బాగ్ సింగ్ రాష్ట్రంలో పరిస్థితులను ఈయూ బృందానికి వివరించారు. ఎంపీలు పంచాయతీ సభ్యులు, కౌన్సిలర్లు, పలువురు ప్రజలతో మాట్లాడారు. ఆ బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది.

కింది కోర్టులతో సుప్రీంకు ఇబ్బంది

న్యూఢిల్లీ: కింది కోర్టులు ఇస్తున్న తప్పుడు, అసమగ్ర తీర్పుల వల్ల సుప్రీంకోర్టులో దాఖలవుతున్న కేసుల సంఖ్య భారీగా పెరుగుతోందని అత్యున్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. కింది కోర్టుల ఈ నిర్లక్ష్య ధోరణిని పలుమార్లు ఆక్షేపించినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్‌లో నలుగురు దోషులకు కింది కోర్టు విధించిన మూడేళ్ల జైలుశిక్షను తగ్గిస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా మంగళవారం సుప్రీంకోర్టు పై వ్యాఖ్యలు చేసింది. ట్రయల్ కోర్టు విధించిన మూడేళ్ల శిక్షను అప్పటికే ఆ నలుగురు దోషులు అనుభవించిన జైలు కాలానికి పరిమితం చేస్తూ హైకోర్టు తీర్పునివ్వడాన్ని తప్పుబట్టింది. హైకోర్టు తీర్పును సవరిస్తూ ఆ నలుగురిలో ముగ్గురికి ఒక్కొక్కరికి మూడు నెలల జైలుశిక్ష, లక్ష రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. 80 ఏళ్ల వృద్ధుడైన ఆ నాలుగో దోషికి రెండు నెలల జైలుశిక్ష, రూ. 65 వేల జరిమానా విధించింది.

వసివాడిన పసివాడు

- ఫలించని 84 గంటల ప్రయత్నాలు
- మృతదేహంగా వెలికితీత

సాక్షి ప్రతినిధి, చెన్నై: చిన్న నిర్లక్ష్యం మరో నిండు ప్రాణాన్ని బలిగొంది. బిడ్డ తిరిగొస్తాడని ఎదురు చూసిన తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. తమిళనాడులో ఐదురోజుల క్రితం బోరుబావిలో పడిపోయిన సుజిత్ (2)ను అధికారులు రక్షించలేకపోయారు. బాలుడి మృతదేహాన్ని కుళ్లిన స్థితిలో మంగళవారం వెలికితీశారు. తిరుచ్చిరాపల్లి జిల్లా నడుకాట్టుపట్టికి చెందిన ఆరోగ్యరాజ్ (40), కళామేరి (35) దంపతుల సుజిత్ విల్సన్ ఈనెల 25న ప్రమాదవశాత్తు బోరుబావిలో పడ్డాడు. రక్షించేందుకు చేసే ప్రయత్నాల్లో 88 అడుగుల లోతులోకి జారిపోయాడు. బోరు బావికి సమాంతరంగా తవ్వుతున్న సమయంలో సొరంగ మార్గం నుంచి దుర్వాసన రావడాన్ని అధికారులు గుర్తించారు. సుజిత్ మరణించినట్లు రెవెన్యూ కార్యదర్శి రాధాకృష్ణన్ ప్రకటించారు. అనంతరం

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

బోరుబావిని కాంక్రీటుతో మూసివేశారు. ఈ వార్తతో తమిళనాడు ప్రజలు తల్లడిల్లిపోయారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ముఖ్యమంత్రి ఎడపాడి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, పలువురు మంత్రులు, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌లు తిరుచ్చికి చేరుకుని సుజిత్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. సుజిత్ కుటుంబానికి సీఎం ఎడపాడి, స్టాలిన్ వేర్వేరుగా రూ.10 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించారు. అనంతరం బాలుడి అంత్యక్రియలు పూర్తిచేశారు.

బాగ్దాదీ వారసుడూ హతం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- నిబంధనల ప్రకారమే బాగ్దాదీ అంత్యక్రియలు: పెంటగాన్

వాషింగ్టన్: డెల్టాఫోర్స్ ఆపరేషన్‌లో ఐసిస్ చీఫ్ అబూ బకర్ అల్ బాగ్దాదీతోపాటు, అతని తర్వాత ఐసిస్ పగ్గాలు చేపట్టనున్న మరో ఉగ్రవాది హతమైనట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. సిరియాలోని స్థావరంపై శనివారం రాత్రి ప్రత్యేక బలగాలు దాడి చేయడంతో బాగ్దాదీ తనను తాను పేల్చేసుకున్నట్లు ట్రంప్ సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో బాగ్దాదీ తరువాతి స్థానంలో ఉన్న మరోవ్యక్తి హతమయ్యాడని ట్రంప్ తాజాగా ప్రకటించారు. అతడి పేరు, ఎలా చనిపోయాడన్న వివరాలను వెల్లడించలేదు. బాగ్దాదీ మృతిపై అమెరికా సైనిక బలగాల అధిపతి జనరల్ మార్క్ మిల్లీ మాట్లాడుతూ..'ఆపరేషన్ జరిగిన ప్రాంతంలో లభించిన శరీర భాగాలపై డీఎన్ఏ పరీక్ష జరిపి అవి బాగ్దాదీవే అని నిర్ధారించుకున్నాకే అంతర్జాతీయ ప్రామాణిక నిబంధనల మేరకు అంత్యక్రియలు పూర్తి చేశాం'అని తెలిపారు. అయితే, ఈ ఘటన పుటేజీని కొంత బయటకు వెల్లడిస్తామంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయన స్పందిస్తూ.. మొత్తం ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోల పరిశీలన ప్రస్తుతం కొనసాగుతోందని తెలిపారు. బాగ్దాదీ ఇద్దరు అనుచరులను పట్టుకున్నామని, దీంతోపాటు ఆ భవనంలో లభించిన ఐసిస్ కీలక పత్రాల విశ్లేషణ కొనసాగుతోందన్నారు.

ఆపరేషన్ ఇంకా ఉంది: అమెరికా

బాగ్దాదీని మట్టుబెట్టిన అనంతరం సిరియాలో అమెరికా బలగాలు మరో ప్రత్యేక ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టాయి. చమురు క్షేత్రాలకు ఐసిస్ నుంచి రక్షణ కల్పించడంతోపాటు అక్కడి అసద్ ప్రభుత్వ, రష్యా బలగాల స్వాధీనం కాకుండా చూడడం తాజా లక్ష్యమని రక్షణ మంత్రి మార్క్ ఎస్పర్ ప్రకటించారు.

బాగ్దాదీని తుదముట్టించడంలో బలగాలకు సాయంగా ఉన్న శునకం 'కే-9'ఫొటోను అధ్యక్షుడు ట్రంప్ ట్విట్టర్‌లో షేర్ చేశారు. రహస్య సొరంగం చివరికి వెళ్లిన బాగ్దాదీ తనను తాను పేల్చేసుకోవడంతో 'కే-9' స్వల్పంగా గాయపడింది. 'బాగ్దాదీ కోసం చేపట్టిన ఆపరేషన్‌లో కే-9 పేరున్న ఈ కుక్క అద్భుత పనితీరు చూపింది'అంటూ బెల్జియన్ మలినోయిస్ జాతికి చెందిన ఆ కుక్కపై ట్విట్టర్‌లో ప్రశంసలు కురిపించారు. ఆ శునకం పేరు, ఇతర వివరాలు వెల్లడించలేదు.

బాగ్దాదీని తరిమిన కుక్క

కింగ్ సల్మాన్‌తో కరచాలనం చేస్తున్న భారత ప్రధాని మోదీ

ఉగ్రవాదాన్ని ఖండించాల్సిందే!

- భారత్, సౌదీ ఉమ్మడి ప్రతిన
- సౌదీ రాజు సల్మాన్‌తో మోదీ భేటీ
- సౌదీ అరేబియాతో భారత్ స్ట్రాటెజిక్ పార్ట్‌నర్‌షిప్ కౌన్సిల్ ఒప్పందం

రియాధ్: ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఖండించాల్సిందేనని భారత్, సౌదీ అరేబియాలు స్పష్టం చేశాయి. సోమవారం రాత్రి రియాధ్ చేరుకున్న మోదీ.. మంగళవారం సౌదీ సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్‌తో పాటు ప్రభుత్వంలోని విద్యుత్, ఇంధన, కార్మిక, వ్యవసాయ, జల నిర్వహణ.. తదితర శాఖల మంత్రులతో సమావేశమై చర్చలు జరిపారు. సౌదీ రాజు సల్మాన్‌తో ప్రధాని మోదీ భేటీ అనంతరం ఆ వివరాలను భారత విదేశాంగ శాఖలో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి టీఎస్ తిరుమూర్తి మీడియాకు వెల్లడించారు. ఆయిల్ అండ్ గ్యాస్, తీర ప్రాంత భద్రత, టెక్నాలజీ, వాణిజ్యం, పెట్టుబడులు తదితర రంగాల్లో సహకారంపై ఇరువురు నేతల మధ్య చర్చలు జరిగాయని తెలిపారు. మోదీ పర్యటన సందర్భంగా.. ఆ రంగాలతో పాటు డ్రగ్స్ రవాణా నియంత్రణ, వైమానిక సేవల సంబంధ ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయన్నారు.

రెండు దేశాలదీ ఒకే సమస్య

ఉగ్రవాదంపై పోరు సహా భద్రతకు సంబంధించిన అంశాల్లో భారత్, సౌదీ అరేబియాల మధ్య సహకారం విజయవంతంగా ముందుకు సాగుతోందని స్థానిక పత్రిక 'అరబ్ న్యూస్'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ పేర్కొన్నారు. పొరుగు దేశాల కారణంగా రెండు దేశాలు ఒకేరకమైన భద్రతాపరమైన సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. 'ఆసియా దేశాల్లో సౌదీ అరేబియా, భారత్‌లు తమ పొరుగు దేశాల నుంచి ఒకే రకమైన భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి' అని మోదీ ఆ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. వ్యూహాత్మక భాగస్వామ్య మండలికి సంబంధించి ఒప్పందం కుదరడంతో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమయ్యాయన్నారు. సౌదీ అరేబియాతో ద్వైపాక్షిక సంబంధాలకు భారత్ అత్యంత ప్రాముఖ్యతనిస్తుందన్నారు. 2016లో తన పర్యటన సహా ఇరుదేశాల నేతల పర్యటనలతో బంధం మరింత దృఢమైందన్నారు.

మన మెదడు చిన్నది!

న్యూఢిల్లీ: భారతీయుల మెదడు పరిమాణం చైనీయులు, కొరియన్లు, కాకాసియన్ల కంటే చిన్నదిగా ఉంటుందని శాస్త్రవేత్తలు పరిశోధనాత్మకంగా కనుగొన్నారు. భారతీయుల మెదడు ఆకారం ఇతరుల కంటే భిన్నంగా ఉందని గుర్తించారు. దీనికోసం శాస్త్రవేత్తలు తొలిసారి భారతీయుల బ్రెయిన్ అట్లాస్‌ను రూపొందించారు. దీనిని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ) హైదరాబాద్‌కు చెందిన పరిశోధకులు జయంత్రి శివస్వామి, అల్విన్ తొట్టుపట్టు అభివృద్ధి చేశారు.

The Andhra Pradesh State Co-operative Bank Ltd.,
(Govt. Partnered Scheduled Bank)
NTR Sahakara Bhavan, # 27-29-28, VIJAYAWADA-520 002.
Ph: 0866-2429 011/012;e-mail: hrd@apcob.org;
website:www.apcob.org

Selection of Chief Executive Officers of DCCBs

Applications are invited for the post of CEO's of DCCBs viz., Guntur, Anantapur and Chittoor from suitable candidates who fulfil Fit & Proper Criteria prescribed by RBI/NABARD. Last date for receipt of applications is 16.11.2019. For details, please visit our website http://www.apcob.org

Sd/-
General Manager (HRD)

సాక్షి
బుధవారం, అక్టోబర్, 30

సౌదీతో సాన్నిహిత్యం

ఏ దేశంలోనైనా సంస్కరణలు ఊపందుకుని ఆర్థిక సామాజిక రంగాల్లో చలనం అధికంగా కనిపించినప్పుడు అది ప్రపంచాన్ని ఆకర్షిస్తుంది. అక్కడకు వివిధ దేశాల అధినేతల రాకపోకలు పెరుగుతాయి. ఆ దేశంలో పెట్టుబడులపరంగా, వాణిజ్యపరంగా విస్తృతమైన అవకాశాలు ఏర్పడటం అందుకు కారణం. ఆ కోణంలో సౌదీ అరేబియా ఇప్పుడు చాలామందిని ఆకర్షిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దాన్ని దృష్టిలో పెట్టుకునే మంగళవారం ఆ దేశంలో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ రూపొందించిన విజన్-2030 ఎనిమిది దేశాలతో సౌదీ అరేబియా వ్యూహాత్మక భాగస్వామ్యం నెలకొల్పుకొనాలని నిర్దేశిస్తోంది. అందులో అమెరికా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్‌లతోపాటు మన దేశం కూడా ఉంది. సౌదీ అరేబియాకు ఇతరేతర దేశాలతో ఉన్న సంబంధాలు మాటెలా ఉన్నా మనతో అది సౌహార్ద సంబంధాలే కొనసాగిస్తూ వస్తోంది. ఈ ఏడాది మొదట్లో సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ మన దేశంలో పర్యటించారు. అప్పుడు భారత్‌లో ఇంధనం, ఖనిజాలు, మౌలిక సదుపాయాలు, పెట్రో కెమికల్స్, చమురుశుద్ధి, విద్య, తయారీరంగం తదితరాల్లో రూ. 10,000 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు అవగాహన కుదిరింది. దానికి కొనసాగింపుగా మోదీ పర్యటనలో ఒప్పందాలపై సంతకాలవుతాయి. దాంతోపాటు మంగళవారం రియాద్‌లో ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్షియేటివ్(ఎఫ్ఎఫ్ఐ) ఫోరం ఆధ్వర్యంలో ప్రారంభమైన వార్షిక సదస్సులో కూడా మోదీ పాల్గొన్నారు. 2024కల్లా అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దేందుకు సంకల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. సౌదీతో మన ద్వైపాక్షిక వాణిజ్యం విలువ దాదాపు 2,750 కోట్ల డాలర్లు. మన చమురు అవసరాల్లో 83 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా ఇరాక్ తర్వాత భారత్‌కు భారీగా ముడి చమురు సరఫరా చేసే దేశం సౌదీ అరేబియానే. 2018-19లో మన దేశం 20 కోట్ల 73 లక్షల టన్నుల ముడి చమురు దిగుమతి చేసుకోగా అందులో సౌదీ వాటా 4 కోట్ల టన్నులపైనే. సౌదీకి చెందిన ఆరామ్‌కో ప్రపంచంలోనే అత్యధిక లాభాలు గడిస్తున్న చమురు సంస్థ. ఆ దేశంలో 27,000 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు నిల్వలు నిక్షిప్తమై ఉన్నాయని అంచనా. కనుక చమురు రంగంలో సౌదీ అరేబియా స్థానం తిరుగులేనిది.

అయితే భారత్-సౌదీ అరేబియాల మధ్య సహకారం కేవలం చమురు-ఇంధన రంగాలకు మాత్రమే పరిమితమై లేదు. ఇరు దేశాల అధినేతలూ తీసుకున్న చొరవ కారణంగా ఈ సహకారం బహుళరంగాలకు విస్తరించింది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, రక్షణ, సాగర భద్రత, పెట్టుబడులు, పర్యాటకం తదితర అనేక రంగాలకు విస్తరించింది. ఇప్పుడు సౌదీ అరేబియాలో ఆర్థిక సంస్కరణల కార్యక్రమం భారీయెత్తున సాగుతోంది. అందులో గణనీయమైన భాగస్వామ్యం ఇవ్వడంతోపాటు మన దేశంలోని పెట్రోకెమికల్స్, మౌలిక సదుపాయాలు, మైనింగ్ తదితర రంగాల్లో సౌదీ సహకారం అందించాలని మన దేశం కోరుకుంటోంది. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో ఇటువంటి పరిస్థితి లేదు. మనకు అప్పటికి సోవియెట్ యూనియన్‌గా ఉన్న రష్యాతో మంచి సంబంధాలుండేవి. అటు సౌదీ అరేబియా అమెరికా అనుకూల వైఖరితో ఉండేది. దానికితోడు భారత్‌తో సంబంధాల విషయం వచ్చేసరికి అది పాకిస్తాన్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించేది. ఇప్పుడు అదంతా మారింది. రెండు దేశాలూ సకల రంగాల్లో సన్నిహితం కావాలని నిర్ణయించాయి. కశ్మీర్ భారత్ ఆంతరంగిక వ్యవహారమని, దాని జోలికి పోవద్దని సౌదీ నేతలు భావించారు. జమ్మూ-కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం, 370 అధికరణను రద్దుచేయడం వంటి అంశాల్లో ఈ కారణం వల్లే సౌదీ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. టర్కీ తరహాలో సౌదీ కూడా స్పందిస్తుందనుకున్న పాకిస్తాన్ ఈ పరిణామంతో ఖంగుతింది.

పొరుగునున్న పాకిస్తాన్ నుంచి మనకు ఉగ్రవాద బెడద ఉన్నట్టే సౌదీ అరేబియాకు కూడా ఇరుగు పొరుగు నుంచి ముప్పు కలిగే ప్రమాదం ఉంది. ఇటీవలే అక్కడి ఆరామ్‌కో చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడులు జరిగి భారీ నష్టం సంభవించింది. పశ్చిమాసియాలో సైనికపరంగా సౌదీ శక్తిమంతమైనదే అయినా, ఏటా అది ఆయుధాల కోసం వందలకోట్లు వెచ్చిస్తున్నా, ఉగ్రవాద వ్యతిరేక పోరులో దానికి అనుభవం తక్కువ. కనుకనే ఈ రంగంలో సహకరించుకోవాలని భారత్, సౌదీ అరేబియాలు నిర్ణయించుకున్నాయి. ఉమ్మడి సైనిక శిక్షణ కార్యక్రమాలు, విన్యాసాలు జరపడం ఇలాంటి లోటుపాట్లను తీరుస్తుంది. ఫిబ్రవరిలో బిన్ సల్మాన్ మన దేశంలో పర్యటించినప్పుడు ఈ విషయంలో ఒప్పందం కుదరింది. అనంతరం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సౌదీ వెళ్లి దానికి కొనసాగింపుగా చర్చలు జరిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఈ ఏడాది ఆఖరులో లేదా వచ్చే ఏడాది మొదట్లో రెండు దేశాల ఉమ్మడి నావికా దళ విన్యాసాలు జరుగుతాయి. అంతరిక్ష సాంకేతికతపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సౌదీ నిర్ణయించింది. కనుక ఈ రంగంలో సైతం మన దేశానికి అవకాశాలు బాగా పెరుగుతాయి. రిమోట్ సెన్సింగ్, ఉపగ్రహ కమ్యూనికేషన్లు, ఉపగ్రహ ఆధారిత సముద్రయాన నిర్వహణ వగైరాల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)కు అపారమైన అనుభవం ఉంది. వీటన్నిటా రెండు దేశాలూ కలిసి పనిచేస్తే ఉమ్మడిగా లాభపడటానికి అవకాశాలుంటాయి. గతంతో పోలిస్తే ఇరు దేశాలూ చాలా రంగాల్లో సన్నిహితమయ్యాయి గనుక ద్వైపాక్షిక సంబంధాలు మరింత ఉన్నత స్థాయికి వెళ్తాయి. అయితే రెండు దేశాల మధ్య ఏర్పడే ద్వైపాక్షిక సంబంధాలు పటిష్టంగా ఉండాలంటే అవి రెండూ తమ జాతీయ ప్రయోజనాలపైనే దృష్టిపెట్టాలి తప్ప మూడో దేశం ప్రయోజనాల గురించి ఆలోచించకూడదు. భారత్, సౌదీ అరేబియాలు రెండూ ఈ అంశాన్ని గమనంలోకి తీసుకుంటే అచిరకాలంలోనే ద్వైపాక్షిక సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, తిథి శు.విదియ ఉ.6.01 వరకు, తదుపరి తదియ తె.5.03 వరకు (తెల్లవారితే గురువారం),నక్షత్రం... అనూరాధ రా.1.34 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం ఉ.6.04 నుంచి 7.37 వరకు, దుర్ముహూర్తం ప.11.20 నుంచి 12.06 వరకు అమృతఘడియలు... ప.3.25 నుంచి 4.53 వరకు.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

సమృద్ధి వెలుగులో ఆకలి నీడలు

విశ్లేషణ

దేవీందర్ శర్మ

దేశంలోని అదనపు ఆహార నిల్వల సంచులను ఒకదానిపై ఒకటిగా పేర్చుకుంటూ పోతే వాటిపై నడుచుకుంటూ చంద్రుడి వద్దకు వెళ్లి మళ్లీ తిరిగిరావచ్చు. పైగా మన ఆహార నిల్వలు రానురాను పెరుగుతూనే ఉన్నాయి. ఇంత సమృద్ధిగా ఆహార నిల్వలు ఉన్నప్పటికీ పొరుగు దేశాల్లోకంటే ఆకలి బాధా సూచికలో భారత ర్యాంకు ఘోరంగా పడిపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఆహారోత్పత్తిలో, అదనపు మిగులులో రికార్డులన్నింటినీ బద్దలు చేస్తున్న భారత్‌లో ప్రతిరోజూ 2,400 మంది చిన్నారులు రకరకాల పోషకాహార లేమితో అల్లాడుతూ మృత్యువాత పడుతుండటం సమృద్ధి వెనుక దాగిన చీకట్లను స్పష్టంగా చూపుతోంది. ప్రతి ఏటా 8 లక్షల మంది పిల్లలు ఆకలిదప్పులతో కన్నుమూస్తున్న స్థితిలో, జనాభాలో అధిక శాతానికి తగిన పోషకాహారం లేని నేపథ్యంలో భారత్ ఆర్థిక అగ్రరాజ్యంగా మారాలనే కలను ఎన్నటికీ సాకారం చేసుకోలేదు.

సమృద్ధికి సంబంధించిన ఈ వింత పరామితి ఇప్పటికీ ఊహకు అందనివిధంగానే ఉంటోంది. ఒకవైపున దేశంలో గోధుమ నేలలు విస్తారమైన పంటలతో కళకళలాడుతుండగా మరోవైపున ప్రపంచ క్షుద్బాధా సూచి (జీహెచ్ఐ) భారత్‌కు అకలితో అలమటించిపోతున్న 117 దేశాల్లో 102వ స్థానమిచ్చింది. ఇది చాలదన్నట్లుగా, తాజా యూనిసెఫ్ నివేదిక అయిదేళ్లలోపు పిల్లలు అధిక మరణాల పాలవుతున్న దేశాల జాబితాలో భారత్‌ను చేర్చింది. గత ఏడాది భారత్‌లో 8.82 లక్షల మంది చిన్నపిల్లలు మరణించారని యూనిసెఫ్ నివేదించింది.

ఒకవైపున వినియోగదారీ వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ తనకు తలకు మించిన భారంగా తయారవుతున్న ఆహారధాన్యాల నిల్వలను కాస్త తగ్గించి పుణ్యం కట్టుకోవలసిందిగా భారత విదేశాంగ శాఖను వేడుకుంటోంది. భారత ఆహార సంస్థ వద్ద పేరుకుపోతున్న ఆహార ధాన్యాలలో అదనపు నిల్వలను ప్రపంచంలో అవసరమైన దేశాలకు అందించే అవకాశాలను పరిశీలించాల్సిందిగా ఈ మంత్రిత్వ శాఖ భారత విదేశాంగ శాఖను కోరింది. విచిత్రం ఏమిటంటే దేశంలో 6 నుంచి 23 ఏళ్ల వయసులో ఉన్న పిల్లల్లో 90 శాతం మందికి తినడానికి తగినంత ఆహారం లేక అల్లాడిపోతున్న పరిస్థితుల్లో మన ఆహార ధాన్యాల నిల్వలను బయటిదేశాలకు పంపవలసిందిగా వేడుకోవడమే. ఆకలి, పోషకాహార సమస్యను తీవ్రతరం చేస్తూ మన అమూల్య వనరులైన పిల్లల జీవితాల్లో నిశ్శబ్ద విషాదాన్ని సృష్టిస్తుండగా, బయటిదేశాలకు మానవీయప్రాతిపదికన ఆహార నిల్వలను అందించాలన్న ప్రతిపాదన కంటే మించిన అభాస మరొకటి ఉండదు. దేశంలో ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకరు తగిన తిండి లేకుండా బక్కచిక్కిపోతున్న వాస్తవం తెలిసిన విషయమే.

అక్టోబర్ 1 నాటికి 307.70 లక్షల టన్నుల ఆహార ధాన్యాల సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా భారత ఆహార సంస్థ ఇప్పటికే రెట్టింపు స్థాయిలో 669.15 లక్షల టన్నుల వరి, గోధుమ పంటను సెప్టెంబర్ 1 నాటికే సేకరించింది. వరి పంట ఇప్పుడు తారస్థాయిలో పోగవుతున్న స్థితిలో రాబోయే కొద్ది వారాల్లో కేంద్ర ఆహార నిల్వల గిడ్డంగులు ధాన్య సమృద్ధితో పొంగిపొరలనున్నాయి. దీనికితోడుగా దేశంలో 2018-19 సంవత్సరంలో పళ్లు, కూరగాయలు 314.5 మిలియన్ టన్నులకు పోగుపడ్డాయి. ఇక పాల ఉత్పత్తి 176 మిలియన్ టన్నులతో రికార్డు సృష్టించింది. అంటే దేశంలో పోషకాహారానికి కొరతే లేదని ఈ గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఆహార ధాన్యాలను ఇంత సమృద్ధిగా నిల్వ ఉంచుకున్న దేశంలో అత్యధిక జనాభా ఆకలితో అలమటిస్తుండటం కంటే మించిన అసందర్భం ఉండదు.

దీన్ని మరింత సులువుగా చెప్పుకుందాం. దేశంలోని అదనపు ఆహార నిల్వల సంచులను ఒకదానిపై ఒకటిగా పేర్చుకుంటూ పోతే వాటిపై నడుచుకుంటూ చంద్రుడి వద్దకు వెళ్లి మళ్లీ తిరిగిరావచ్చు. ఇంత సమృద్ధికరంగా ఆహార నిల్వలు ఉన్నప్పటికీ పొరుగు దేశాల్లో కంటే ఆకలి బాధా సూచికలో భారత ర్యాంకు ఘోరంగా పడిపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. కెనడా తన రికార్డును మెరుగుపర్చుకుని అంతర్జాతీయంగా 25వ ర్యాంకులో నిలబడగా, బ్రిక్స్ దేశాలన్నిటి

కంటే భారత్ వెనుకబడిపోయింది. శ్రీలంక (66), నేపాల్ (73), బంగ్లాదేశ్ (88), పాకిస్తాన్ (94) ర్యాంకులతో మనకంటే ఎంతో మెరుగ్గా ఉండగా, చివరకు వెనిజులా (65), ఉత్తర కొరియా (92), ఇథియోపియా (93) ర్యాంకులతో మనల్ని అధిగమించటం బాధాకరం. నిజానికి, 2006 నుంచి ప్రపంచ క్షుద్బాధా సూచిని ప్రకటిస్తుండగా, 14 రిపోర్టుల తర్వాత కూడా భారత్ ఆకలి, పోషకాహార లేమి సంబంధించి ఏమాత్రం మెరుగుపడలేదు.

ఇది మన ప్రాధాన్యతల ఎంపికకు సంబంధించిన సమస్య. కొన్నేళ్లుగా అత్యధిక ఉత్పాదకతను సాధించడంపైనే మన విధాన నిర్ణేతల దృష్టి ఉంటూ, దేశంలో ప్రబలుతున్న ఆకలిని, పోషకాహార లేమిని తేలికగా పక్కనపెడుతూ వస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ అధికంగా అభివృద్ధి చెందితే ఆకలిదప్పులతో జీవిస్తున్న వారి జనాభా దానికదే తగ్గిపోతుందనే ఆర్థిక వ్యవస్థ ప్రాధాన్యతా దృక్పథాన్ని దేశంలో కంటికి కనబడే ఆకలి, కనిపించకుండా మరుగున ఉండే ఆకలి రెండూ వెక్కిరిస్తూ వస్తున్నాయి. పైగా, ఆర్థిక వ్యవస్థ పెరుగుదలతోపాటే ఆకలి, పోషకాహార లేమి కూడా అదే స్థాయిలో పెరుగుతూ వస్తోంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పోషకాహార లేమిని 'జాతీయ అవమానం'గా భావించాలని ప్రకటించినా పరిస్థితిలో మార్పు లేదు.

ఆకలిని తొలగించడం సంక్లిష్టమైన, సవాలుతో కూడిన కర్తవ్యమని అర్థం చేసుకుంటాను కానీ గత కొన్నేళ్లుగా పిల్లల పోషకాహార లేమి, ఆహార దుబారా వంటి అంశాల్లో దేశం ప్రగతి సాధించి ఉంటే ఆకలి చరిత్రను నివారించడం అనే భారీ లక్ష్యం అసాధ్యమై ఉండేది కాదు. జనాభాలోని మూడింట రెండొంతుల మందికి సబ్సిడీ కింద ఆహార ధాన్యాలను అందించే లక్ష్యంతో 2013 జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకురావడమే కాకుండా, పిల్లల్లో పోషకాహార లేమితో తలపడేందుకు, ఆకలిని నిర్మూలించేందుకు అనేక పథకాలను కేంద్ర స్థాయిలో ప్రవేశపెట్టినప్పటికీ సూక్ష్మ ఆర్థిక విధానాలలో.. వీటిని సాధించాల్సిన లక్ష్యాల్లో ఒకటిగా పెట్టుకోలేదు. పైగా జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు కూడా అలా ఆహార సబ్సిడీలను పెంచడం వల్ల ద్రవ్యలోటు పెరిగిపోతుందని మన జాతీయ స్రవంతి ఆర్థికవేత్తలు నిరసన గళం వినిపించారు.

తీవ్రమైన దారిద్ర్యాన్ని, ఆకలిని నిర్మూలించేందుకు నాటి బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా 2003లో ప్రారంభించిన 'జీరో హంగర్' (సంపూర్ణంగా ఆకలిని నిర్మూలించడం) కార్యక్రమంతో భారత్ విధానాలను పోల్చి చూద్దాం. జీరో హంగర్ కార్యక్రమం కింద వ్యవసాయంలో వ్యవస్థాగతమైన మార్పులను నాటి బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమం కింద 2011 నాటికే బ్రెజిల్‌లో దాదాపు మూడు కోట్ల 20 లక్షలమంది ప్రజలు (జనాభాలో 16 శాతం) దారిద్ర్యం కోరల నుంచి బయటపడ్డారని ప్రముఖ పత్రిక 'ది గార్డియన్' పేర్కొంది. దీనికి 'బోల్సా ఫ్యామిలియా' వంటి నగదు బదిలీ పథకాలు తోడై జనాభాలో పావు శాతం పైగా ప్రజలకు నిజంగా ఊతమిచ్చాయి. ఆహార భద్రత, విద్య, వైద్యాలను అందుబాటులో ఉంచడం, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అభివృద్ధిని ప్రోత్సహించడం వంటి వాటి కలయికే బోల్సా ఫ్యామిలియా. పర్యవసానంగా కేవలం 15 ఏళ్ల వ్యవధిలోనే బ్రెజిల్ ప్రపంచ క్షుద్బాధా సూచి కలో 18వ ర్యాంకులో నిలిచింది. అంటే ఆకలి నివారణలో చైనాకంటే అగ్ర స్థాయిని బ్రెజిల్ సాధించింది.

సారాంశంలో బ్రెజిల్ అమలు పర్చిన జీరో హంగర్ విధానాలు ఆహారోత్పత్తిని ఆకలి నిర్మూలనతో ముడిపెట్టడంలో విజయవంతమయ్యాయి. ఈ పథకంలోనూ కొన్ని తేడాలు ఉండవచ్చు కానీ, ఆకలిని పూర్తిగా నిరోధించడానికి బ్రెజిల్ ఇప్పటికీ నిర్ణీత గడువుతో కూడిన పథకాలను అమలు చేస్తోంది. భారత్‌లో ఆహార ఉత్పత్తిని పెంచడంపైనే పాలకుల విధానాలు దృష్టి పెడుతూ ఆహారధాన్యాలు తక్కువగా ఉంటున్న ప్రాంతాలకు అదనపు ఆహార నిల్వలను తరలించే పద్ధతిని అమలుచేస్తూ ఉన్నప్పటికీ, రైతుల సంక్షేమానికి మాత్రం ఏ ప్రభుత్వమూ ప్రాధాన్యత ఇచ్చిన చరిత్ర లేదు. వ్యవసాయంలో 60 కోట్లమంది ప్రజలు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా పాల్గొంటున్న దేశంలో జీరో హంగర్‌ని సాధించడానికి చేసే ఏ పథకమైనా వ్యవసాయాన్ని మౌలికంగా పునరుద్ధరించాల్సి ఉంటుంది. వ్యవసాయరంగంలో ప్రభుత్వ రంగ పెట్టుబడులను పెంచవలసి ఉంది. అయితే ఆర్బీఐ ప్రకారం 2011-12 నుంచి 2016-17 మధ్య ప్రభుత్వరంగ సంస్థలు వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడులు మన స్థూల దేశీయోత్పత్తిలో 0.4 శాతం మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది.

గత కొన్ని దశాబ్దాలుగా ఆకలితో, పోషకాహార లేమితో పోరాడ్డానికి సంబంధించి లెక్కలేనన్ని వాగ్దానాలు చేశారు. హామీలు గుప్పించారు. కానీ దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, భారత్‌లో ప్రతి రోజూ 2,400 మంది చిన్నారులు రకరకాల పోషకాహార లేమితో అల్లాడుతూ మృత్యువాత పడుతుండటమే. దేశంలో జరుగుతున్న ఈ భారీ మానవ విషాదానికి.. పిల్లల నోటికి సరైన మోతాదులో మనం ఆహారాన్ని అందించకపోవడమే కారణం. ఆహార ఉత్పత్తిలో కొరత లేదు. ఆర్థిక విధానాలను ప్రకటించి అమలుచేసే సామర్థ్యంలో కొరత లేదు. కానీ, ఆకలిని తొలగించడానికి బలమైన రాజకీయ సంకల్పం నిజంగా కరువైపోయింది. ప్రతి ఏటా కొన్ని లక్షల మంది పిల్లలు ఆకలిదప్పులకు తాళలేక కన్నుమూస్తున్న స్థితిలో, జనాభాలో అధిక శాతానికి తగిన పోషకాహారం లేని నేపథ్యంలో భారత్ ఆర్థిక అగ్రరాజ్యంగా మారాలనే కలను ఎన్నటికీ సాకారం చేసుకోలేదు.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ-మెయిల్ : hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మెగా

"మెగా ఫ్యామిలీ అనే సినిమా 39మంది పిల్లలున్న ఓ వ్యక్తి గురించి. కానీ, ఈ సినిమాలో చాలామంది పిల్లలు ఉండటం, నేను పిల్లల సినిమాలు బాగా తీయలేనందున ఈ సినిమా రూపొందించకూడదని నిర్ణయించుకున్నా"

– రామ్ గోపాల్ వర్మ, దర్శకుడు

వాళ్లు

"కశ్మీర్‌లో యూరోపియన్ పార్లమెంట్ సభ్యులు పర్యటించడానికి అంతా సాధారణ పరిస్థితులే ఉంటాయి. కానీ, మన పార్లమెంట్ సభ్యులు వెళ్లడానికి మాత్రం అసాధారణ పరిస్థితులు నెలకొంటాయి"

– కపిల్ సిబల్, కాంగ్రెస్ నేత

చరిత్ర

"నేపాల్‌లో బయటపడిన ఈ టెర్రకోట శకలాన్ని తప్పడు చరిత్రకారిణి రొమిల్లా థాపర్‌కు ఎవరైనా చూపిస్తారా? బుద్ధుడి నుంచి స్ఫూర్తి పొంది యుధిష్ఠరుడు తన రాజ్యాన్ని త్యజించాడని కారుకూతలు కూసింది కదా? హరప్పా సంస్కృతికంటే మహాభారతమే ముందని ఈ శకలం నిరూపిస్తుంది"

– షేఫాలీ వైద్య, రచయిత

దాదా

"బంగ్లాదేశ్‌తో ఇండియా ఈడెన్ గార్డెన్‌లో డే అండ్ నైట్ ఆడే టెస్ట్ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. టెస్ట్ మ్యాచ్‌లకు జనాలు రావాలంటే కొత్త మార్గాలు అవసరం. బీసీసీఐ అధ్యక్షుడైన దాదా చొరవతో డే అండ్ నైట్ మ్యాచ్ ఆడే ఇండియా టీమ్‌ను చూడటం చాలా ఆనందకరం"

– మహమ్మద్ కైఫ్, క్రికెటర్

రాబందులు

"గుంట నక్కలు, రాబందులు శవాల వేటకు బయల్దేరాయి. ఎక్కడ ఒక ప్రాణం పోయినా పండుగే వాటికి. చిన్న సమస్యలను పెద్దవి చేసి చూపడం. ఇబ్బందుల్లో ఉన్న వారిని మరింత రెచ్చగొట్టడమే రాబందులకు తెలిసిన విద్య. పీక్కు తినడమే వచ్చు. ప్రాణం పోయడం ఎలాగూ తెలియదు"

– విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

విశ్వగురు

"సౌదీ అరేబియాలో మన ప్రధాని మోదీకి లభించిన ఘన స్వాగతం 'ముస్లింలు మోదీని ద్వేషిస్తున్నార'నే వారికి చెంపపెట్టులాంటిది. ప్రపంచంలోనే శక్తివంతమైన ముస్లిం దేశం మన ప్రధానిని ఎలా గౌరవించిందో అందరూ చూడొచ్చు. ఇప్పటికీ ఇండియా విశ్వగురు కాదని మీరు భావిస్తారా?"

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

హనుమాన్

"శ్రీలంకలోహనుమాన్ దేవాలయానికి వెళ్లినప్పుడు.. 'మీ దేశాన్ని తగులబెట్టిన వారికి గుడి ఎలా కట్టారు?' అని మా అమ్మాయి డ్రైవర్‌ను అడిగింది. 'అది భారతీయుల దృక్కోణం. మేము మా చరిత్రను గౌరవిస్తాం, కానీ దాన్నే పట్టుకుని వేళ్లాడం' అని అతను చెప్పాడు"

– కార్తీక్, కన్సల్టెంట్

మూసివేత

"మత ఛాందసవాదులైన యూరోపియన్ పార్లమెంట్ సభ్యుల పర్యటన నేపథ్యంలో కశ్మీర్‌లో పూర్తిగా మూసివేత కొనసాగుతోంది. శ్రీనగర్‌లో అక్కడక్కడా ఘర్షణలు చోటు చేసుకున్నట్టు సమాచారం అందుతోంది"

– అహ్మర్ ఖాన్, జర్నలిస్ట్

జీర్ణ దేవాలయాలను ఉద్ధరించిన జీవో

సందర్భం

వివైఆర్ కృష్ణారావు

ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలంగా అర్చకులు కంటున్న కలలు నెరవేరేలా గత సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగ భద్రత, అర్హత కలిగిన వారసత్వ గుర్తింపు, చిన్న దేవాలయాలపై దేవాదాయ శాఖ పెత్తనాన్ని తొలగించే ఈ ఉత్తర్వుల కోసం అరకొర జీతాలతో, సదుపాయాలతో గ్రామాల్లో దేవాలయాల్ని అంటి పెట్టుకొని జీవిస్తూ ఉన్న అర్చకులు ఎదురుచూస్తూ ఉన్నారు. గత 30 సంవత్సరాలుగా ఇది సాధించటం కోసం అర్చక సమాఖ్య ప్రతినిధులు తిరగని ఆఫీసు లేదు, కలవని అధికారులు, రాజకీయ నాయకులు లేరు. 1987లో మొదలైన ఈ కష్టాలకు 2007లో రాజశేఖర్ రెడ్డి చట్ట సవరణ ద్వారా వెసులుబాటు కల్పిస్తే ఒక దశాబ్దం తర్వాత దానిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆచరణ రూపంలో తీసుకువచ్చారు. 2017 లో ఈ ప్రభుత్వ ఉత్తర్వుల ముసాయిదా తయారై జీవో 76 రూపంలో విడుదలైనా, ఆనాటి ప్రభుత్వం వాటిని నిర్ధారించకుండానే వదిలేసింది. ఈరోజు శాశ్వత ప్రాతిపదికలో జీవో 439 ద్వారా ఆ అంశాలను నిర్ధారించారు.

1987వ సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ చట్టాన్ని సమూలంగా చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సు మేరకు సవరించి నూతన చట్టాన్ని తీసుకువచ్చారు. అంతవరకు ఉన్న వ్యవస్థను నాశనం చేయడంలో ఈ చట్టం సఫలీకృతం అయింది. కానీ దానికి ప్రత్యామ్నాయంగా మరొక విధానాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చట్టంలో ఎక్కడా కనిపించలేదు. సంస్కరణ ప్రధానంగా కాకుండా, ఎవరి మీదనో ద్వేషంతో, కోపంతో చట్టాలు తీసుకొని వస్తే దాని దుష్పరిణామాలు ఇలాగే ఉంటాయి.

ఈ చట్ట సవరణలో తిరుమల తిరుపతి దేవస్థానంలోని మిరాసి హక్కులను తొలగించారు. ఈ మొత్తం చట్టంలో హర్షించదగిన సంస్కరణ ఇది ఒకటి. మరి ఇంక ఏ దేవాలయంలో లేని విధంగా తిరుమల దేవాలయంలో స్వామి వారికి సేవ చేసినందుకు ఆలయ ఆదాయంలో రకరకాల సేవలకు భాగం ఏర్పాటు చేయడం జరిగింది. ఇటువంటి మిరాసీలు చాలా ఉన్నా ప్రధానమైనది అర్చక మిరాసి. ఆలయ ఆదాయం పెరగటంతో మిరాసీదారులకు కూడా ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. ఈ మిరాసి రద్దుతోపాటు వారసత్వ హక్కు, చిన్న గ్రామాలలో అర్చకులకు వచ్చే దక్షిణలు, దేవాలయాల్లో సేవ చేసినందుకు ఏర్పాటుచేసిన సర్వీస్ ఈనాములను రద్దు చేశారు. దేవాదాయ శాఖను విస్తృతపరచి ఆదాయం లేని చిన్న చిన్న దేవాలయాలను కూడా దేవాలయ శాఖ పరిధిలోకి తీసుకొచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న దేవాలయాలను వాటిని అంటిపెట్టుకుని అరకొర ఆదాయంతో పని చేస్తున్న అర్చకులను ఈ సంస్కరణ బాగా దెబ్బ తీసింది. వారికున్న చిన్న ఆదాయపు వనరులను తీసివేశారు కానీ, ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఎటువంటి వనరులను ఏర్పాటు చేయలేకపోయింది. చిన్న ఆలయాల నిర్వహణకు ప్రభుత్వ ప్రతిపాదన ఏమిటి అని సుప్రీంకోర్టు వేసిన ప్రశ్నకు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర సమాధానం లేకపోయింది. ఈ అంశాన్ని పరిశీలించి సుప్రీంకోర్టు ఇచ్చిన భిన్న ఉత్తర్వులను అమలు చేయడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆ రోజుల్లో తాత్సారం ప్రదర్శించింది. రాజకీయంగా పట్టించుకోని, స్పందించని నిరంకుశ ప్రభుత్వం, అవినీతిమయమైన, చలనం లేని దేవాదాయ, ధర్మాదాయ శాఖతో ఆ రోజుల్లో చిన్న దేవాలయాల్లోని పురోహితులు పడిన కష్టాలు వర్ణనాతీతం. చట్ట సవరణ వారికి వ్యతిరేకంగా

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 30-10-2019

వారోత్సవం సినిమా పేజీలో...

ఆపరేషన్ కేలా మీలర్

నాలుగేళ్ల క్రితం ఐసిస్ చిత్ర హింసలకు బలైన మానవతావాది 'కేలా మీలర్' పేరిట ఐసిస్ ఉగ్రనేతను హతమార్చే ఆపరేషన్‌ను చేపట్టి, అతడిని తుదముట్టించడం ద్వారా అగ్రరాజ్యం తన పౌరురాలికి ఘనమైన నివాళిని అర్పించింది.

సిరియాలోని అలెప్పో ప్రాంతంలో ఉన్న ఒక ఆసుపత్రిని సందర్శించేందుకు 2013 ఆగస్టులో టర్కీ నుంచి బయల్దేరిన ఒక అమెరికన్ యువతి ఆ తర్వాత ఎవరికీ కనిపించలేదు! ఆ ఆసుపత్రిలో ఉన్నది ఐసిస్ ఉగ్రవాదుల బారినపడిన శరణార్థి క్షతగాత్రులు. వారితో మాట్లాడి, వారికి సేవలు అందించడం కోసం వేల మైళ్ల దూరం ప్రయాణించి వెళ్లిన ఆ యువతి పేరు కేలా మీలర్. యు.ఎస్.లోని ఆరిజోనా రాష్ట్రం ఆమెది. సామాజిక కార్యకర్త. అంతకన్నా కూడా మానవతా వాది. మీలర్ అదృశ్యంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆనాడే ఆందోళన వ్యక్తం చేసింది. రెండేళ్లు గడిచినా మీలర్ ఆనవాళ్ల జాడ కనిపించకపోవడంతో ఐసిస్ ఉగ్రవాదులే ఆమెను అపహరించి ఉంటారని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు వ్యక్తం చేసిన అనుమానాలే చివరికి నిజమయ్యాయి. ఐసిస్ నిర్బంధంలో ఉన్న మీలర్ చనిపోయిందన్న వార్త 2015 ఫిబ్రవరిలో ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. అయితే రఖా పట్టణంపై జోర్డాన్ జరిపిన వైమానిక బాంబు దాడుల్లో మీలర్ చనిపోయినట్లు ఐసిస్ ఒక ప్రకటన చేసింది! తర్వాత బయటపడిన వాస్తవం వేరు. మీలర్‌ను చేత చిక్కించుకున్న ఐసిస్ ఉగ్రవాద నాయకుడు అబూ బకర్ అల్ బాగ్దాదీ ఆమెపై పలుమార్లు అత్యాచారం జరిపి, అనేక విధాలుగా చిత్రహింసలు పెట్టి చివరికి హత్య చేశాడు. ఈ క్రమంలో నాలుగున్నర ఏళ్ల తర్వాత మొన్న శనివారం రాత్రి సిరియాలోని బారిషా అనే గ్రామంలో అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు జరిపిన దాడుల్లో అల్ బాగ్దాదీ హతమయ్యాడు. ఈ ఆపరేషన్‌కు అమెరికా పెట్టిన పేరు 'కేలా మీలర్'. అలా తన దేశ పౌరురాలికి అగ్రరాజ్యం నివాళి అర్పించింది. నివాళి అనేకన్నా కేలా ఆత్మగౌరవానికి సైనిక వందనం చేసిందనే అనాలి.

అల్ బాగ్దాదీ హతమైనట్లు వెల్లడవగానే ప్రపంచ మీడియా కేలా మీలర్ తండ్రి కార్ల్‌ను కలిసింది. ''నా కూతుర్ని కిడ్నాప్ చేశారు. బందీగా అనేక జైళ్లు తిప్పారు. నిర్బంధ శిబిరాల్లో ఉంచారు. మానసికంగా, శారీరకంగా అవమానించారు. చివరికి అల్ బాగ్దాదీ అత్యాచారం కూడా చేశాడు. ఏ తల్లిదండ్రులకూ ఇంతటి మానసిక క్షోభ ఉండకూడదు'' అని ఆయన అన్నారు. బందీగా ఉండి కూడా ఎంతో ధైర్యంగా తన కూతురు రాసిన ఉత్తరాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ''చీకటిలోనూ వెలుగును చూస్తున్నాను. నిర్బంధంలోనూ స్వేచ్ఛను కనుగొంటున్నాను. ప్రతి ప్రతికూలత లోనూ ఒక అనుకూలత ఉంటుంది'' అని కేలా మీలర్ ఆ లేఖలో రాశారు. కేలా తల్లి మార్షా కూతురి మరణం నుంచి నేటికీ తేరుకోలేదు. ''నిజంగా నా కూతురుకి ఏమైందో నాకు తెలియాలి'' అంటూనే ఉన్నారు. కేలా దైవభక్తురాలు. చనిపోయే వరకు కూడా ఆ దేవుడు పంపిన దూతగానే ఆమె శరణార్థులకు సేవలు అందించారు. 'డాక్టర్స్ వితవుట్ బార్డర్స్' (జెనీవా) ఆసుపత్రి సిరియా శాఖ నుంచి ఆమె అడుగు బయటపెట్టిన కొద్దిసేపటికే ఐసిస్ ఉగ్రవాదులకు పట్టుబడ్డారు. కేలా మీలర్ మానవ హక్కుల కార్యకర్తగా మారడానికి పొలిటికల్ సైన్స్‌లో ఆమె చేసిన డిగ్రీ, కాలేజీ విద్యార్థినిగా ఆమె నిర్వహించిన చర్చి విధులు దోహదపడ్డాయని అంటారు.

కాలేజీ విద్యార్థినిగా కేలా మీలర్

> చీకటిలోనూ వెలుగును చూస్తున్నాను. నిర్బంధంలోనూ స్వేచ్ఛను కనుగొంటున్నాను. ప్రతి ప్రతికూలతలోనూ ఒక అనుకూలత ఉంటుంది.
> - కేలా మీలర్

కేలా మీలర్

మహిళా రిజర్వేషన్ బిల్లు

మళ్లీ మాటల్లోకి!

ఇరవై మూడేళ్ల క్రితం హెచ్.డి.దేవెగౌడ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు పార్లమెంటులో ప్రతిపాదనకు వచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు.. ఆయన తర్వాత ఐ.కె.గుజ్రాల్, అటల్ బిహారి వాజపేయి, మన్మోహన్ సింగ్, ఇప్పుడు నరేంద్ర మోదీ రెండో దఫా హయాంలోనూ అర్ధామోదంతో ఆగిపోయిన దశలోనే ఉంది. 2010 మార్చి 9న రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందాక, లోక్‌సభలో ఆమోదం పొందేందుకు గట్టి ప్రయత్నం ఒక్కటైనా జరగలేదు. మంగళవారం తాజాగా భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఢిల్లీ యూనివర్సిటీ ప్రసంగంలో బిల్లు ప్రస్తావన తెచ్చిన సందర్భంగా.. మళ్లీ ఒకసారి బిల్లు గురించి, బిల్లు ఎక్కడ మొదలైందీ, ఎక్కడ ఆగిపోయిందీ మననం చేసుకుందాం.

- మహిళా బిల్లు చట్టంగా వస్తే కనుక లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల స్థానాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లభిస్తుంది.
- మహిళా బిల్లు చట్టంగా రావాలంటే లోక్‌సభలో, రాజ్యసభలో ఆమోదం పొందాలి. దేశంలోని కనీసం సగం రాష్ట్రాలు ఆమోదం తెలపాలి. రాష్ట్రపతి సంతకం చేయాలి. అయితే ఇప్పటి వరకు ఒక్క రాజ్యసభలో మాత్రమే బిల్లు ఆమోదం పొందింది.
- తొలిసారి హెచ్.డి.దేవెగౌడ ప్రభుత్వం 1996 సెప్టెంబర్ 12న మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఆయన తర్వాత ముగ్గురు ప్రధానమంత్రులు (ఐ.కె.గుజ్రాల్, అటల్ బిహారీ వాజపేయి, మన్మోహన్‌సింగ్) మారారు. నాలుగో ప్రధాని నరేంద్ర మోదీ రెండో టెర్మ్‌లో కూడా ఉన్నారు. ఇప్పటి వరకు బిల్లుకు పూర్తిస్థాయి ఆమోదం లభించలేదు!
- సి.పి.ఐ. ఎంపీ గీతా ముఖర్జీ అధ్యక్షతన బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ తన నివేదికను 1996 డిసెంబర్ 9న లోక్‌సభకు సమర్పించింది.
- వాజపేయి ప్రభుత్వంలో 1998 జూన్ 26న మహిళా బిల్లు తిరిగి లోక్‌సభ ముందుకు వచ్చింది.
- మళ్లీ వాజపేయి ప్రభుత్వమే 1999 నవంబర్ 22న బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది.
- తిరిగి 2002లో, 2003లో వాజపేయి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం బిల్లును సభ ముందుకు తెచ్చింది.
- ఎన్డీయే తర్వాత, 2004లో అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం మహిళా బిల్లు తెస్తామని చెప్పింది కానీ, నాలుగేళ్ల వరకు అలాంటి ప్రయత్నాలే చేయలేదు!
- ఇంకో ఏడాదిలో ఎన్నికలు ఉన్నాయనగా, 2008 మే 6న బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. లా అండ్ జస్టిస్ స్థాయీ సంఘం పరిశీలనకు పంపింది.
- స్థాయీ సంఘం తన నివేదికను సమర్పించాక, 2009 డిసెంబర్17న మన్మోహన్ సింగ్ ప్రభుత్వం రెండు సభల్లో బిల్లును ప్రవేశపెట్టింది. సమాజ్‌వాదీ, జనతాదళ్ (యు), ఆర్జేడీ నిరసనలు, తీవ్ర వ్యతిరేకతల నడుమ బిల్లుపై ప్రభుత్వం ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోయింది.
- బిల్లును వీలైనంత త్వరగా తెచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని 2010 ఫిబ్రవరి 22న రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.
- కేంద్ర మంత్రిమండలి 2010 ఫిబ్రవరి 25న మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపింది.

మహిళా బిల్లు రాజ్యసభ ఆమోదం పొందినట్లు తెలియగానే పార్లమెంటు హాలు బయట మహిళల ఆనంద సందోహాలు (ఫైల్ ఫొటో)

- తర్వాత కొద్ది రోజులకు 2010 మార్చి 8న బిల్లును ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. బిల్లును వ్యతిరేకిస్తూ సమాజ్‌వాది పార్టీ, ఆర్జేడీ (రాష్ట్రీయ జనతాదళ్) సభలో గందరగోళం సృష్టించాయి.
- మర్నాడు (2010 మార్చి 9) ఓటింగులో భారీ మెజారిటీతో మహిళా బిల్లును రాజ్యసభ ఆమోదించింది.
- తొమ్మిదేళ్లు గడిచాయి. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో యూపీఏ పోయి, ఎన్డీయే వచ్చింది. ఇప్పటి వరకు మళ్లీ బిల్లు మాటే లేదు.

ఈ ఏడాది నవంబర్ 23న మొదలయ్యే శీతాకాల సమావేశాలలో మహిళా రిజర్వేషన్ బిల్లు కనీసం ప్రస్తావనకైనా రావచ్చని మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన అరుణ్ జైట్లీ స్మారక సభలో వెంకయ్యనాయుడి ప్రసంగాన్ని బట్టి ఆశించవచ్చు.

అమ్మ కోరిక

భర్త పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్, తనకూ ఉద్యోగం ఉంది. జీవితంలో దక్కినవి చాలనుకుంది ఝాన్సీ. కానీ ఆమె తల్లి.. కూతురు రాజీ పడడానికి ఒప్పుకోలేదు. తల్లి కోరిక నెరవేర్చడానికి ఝాన్సీ ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది.

విజయానికి ముద్దుల కానుక : పోటీ పరీక్షల ఫలితాల్లో తల్లి పేరు చూడగానే పిల్లల సంబరం

అక్టోబర్ 24, గురువారం. గ్రూప్ 2 పరీక్ష రాసిన ఐదు లక్షలకు పైగా ఆశావహులు రిజల్ట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఆ రోజు సాయంత్రం ఐదున్నరకు భర్తకు ఫోన్ చేసింది ఝాన్సీ. ''ఈ రోజు మా రిజల్ట్స్ వెబ్‌సైట్‌లో పెడతారట'' అని క్లుప్తంగా చెప్పింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా బందోబస్తు డ్యూటీలో ఉన్నాడతడు. ''స్వీట్స్‌తో వస్తా'' అన్నాడు. ''రిజల్ట్స్ చూసుకున్న తర్వాత తెచ్చుకోవచ్చు. మీరు మామూలుగా రండి'' అని ఫోన్ పెట్టేసింది ఝాన్సీ. ఏడు గంటలకు స్వీట్స్‌తో వచ్చాడతడు. ఏడుంబావుకి ''వెబ్‌సైట్ ఓపెన్ అవుతోందమ్మా'' అని అరిచినంత పని చేసింది కూతురు మనస్విని. కంప్యూటర్ ముందు కొద్దిసేపు ఉత్కంఠ. ''టెన్షన్ వద్దు నీ పేరు ఉంటుంది'' ధైర్యం చెప్పింది ఝాన్సీ తల్లి స్వరూప. పేరు కనిపించగానే పిల్లలిద్దరూ సంతోషంతో కేకలు పెట్టారు. ''అమ్మా అన్ని పేర్లు ఉన్నాయి. నీ పేరు కనిపించకపోయేటప్పటికి భయమేసింది'' తల్లిని చుట్టుకుపోయాడు తన్మయ్. డిప్యూటీ తాసిల్దారు ఉద్యోగానికి సెలెక్ట్ అయింది ఝాన్సీ! ''దీపావళి మనింటికి ముందుగానే వచ్చింది'' అని పిల్లలు గోల చేశారు. స్వీట్లు పంచుకున్నారందరూ.

టెన్త్ ఫైనల్ ఎగ్జామ్స్

ఈ ఆనంద క్షణాలు ఆమెకి నల్లేరు మీద నడకలాగ రాలేదు. ఝాన్సీ పుట్టింది, పెరిగింది సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌లో. పదవ తరగతి ఫైనల్ పరీక్షలు రాస్తున్నప్పుడు 'ఇది కాదు పరీక్ష' అంటూ జీవితం మరో పరీక్ష పెట్టింది. పొలానికి వెళ్లి వస్తున్న నాన్న ఎడ్లబండి తిరగబడడంతో ప్రాణాలు కోల్పోయాడు. కన్నీళ్లను దిగమింగుకుని మిగిలిన పరీక్షలు రాసి ఫస్ట్ క్లాస్‌లో పాసయింది ఝాన్సీ. డాక్టర్ కావాలనే ఆమె కోరిక తండ్రితోపాటే దూరమైపోయింది. అయినా ఆశ చంపుకోలేక బైపీసీలో చేరింది. మేనత్త సలహాతో నర్స్ ట్రైనింగ్‌లో చేరింది. జీవితం నిర్దేశించిన మలుపును స్వీకరించక తప్పని పరిస్థితి. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత నర్స్‌గా ఉద్యోగంలో చేరింది. 2004 నుంచి 2011 వరకు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఉద్యోగం. భర్త పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్, తనకూ ఉద్యోగం ఉంది. జీవితంలో దక్కినవి చాలనుకుంది ఝాన్సీ. కానీ జీవితంతో కూతురు రాజీ పడడానికి ఆమె తల్లి ఒప్పుకోలేదు. ''మాకు చదువు లేదు, మిమ్మల్ని పట్టుపట్టి చదివించాను. గవర్నమెంట్ ఉద్యోగం తెచ్చుకో, మీ నాన్న సంతోషపడతాడు'' అని పరీక్షలు రాయించింది. అప్పుడు ఝాన్సీ తొమ్మిదో నెల గర్భిణి. మహేశ్వరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఉద్యోగంలో చేరేటప్పుడు కూడా తోడు వెళ్లింది తల్లి స్వరూప.

చదువుకుంటావా!

ఝాన్సీ చిన్నప్పటి నుంచి ఫస్ట్ ర్యాంకు స్టూడెంట్. గొప్ప లక్ష్యాలను కూడా పెట్టుకుంది. అయితే అవేవీ కార్యరూపం దాల్చలేదు. జీవితం ఎన్ని పరీక్షలు పెట్టినా ఆమెలో చదువుకోవాలనే కోరిక కూడా సజీవంగానే ఉండడాన్ని గమనించాడామె భర్త. ''చదువుకుంటావా, ఉద్యోగం మానేసి చదువుకో'' అని భరోసా ఇచ్చాడు. ఆమె మాత్రం ఉద్యోగం మానకుండానే డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో గ్రాడ్యుయేషన్ చేసి, కాంపిటీటివ్ పరీక్షలకు ప్రిపేరైంది.

గ్రూప్స్ పరీక్షల కోసం హైదరాబాద్ నగరానికి వచ్చి రూమ్ తీసుకుని రోజుకు పదహారు గంటలు చదువుతున్న కొత్తతరంతో పోటీ పడింది. తల్లి కోరుకున్న హోదా గలిగిన ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది. 'నర్స్‌గా తీసుకుంటున్న జీతం కంటే తక్కువ జీతంతో ఈ ఉద్యోగంలో ఎందుకు చేరుతున్నావ'నే ప్రశ్న ఆమెకు తాను పని చేసిన హాస్పిటల్ సహోద్యోగుల నుంచి మాత్రమే కాకుండా ఇంటర్వ్యూ బోర్డు నుంచి కూడా ఎదురైంది. అందరికీ ఆమె చెప్పే సమాధానం ఒక్కటే ''ఇది మా నాన్న కల, మా అమ్మ పట్టుదల. జీతం తగ్గించుకుని డిప్యూటీ తాసిల్దారుగా చేరడానికి నాకేమీ కష్టంగా లేదు'' అని. మంచి నర్స్‌గా పేషెంట్‌ల అభిమానాన్ని చూరగొన్నట్లే, కొత్త ఉద్యోగంలో కూడా మంచి అధికారిగా పేరు తెచ్చుకోవడమే తన కొత్త లక్ష్యం అన్నది ఝాన్సీ.

- వాకా మంజులారెడ్డి

ఫొటోలు: బి.రాకేశ్

పిల్లలకు ఒక ఫోన్ కాల్

ఉదయం పిల్లలతోపాటు బయటపడితే తిరిగి ఇల్లు చేరడానికి రాత్రి తొమ్మిదయ్యేది. మధ్యాహ్నం రెండు వరకు మహేశ్వరంలో డ్యూటీ చేసుకుని నేరుగా హైదరాబాద్‌లోని ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్‌కి వెళ్లేదాన్ని. రాత్రి ఎనిమిది వరకు క్లాసులు చూసుకుని ఇంటికి చేరడానికి ఆ టైమ్ పట్టేది. సాయంత్రం ఒక సారి ఇంటికి ఫోన్ చేసి పిల్లలతో మాట్లాడేదాన్ని. పిల్లల హోమ్ వర్క్ తప్ప నాకు మరే బాధ్యత లేకుండా అన్నీ అమ్మే చూసుకునేది. ఇల్లు చేరిన తర్వాత ఆ రోజు క్లాసులో చెప్పినవాటిని రివిజన్ చేసుకోవాలి. ఒక్కోసారి రాత్రి పూర్తి కాకపోతే ఉదయం డ్యూటీకి వెళ్లేటప్పుడు బస్‌లో కూర్చుని పాఠాలు గుర్తు చేసుకుంటూ పాయింట్స్ నోట్ చేసుకునే దాన్ని. సన్‌డే ఆ వారంలో సిలబస్ మొత్తం రివిజన్ పూర్తి చేస్తూ రావడంతో నాకు ఉద్యోగం చేస్తూ పరీక్షలకు ప్రిపేర్ కావడం కష్టం అనిపించలేదు. మా అమ్మ పట్టుపట్టడం, మావారు ప్రోత్సహించడంతోనే మళ్లీ చదవగలిగాను. నా మీద నాకంటే వాళ్లకే నమ్మకం ఎక్కువ.

– ఝాన్సీ దొంతిరెడ్డి

ఝాన్సీ తల్లి స్వరూప

ఆవిష్కరణ

రమణీయ శ్రీ రామాయణం

బాపు రమణలు రామభక్తులు. బొమ్మలతో, అక్షరాలతో రాముడి ఋణం కొంతైనా తీర్చుకుని వెళ్లిన జంట. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు ముళ్లపూడి వెంకటరమణ సతీమణి ముళ్లపూడి శ్రీదేవి. ఎన్నటికైనా వాల్మీకి ఉపమానాలను ఒక పుస్తకంగా తేవాలని నాలుగు దశాబ్దాల క్రితమే ఆలోచన చేశారు రమణగారు. అప్పుడు సాధ్యపడలేదు. ఇప్పటికి ఆ ఆలోచన ఆచరణలోకి వచ్చింది. 'రమణీయ శ్రీ రామాయణం' పేరున ఈ పుస్తకాన్ని శ్రీదేవి ఈరోజు ఆవిష్కరిస్తున్నారు. ఈ సందర్భంగా తన మనసులోని మాటలను సాక్షితో పంచుకున్నారు ముళ్లపూడి శ్రీదేవి.

ఇది ముళ్లపూడి వెంకటరమణగారి కోరిక. అంటే రమణగారు నాకు కలలో కనిపించి రామాయణం రాయమన్నారని కాదు నేను చెప్పేది. రమణగారి చిన్న వయస్సులో – అంటే ఇంకా ఉద్యోగం సంపాదించుకుని స్థిరపడని రోజుల్లో – వాల్మీకి రామాయణాన్ని శ్రీనివాస శిరోమణి తెలుగులో వచనానువాదం చేస్తున్నారు. అది ఆంధ్ర పత్రికలో ఆదివారం సారస్వతానుబంధంలో ప్రచురింపబడేది. తెలుగువారంతా ఆ రామాయణాన్ని ఇష్టంగా భక్తిగా చదివారు. ఆ రోజుల్లో శిరోమణి గారి దగ్గర వెంకటరమణ గారు సహాయకుడిగా పనిచేశారు. ఆ సందర్భంగా అనువాదం కోసం ఎన్నో రామాయణాలు పరిశీలించారు. వాల్మీకి మహర్షి కవిత్వం, ఆయన శైలి, ఆయన భక్తి ఆకళింపు చేసుకున్నారు. రామాయణమన్నా, రాముడన్నా భక్తి తాత్పర్యాలు ఏర్పడ్డాయి. ఆ ఇష్టంతోనే రమణగారు 'సీతాకల్యాణం' కథ రాశారు.

'ఉపమా కాళిదాసస్య' అని లోకోక్తి. 'ఉపమా వాల్మీకస్య' అని రమణగారు అంటారు. వాల్మీకి మహర్షి కథ చెప్పే పద్ధతి చాలా సరళంగా ఉంటుంది. కథ చెప్పేటప్పుడు అలంకారాలు ఎక్కువగా ఉపయోగించడు. కథ సూటిగా సాగిపోతుంది. వర్ణనల విషయంలో మాత్రం వాల్మీకి ఉపమాలంకారాన్ని విరివిగా ఉపయోగించాడు. ఆయా సమయాలలో సందర్భానుసారంగా ఒకటి రెండు ఉపమానాలు చెప్పి ఊరుకోడు. ఒకదాని వెంట మరొకటిగా పుంఖానుపుంఖంగా ఉపమాలంకారాలు గుప్పిస్తాడు. పాఠకుడిని ఊపిరి తిప్పుకోనివ్వడు. వాల్మీకి ప్రయోగించిన ఈ పద్ధతి రమణగారిని ఎక్కువగా ఆకర్షించింది. రమణగారి కథల్లో కూడా ఈ ఉపమానాల ప్రయోగం తరచుగా కనిపిస్తుంది. విశేషమైన ఈ ప్రయోగాన్ని పాఠకులకు అందించాలని రమణగారి కోరిక.

వాల్మీకి చెప్పిన రామకథను మళ్లీ చెప్పు, సందర్భానుసారంగా వచ్చిన ఉపమానాలను యథాతథంగా అమర్చటం సముచితంగా ఉంటుందని నాకు అనిపించింది. నాకు తోచిన పద్ధతిలో రామాయణం చెప్పటానికి పూనుకున్నాను. ఇంత ప్రయత్నానికీ మూలకారణం ముళ్లపూడి వెంకటరమణగారే. రామాయణం ఒక కొత్త ఉద్దేశంతో చెప్పడానికి ప్రయత్నించాను. అన్నిటికీ వాల్మీకి రామాయణమే మూలం, ఆధారం. అన్ని రామాయణాలతో పాటు ఇదీ మరొక్క రామాయణం. ఇందులో నా సొంత కవిత కొంచెం కూడా లేదు. ఉన్నదంతా వాల్మీకి కవితా సౌందర్యమే.

రమణగారు వాల్మీకి రామాయణంలోని ఉపమానాలను అందరికీ ప్రత్యేకంగా చెప్పాలని ఆశించారు. వాల్మీకి ఎంత గొప్పగా, ఎంత అందంగా వాడాడో చెప్పాలనుకున్నారు. ఎలా చెబితే బాగుంటుందా అని ఆచార్య డా. బేతవోలు రామబ్రహ్మం, మహామహోపాధ్యాయ డా. పుల్లెల శ్రీరామచంద్రుడు వంటి పెద్దలను అడిగారు. అందరూ ఆలోచన బావుందన్నారు. కానీ ఎలా రాయాలో చెప్పలేదు. దానితో రమణ గారు ఈ అంశాన్ని పుస్తకంగా తీసుకురాలేదు. అప్పట్లో వాల్మీకి ఉపమానాలను నా స్వదస్తూరితో రాసి ఉంచాను. అందువల్ల అది నా మనసులో ఉండిపోయింది. నేను ప్రతి ఉపమానానికి అంకెలు వేసి పెట్టుకున్నాను. మా అమ్మాయి సలహా మేరకు కార్యరూపంలోకి దిగాను. వాల్మీకి ఎప్పుడు, ఏ సందర్భంలో, ఏ అర్థంలో ఉపమానాలు చెప్పారో వివరంగా రాసి, నా బ్లాగులో పెట్టాను. మొత్తం రెండు సంవత్సరాల పాటు రాశాను. నేను పూర్తి చేసిన మరునాడు తిరుపతిలో ఉండే కథా ప్రపంచం పబ్లిషర్ కిరణ్ ఈ పుస్తకం ప్రచురిస్తానన్నాడు. రామాయణం రాస్తూ నా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడమే కాదు, నా మనసులో నాతోనే ఉన్న రమణ గారి కోరిక నెరవేర్చాను' అని ముగించారు ముళ్లపూడి శ్రీదేవి.

– డా. వైజయంతి పురాణపండ

> అన్నిటికీ వాల్మీకి రామాయణమే మూలం, ఆధారం. అన్ని రామాయణాలతో పాటు ఇదీ మరొక్క రామాయణం. ఇందులో నా సొంత కవిత కొంచెం కూడా లేదు. ఉన్నదంతా వాల్మీకి కవితా సౌందర్యమే.
> - ముళ్లపూడి శ్రీదేవి, ముళ్లపూడి వేంకటరమణ సతీమణి

అఖిల్

ఫారిన్ ప్రయాణం

ప్రేయసితో ఆటా పాటా, విలన్ల తాట తీయనున్నారు అఖిల్. దీనికోసం విదేశాలు వెళ్లారు. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో అఖిల్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ చిత్రీకరణ ఫారిన్‌లో జరగనుందని సమాచారం. సౌదీ అరేబియాలో షూటింగ్ ప్లాన్ చేశారట. అక్కడ ఓ యాక్షన్ సీక్వెన్స్, పాటను చిత్రీకరించబోతున్నారని తెలిసింది. ఈ షెడ్యూల్ దాదాపు పది రోజులు సాగుతుందట. జీఏ2 పిక్చర్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు గోపీసుందర్ స్వరకర్త.

వారోత్సవం!

బాలీవుడ్ బ్యూటీ ఐశ్వర్యారాయ్‌కి ఇది ఫన్ టైమ్. ఆల్రెడీ ఐశ్వర్యారాయ్ ఇంట జరిగిన దీపావళి వేడుకలు బాలీవుడ్ వీధుల్లో బాగానే ప్రతిధ్వనించాయి. ఇంతటితో ఐశ్వర్య సెలబ్రేషన్స్‌కు ఫుల్‌స్టాప్ పడలేదు. ఎందుకంటే నవంబర్ 1న ఆమె పుట్టినరోజు. ఈ వేడుకల కోసం భర్త అభిషేక్ బచ్చన్, కూతురు ఆరాధ్యలతో కలిసి రోమ్ వెళ్లనున్నారామె. అక్కడ దాదాపు వారం రోజుల పాటు ఉండేలా అభిషేక్ ఈ హాలిడేని ప్లాన్ చేశారు. పనిలో పనిగా తాను ప్రచారకర్తగా ఉన్న ఓ ఉత్పత్తికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొని, నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రీ-బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో సందడి చేస్తారు ఐశ్వర్య. ఇలా నవంబర్ మొదటి వారం అంతా ఐశ్వర్య సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు. తిరిగొచ్చాక మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో తాను చేయనున్న పాత్ర కోసం కసరత్తులు మొదలుపెడతారామె. అభిషేక్ బచ్చన్ కూడా 'బిగ్ బుల్' సినిమాతో బిజీ అవుతారు.

ఐశ్వర్యా రాయ్

బన్నీకి విలన్

విజయ్ సేతుపతి

చిరంజీవి 'సైరా: నరసింహారెడ్డి' చిత్రంలో రాజపాండి పాత్రలో నటించి టాలీవుడ్‌కు డైరెక్ట్ ఎంట్రీ ఇచ్చారు తమిళ నటుడు విజయ్ సేతుపతి. హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా... ఇలా కథలో పాత్రకు తగ్గట్టు మౌల్డ్ అవుతుంటారు విజయ్. కానీ ఇటీవల ఆయన ఎంపికలన్నీ విలన్ పాత్రలే అని తెలుస్తోంది. అల్లు అర్జున్ (బన్నీ) హీరోగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రారంభోత్సవం నేడు జరుగుతుంది. ఈ సినిమాలో విలన్ పాత్రకు విజయ్ సేతుపతిని సంప్రదించారట టీమ్. కథ విని సేతుపతి కూడా సై అన్నారట. మరోవైపు సాయి తేజ్ తమ్ముడు వైష్ణవ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'ఉప్పెన' సినిమాలో విజయ్ సేతుపతి ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారన్న వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే తమిళంలో విజయ్ హీరోగా లోకేష్ కనగరాజన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలోనూ విజయ్ సేతుపతిది విలన్ పాత్రే అని కోలీవుడ్ టాక్. ఇలా ఒకవైపు హీరోగా, మరోవైపు మోస్ట్ వాంటెడ్ విలన్‌గా మారుతున్నారు విజయ్ సేతుపతి.

అల్లు అర్జున్

కొత్త తరహా కథ

కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటించిన '118' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలై మంచి ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఈ సినిమాను ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేశ్ కోనేరు నిర్మించారు. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో మరో మూవీ తెరకెక్కనున్నట్లు మంగళవారం అధికారిక ప్రకటన వెల్లడైంది. ''కల్యాణ్‌రామ్‌గారు మా బ్యానర్‌లో మరో సినిమా చేయబోతున్నారు. కొత్త తరహా కథాంశంతో తెరకెక్కనున్న ఈ సినిమా మిగతా వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అన్నారు మహేశ్ కోనేరు. విజయ్ హీరోగా నటించిన 'విజిల్' సినిమాను తెలుగులో రిలీజ్ చేశారు మహేశ్ కోనేరు. అలాగే కీర్తీ సురేష్ నటిస్తున్న 'మిస్ ఇండియా' చిత్రానికి కూడా ఈయనే నిర్మాత.

కామెడీ గ్యాంగ్‌స్టర్

సుమంత్

వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నారు హీరో సుమంత్. ఒక్కో సినిమా కోసం చాలా సమయం తీసుకుంటున్న ఈయన తాజాగా ఓ సినిమాకి పచ్చజెండా ఊపారు. 2018లో మలయాళంలో విడుదలై మంచి విజయం సాధించిన 'పాదయోట్టం' సినిమా తెలుగులో రీమేక్ కానుంది. ఇందులో సుమంత్ హీరోగా నటించనుండగా విను యజ్ఞ దర్శకత్వం వహించనున్నారు. ఈస్ట్ ఇండియా టాకీస్, ది మంత్ర ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్‌పై తమ్మినేని జనార్ధన రావు, శర్మ చుక్క ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాతో ఐమా అనే కొత్త హీరోయిన్ పరిచయం కానున్నారు. ''గ్యాంగ్‌స్టర్ కామెడీ డ్రామాగా తెరకెక్కనున్న చిత్రమిది. డిసెంబర్ 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: షి. రాజ్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: బాలాజీ శ్రీను.

ఘంటసాల... పాటశాల

కృష్ణచైతన్య

నటి అర్చన నిశ్చితార్థం ఈ నెల 3న వ్యాపారవేత్త జగదీష్‌తో జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 13న వీరి వివాహం హైదరాబాద్‌లో జరగనుంది.

ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు ఘంటసాల జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. 'ఘంటసాల పాటశాల' పేరుతో ఘంటసాల ప్రసిద్ధ గీతాలని సంకలనం చేసిన సి.హెచ్. రామారావు ఈ చిత్రానికి రచన, దర్శకత్వం చేశారు. ఇందులో ఘంటసాలగా గాయకుడు కృష్ణచైతన్య, ఘంటసాల సతీమణి సావిత్రమ్మగా కృష్ణచైతన్య భార్య, టీవీ యాంకర్ మృదుల నటించారు. అన్యుక్త్ రామ్ ప్రొడక్షన్స్‌పై గాయకుడు జి.వి. భాస్కర్ నిర్మాణ సారథ్యంలో ఘంటసాల వీరాభిమాని లక్ష్మీ నీరజ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని ప్రముఖ గాయని చిత్ర విడుదల చేశారు. సి.హెచ్. రామారావు మాట్లాడుతూ– ''ఘంటసాలగారు మహాగాయకుడిగా ఎదగడానికి ఎన్ని కష్టాలు పడ్డారో, ఈ చిత్రనిర్మాణంలో మేం కూడా అన్ని కష్టాలు పడ్డాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు. ''ప్రఖ్యాత హిందుస్తాన్ సంగీత విద్వాంసులు బడే గులాం అలీఖాన్ పాత్రలో సుమన్ నటించారు'' అన్నారు లక్ష్మీ నీరజ. ''మా ట్రైలర్‌కి అనూహ్య స్పందన వచ్చింది'' అన్నారు సహనిర్మాత జీవీ భాస్కర్. ఈ చిత్రానికి సంగీతం: సాలూరి వాసూరావు, కెమెరా: వేణు మురళీధర్.వి.

దేవరకొండ ప్రేమకథ

శ్రీకాంత్, మన్మథరావు

విజయ్ శంకర్, మౌర్యాని జంటగా వెంకటరమణ ఎస్. దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవరకొండలో విజయ్ ప్రేమకథ'. శివత్రి ఫిలిమ్స్ పతాకంపై వడ్డాన మన్మథరావు నిర్మించారు. ఈ సినిమా పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''మంచి కథాంశంతో రూపొందిన సినిమాకు అపజయమంటూ ఉండదు. విజయ్ శంకర్ అందంగా ఉన్నాడు. టైటిల్ చాలా బాగుంది. సినిమా కూడా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా'' అన్నారు. ''మేం అనుకున్నదానికన్నా సినిమా బాగా వచ్చింది. బడ్జెట్‌లో ఎక్కడా రాజీపడకుండా నిర్మించాం. శ్రీకాంత్‌గారి చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించడం మా విజయానికి మొదటి మెట్టుగా భావిస్తున్నాం'' అన్నారు వడ్డాన మన్మథరావు. ''పల్లెటూరి నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుంది. కథను నమ్ముకునే ఈ ప్రాజెక్టు చేపట్టాం. హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు వెంకటరమణ. ''నాకిది తొలి సినిమా. నా కెరీర్‌లో ఇదే నిజమైన దీపావళి'' అన్నారు విజయ్ శంకర్. ''ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలున్నాయి. అన్నీ చాలా బాగుంటాయి'' అన్నారు సంగీత దర్శకుడు సదాచంద్ర. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్ సంతోష్. ఎస్.

ఇది మనందరి అదృష్టం

- చిరంజీవి

''కళాకారుల ప్రతిభకు అవార్డులు, రివార్డులే కొలమానాలు'' అన్నారు చిరంజీవి. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లండన్‌లోని భవన్స్ ప్రాంగణంలో సంగీత వేడుక జరిగింది. సంగీతంలోని విశిష్టమైన 72 మేళకర్త రాగాలను ఏకధాటిగా 61గంటల 20 నిమిషాల పాటు వీణవాదన చేసి గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు తెలుగు సినిమా సంగీత దర్శకుడు వీణాపాణి. ఈ సందర్భంగా వీణాపాణిని సత్కరించిన చిరంజీవి మాట్లాడుతూ– ''ఇటువంటి కళాకారులను వ్యక్తిగతంగా, వృత్తిపరంగా గౌరవించడం మన సినిమా ఇండస్ట్రీకి గర్వకారణం. ఇంత గొప్ప గౌరవం దక్కటం తెలుగువారితో పాటు భారతీయులందరి అదృష్టం'' అన్నారు. ''వీణపాణి అసలు పేరు రమణమూర్తి. ఆయనకు వీణాపాణి అని నామకరణం చేసింది నేనే అని గర్వంగా చెప్పగలను'' అన్నారు తనికెళ్ల భరణి. ''మన తెలుగువాడు ఇంతటి కీర్తిని సాధించడం మనకు గర్వ కారణం'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. ''వీణాపాణి ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి'' అన్నారు జనార్ధన మహర్షి. ''నా దర్శకత్వంలో వచ్చిన 'పట్టుకోండి చూద్దాం' ద్వారా సంగీత దర్శకునిగా ప్రయాణం మొదలుపెట్టిన వీణాపాణికి గిన్నిస్ అవార్డు రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు శివ నాగేశ్వరరావు. ''ఈ రికార్డును ఆ మహాత్మునికి అంకితం ఇస్తున్నాను. నన్ను 28ఏళ్లుగా భరిస్తున్న నా భార్యకు, పిల్లలకు కూడా ఈ అవార్డు చెందుతుంది'' అన్నారు వీణాపాణి.

చిరంజీవి, వీణాపాణి

రణస్థలం హిట్ అవ్వాలి

- పూరి జగన్నాథ్

ట్రైలర్ ఆవిష్కరిస్తున్న పూరీతో చిత్రబృందం

''ఆది అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా వద్ద చాలా సంవత్సరాలు పని చేశాడు. ఇప్పుడు తను దర్శకునిగా 'రణస్థలం' సినిమా చేయడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నా. టీమ్‌కి అల్ ద బెస్ట్'' అని దర్శకుడు పూరి జగన్నాథ్ అన్నారు. రాజ్, షాలు జంటగా ఆది అరవల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రణస్థలం'. సంతోష ఆంజనేయులు సమర్పణలో శ్రీలక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై కావలి రాజు నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను పూరి జగన్నాథ్ విడుదల చేశారు. ఆది అరవల మాట్లాడుతూ– ''పక్కా కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ప్రేమకథ కూడా ఉంటుంది. మా గురువు పూరి జగన్నాథ్‌గారి చేతుల మీదుగా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''కెమెరామన్ ప్రభాకర్, సంగీత దర్శకుడు రాజకిరణ్ చక్కటి అవుట్‌పుట్ ఇచ్చారు. మా చిత్రాన్ని నవంబర్ ఆఖరులో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు కావలి రాజు.

వర్షా విశ్వనాథ్

ప్రేమ.. వినోదం...

'ఇది నా లవ్ స్టోరీ' ఫేమ్ రమేష్– గోపి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. రమణ్ హీరోగా వర్షా విశ్వనాథ్, పావని, దీపికా హీరోయిన్లుగా నటించనున్నారు. కొరివి పిచ్చిరెడ్డి, సరస్వతి సమర్పణలో సిరి మూవీస్ పతాకంపై కె.శిరీషా రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా త్వరలో ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకులు రమేష్– గోపి మాట్లాడుతూ– ''లవ్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోనర్‌లో మంచి సందేశాత్మకంగా రూపొందనున్న చిత్రమిది. ఒక హీరో, ముగ్గురు హీరోయిన్లతో స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగుతుంది. విలన్ క్యారెక్టరైజేషన్ కొత్తగా ఉండి ఆడియన్స్‌కి ఫ్రెష్ ఫీల్ ఇస్తుంది. నవంబర్ చివరి వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహిత్ నారాయణ్, కెమెరా: క్రిస్టోఫర్ జోసెఫ్.

చదువు

అక్కా... మళ్లీ బడికి పోదామా

బాలాపూర్ యూత్‌లో చదువుకుంటున్న మహిళలు

స్త్రీ చదువుకుంటే కుటుంబం మొత్తం చదువుకున్నట్టు అని పెద్దలు అంటారు. కాని ఈ దేశంలో అమ్మాయిని ఒక రకంగా, అబ్బాయిని ఒక రకంగా చదివించే పరిస్థితులు ఉన్నాయి. చిన్నప్పుడు చదువు మానేసి పెళ్లి, కుటుంబం బాధ్యతలలో పడిపోయి హటాత్తుగా తిరిగి చదువుకోవాలనుకునే స్త్రీలకు మార్గం ఉందా? ఉంది. ఈ స్త్రీలు చదువుకుంటున్నారు. ఇలా చదువుకోవాలనుకుంటున్న స్త్రీలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ముప్పై ఏళ్ల క్రితం మమత చదువు ఏడవ తరగతితో ఆగిపోయింది. తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడం, ఆమెకు సపర్యలు చేయడానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చదువుకోవాలనే ఇష్టం ఉన్నా ఇంటి వద్దే ఉండిపోయింది. ఆ తర్వాత మరో పదేళ్లకు ఇల్లాలయ్యింది. అత్తింటి బాధ్యతల బరువులో ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఏడవ తరగతిలో అటకెక్కిన చదువు మళ్లీ ఆమెకు ఎప్పుడూ గుర్తుకురాలేదు. ఆ అవసరమూ లేదనుకుంది. ఇద్దరు పిల్లల్ని బడికి పంపడం, ఎలక్ట్రీషియన్ అయిన భర్తకు క్యారేజీ సర్ది ఇవ్వడం, ఇంటిల్లిపాది బాగోగులు చూసుకోవడంవంటి పనులలో మునిగితెలింది. పిల్లలిద్దరూ డిగ్రీ స్థాయికి వచ్చేశారు. ఉదయాన్నే పిల్లలు, భర్త ముగ్గురూ బయటకు వెళ్లిపోతారు. తనకు ఇప్పుడు కాస్తంత తీరిక దొరికింది. తోటి వారితో ఓ మహిళా సంఘంలో చేరింది. అక్కడ తెలిసింది మమతకు చదువుకోకపోవడంలో తలెత్తిన ఇబ్బందులు. ఏ అప్లికేషన్ నింపాలన్నా, ఎవరితోనైనా మాట్లాడాలన్నా బెరుకుగా ఉండేది. చదువుకోకపోవడంతో ఎవరో ఒకరి సహాయం తప్పనిసరి అయ్యింది. తనే చదువుకుంటే ఇలా ఇబ్బందులు పడేదాన్ని కాదనుకుంది. ఆగిపోయిన చదువు మళ్లీ చదువుకుంటే అనుకుంది. కానీ, ఇంత పెద్ద దాన్ని అయ్యాక ఇప్పుడేం చదువుకుంటాం అని నిట్టూర్చింది. కానీ ఆమె కలకు ఓ ఎడ్యుకేషనల్ ఎన్జీవో సంస్థ భరోసాగా నిలిచింది. ఓపెన్ విద్యా విధానం ద్వారా ఇప్పుడు మమత పదోతరగతి చదువుతోంది.

వదిలిన చదువు

హైదరాబాద్ శివారులోని బాలాపూర్ గ్రామంలో బాలాపూర్ యూత్‌కు వెళితే ఓ పాతిక మంది మహిళలు ఎప్పుడో వదిలేసుకున్న తమ కలను నెరవేర్చుకునే ప్రయత్నంలో ఉండటం మనం చూడచ్చు. అక్కడ పదహారేళ్ల వయసు నుంచి నలభై ఐదేళ్ల వయసున్న మహిళలు ఉన్నత విద్యను చదువుకుంటూ కనిపిస్తారు. ఆడ పిల్లలకు చదువెందుకు అనే పెద్దల వల్ల కొందరు ప్రైమరీ పాఠశాల స్థాయిలోనే చదువు మానేస్తే, కొందరు టెన్త్ క్లాస్ ఫెయిలయ్యి ఆ తర్వాత చదువు కొనసాగించలేక మానేసిన వారున్నారు. ఇంకొందరు వారి ఇంటి ఆర్థిక స్థితి సరిగా లేక చిన్నప్పుడే ఇంటెడు బాధ్యతలు మోసినవారున్నారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాక తమ గురించి ఆలోచించుకునే స్థాయిని కూడా మర్చిపోయినవారున్నారు. అలాంటి కొంతమంది మహిళలు ఇప్పుడు మళ్ళీ పుస్తకాలను ముందేసుకొని ఒక్కో అక్షరాన్ని కూడబలుక్కుంటూ పదాలను నేర్చుకుంటున్నారు. తమ పంథాన్ని మార్చుకుంటున్నారు. పదవతరగతి పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలని కొందరు, ఇంటర్.. డిగ్రీ స్థాయి చదువులు చదువుకోవాలని మరికొందరు, వృత్తి విద్యా కోర్సులు నేర్చుకొని తమ కాళ్ల మీద తాము నిలబడాలని కలలు కంటున్నవారు ఇక్కడ మనకు కనిపిస్తారు.

ఎప్పుడో వదిలేసిన చదువును ఇప్పుడు కొనసాగిస్తూ ఆ స్థాయికి తగిన ఉద్యోగ్యాలు పొందిన వారూ ఉన్నారు. జీవితంలో మరో అవకాశాన్ని పొందివిపట్టుకొని ముందడుగు వేయాలని కలలు కంటున్నవారు ఉన్నారు. వారి కలలు సాకారం కావాలని కోరుకుందాం.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: సోమ సుభాష్

బేసిక్స్ నుంచి మొదలు

ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇక్కడ చదువుకోవచ్చు. జూన్‌లో మొదలైన ఈ క్లాసులు టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ రాసేవరకు ఉంటాయి. ఆ తర్వాత కూడా వీరి అభిరుచి మేరకు వృత్తి విద్య కోర్సులు నేర్చుకోవచ్చు. మొదటి నాలుగు నెలలు అఆ లు, ఏబీసీడీల వంటి బేసిక్ చదువు చెప్తాం. కొన్నేళ్ల క్రితం వదిలేసిన చదువును కొనసాగించాలంటే బేసిక్స్ తప్పనిసరి. ఆ తర్వాత ఐదు సబ్జెక్టులనూ బోధిస్తున్నాం.

– చిన్నికృష్ణ, ఇన్‌ఛార్జి, ప్రతన్ ఎడ్యుకేషన్ సంస్థ

డిగ్రీ చేస్తాను

నాకు ముగ్గురు అమ్మాయిలు. నా చదువు స్కూల్ వయసులోనే ఆగిపోయింది. అందుకే ముగ్గురినీ చదివిస్తున్నాను. మా పిల్లలకు చదువు విషయంలో ఏదైనా చెప్పాలంటే ఇబ్బంది పడుతున్నాను. ఇప్పుడు నాకు మళ్లీ చదువుకునే అవకాశం వచ్చింది. పదోతరగతి ఆపేయకుండా డిగ్రీ కూడా పూర్తి చేస్తాను.

– సునీత

అదనపు అర్హత

ఇంటికి ఆసరా కావాలంటే ఏదైనా ఉద్యోగం చేయాలి. పదో తరగతి సర్టిఫికెట్ కూడా లేని మాకు ఏ ఉద్యోగం వస్తుంది. ఎక్కడికెళ్లినా 'పదోతరగతి చదివారా.. సర్టిఫికెట్ ఉందా!' అని అడిగేవారు. దీంతో ఏదైనా చిన్న ఉద్యోగం చేయాలని ఉన్నా ధైర్యం చేయలేకపోయాను. ఇరవై ఏళ్ల క్రితం టెన్త్‌లోనే నా చదువు ఆగిపోయింది. ఆ తర్వాత పెళ్లి, పిల్లలు. వారి బాగోగులు. ఇప్పుడు టెన్త్ పాసై ఇంటర్ కూడా చదవాలనుకుంటున్నాను.

– జయశ్రీ

మా అబ్బాయి నేనూ ఒకే క్లాస్

కాస్త తీరిక దొరికితే ఏదైనా పుస్తకం చదవాలనుకున్నా ఒక్కో అక్షరం కూడబలుక్కొని చదవాల్సి వచ్చేది. చిన్నప్పుడు మానేసిన చదువు ఇప్పుడు పూర్తి చేస్తా. ఈ నాలుగు నెలలుగా అవన్నీ గుర్తుతెచ్చుకుంటున్నాను. ఇప్పుడు మా అబ్బాయితో పాటు నేనూ పదోతరగతి చదువుకుంటున్నాను.

– వసంత

ఇంగ్లీష్‌లో మాట్లాడాలి

ఇంగ్లీషులో మాట్లాడాలనేది నా కల. కానీ, చదువుకోలేదు. ఎప్పుడూ ప్రయత్నించలేదు. చిన్నప్పుడు ఆపేసిన చదువును కొనసాగిస్తున్నాను. ఇంగ్లీషు నేర్చుకుంటున్నాను.

– మమత

పరిణీతీ చోప్రా

పాత్రలా మారిపోవాలని

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నైహ్వాల్ బయోపిక్ సిద్ధం అవుతోంది. సైనా పాత్రలో పరిణీతీ చోప్రా నటించనున్నారు. సైనా పాత్ర కోసం రోజుకి రెండుగంటల పాటు బ్యాడ్మింటన్ సాధన చేస్తున్నారు పరిణీతి. సైనాను కలసి ఆమె ఆలోచనలు, హావభావాలను తెలుసుకుంటున్నారు. ఇప్పుడు సైనా నెహ్వాల్ ఇంటిని సందర్శించనున్నారు పరిణీతి. ''ఈ సినిమా కోసం సైనా పాత్రను కేవలం పోషించడం కాదు పూర్తిగా సైనాలా మారిపోవాలనుకుంటున్నాను. వాళ్ల ఇంటికి వెళ్లి తన రోజువారీ జీవితం ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. నేనొస్తున్నానని ప్రత్యేకంగా ఏం వంటలు తయారు చేయొద్దని, రోజూ వాళ్లు తినే భోజనాన్ని నాకు వడ్డించమని సైనా ఫ్యామిలీని కోరాను'' అని పరిణీతి తెలిపారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రానికి అమోల్ గుప్తా దర్శకత్వం వహించనున్నారు.

బ్యూటిప్స్

- రెండు గుడ్లు పచ్చసొనను ఒక బౌల్‌లో వేసుకోవాలి. స్పూన్‌తో బాగా గిలక్కొట్టి దానిలో రెండు టీస్పూన్ల ఆముదం కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు బాగా పట్టించి మసాజ్ చేసుకోవాలి. హెయిర్ ప్యాక్ ఆరిన తర్వాత నీటితో శుభ్రం చేసుకోవాలి.
- కప్పు కొబ్బరి పాలు, టేబుల్ స్పూన్ పెసర పిండి తీసుకుని పేస్ట్ చేసి మాడుకు పట్టించి ఐదు నిమిషాల తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఇలా చేస్తే పొడి జుట్టు కూడా ఆరోగ్యవంతంగా తయారవుతుంది.



ఈ పండ్లు గుండెకు మేలు

కొన్న పండ్లు గుండె ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయి. గుండెకు ఎంతగానో మేలు చేస్తాయి. వాటిని గుర్తుపట్టడం కూడా చాలా సులభం. బాగా ముదురురంగుల్లో మెరుస్తున్నట్లుగా (బ్రైట్‌గా) కనిపించే రంగులతో ఉండే పండ్లన్నీ గుండెకు మేలు చేసేవే. అందులో కొన్ని...

ద్రాక్ష రక్తనాళాల్లా కనిపించే ద్రాక్షగుత్తిని చూస్తే అది హృదయాకారంలో ఉంటుంది. హృదయాకారంలో ఉండే పండ్లు గుండెకు మేలు చేస్తాయి. చెడు (ఎల్‌డీఎల్) కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా గుండెపోటు అవకాశాలను నివారిస్తాయి. ద్రాక్షగింజల్లో చాలా పోషకాలు ఉంటాయి. లినోలిక్ ఆసిడ్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ ఆలిగోమెరిక్ ప్రో యాంథో సయానిడిన్స్ వంటివి అందులో కొన్ని ప్రధానమైనవి. ద్రాక్షగింజలు హైకోలెస్ట్రాల్‌ను తగ్గించి, అధిక రక్తపోటును అదుపులో ఉంచుతాయి. తద్వారా గుండెజబ్బులను నివారిస్తాయి.



ఆపిల్ మెరుస్తున్నట్లుగా ఎర్రటి రంగులో ఉండే ఆపిల్ గుండెకు మేలు చేస్తుంది. ఇందులోని ఫ్లేవనాయిడ్స్ రక్తనాళాలు మూసుకుపోకుండా చూడటంతో పాటు కొలెస్టాల్‌ను తగ్గిస్తాయి. అయితే ఆపిల్‌ను మెరుస్తున్నట్లుగా కనిపించడం కోసం దానిపై మైనం (వాక్స్) పూయడం వంటి దుష్చర్యలకు పాల్పడుతుంటారు. ఇలాంటి పండ్ల నుంచి మాత్రం దూరంగా ఉండాలి.

యాప్రికాట్ బాగా ముదురు నారింజ లేదా పసుపు రంగులో ఉండే యాప్రికాట్స్ గుండెకు మంచివి. ఇందులో ఉండే విటమిన్-కె రక్తకణాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. యాప్రికాట్స్‌లోని ఏ, సీ, ఈ విటమిన్ల వల్ల పూర్తి శరీర ఆరోగ్యం ఎంతగానో బాగుంటుంది.

అరటి అరటిపండులో ఉండే పొటాషియమ్, మెగ్నీషియమ్‌లు రక్తపోటును నియంత్రిస్తాయి. గుండె దెబ్బతినడానికి, గుండెపోటుకు హైబీపీ కూడా ఒక రిస్క్‌ఫ్యాక్టర్ అన్న విషయం తెలిసిందే. అరటిపండ్లు రెగ్యులర్‌గా తినడం వల్ల రక్తపోటు నియంత్రణలోకి వచ్చి...అది గుండెపోటు రిస్క్‌ను నివారిస్తుంది. ఇక అరటిలో ఉండే విటమిన్ బి6, సి, పీచుపదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

కివీ కివీ పండ్లు గుండెకు మేలు చేస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ వయసు పెరిగే ప్రక్రియను మందగింపజేస్తాయి. కివీ రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే గుణం తగ్గించడం ద్వారా గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

కర్బూజ (కాంటలౌప్) ఇందులోని విటమిన్-ఏ, విటమిన్-బి6, ఫోలేట్, పీచుపదార్థాలు పూర్తి శరీర ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. దీనికి తోడు ఇందులో ఉండే పొటాషియమ్ రక్తపోటును నియంత్రించి గుండెపోటును నివారిస్తుంది.

బెర్రీపండ్లు బ్లాక్‌బెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ పండ్లలో ఉండే విటమిన్ సి, ఫోలేట్, ఫైబర్ అన్నీ మన ఆరోగ్యానికి దోహదపడతాయి. ఇక ఇందులో మ్యాంగనీస్, పొటాషియమ్ ఉంటాయి. ఈ పొటాషియమ్ రక్తపోటును నివారించడం ద్వారా గుండెకు మేలు చేస్తుంది.

టొమాటో మనం దీన్ని పూర్తిగా తినే పండుగా చెప్పలేకపోయినా... ఇది కూడా గుండెకు ప్రయోజనకరమైనదే. మనం గమనిస్తే... టొమాటో కూడా ఆకర్షణీయమైన ముదురు రంగులో మంచి మెరుపుతో ఉంటుంది. టొమాటోలో ఉండే లైకోపిన్ అనే పోషకం గుండెకు ఎంతగానో మేలు చేస్తుంది.

నారింజపండ్లు నిమ్మజాతికి చెందిన పండ్లన్నీ గుండెకు మేలు చేసేవే. బాగా పండిన నారింజలో విటమిన్ఏ, బి6, సి పుష్కలంగా ఉంటాయి. దాంతోపాటు ఫోలేట్ పొటాషియమ్, ఫైబర్ ఎక్కువ. పొటాషియమ్ వల్ల రక్తపోటు తగ్గుతుంది. గుండెకు రక్షణ కలుగుతుంది.

నివాళి | సి. రాఘవాచారి



స్వచ్ఛమైన అక్షరం.. స్నేహమయ వ్యక్తిత్వం

ఆదర్శాలు మాట్లాడటం వేరు. ఆదర్శంగా జీవించడం వేరు. ఆదర్శంగా జీవిస్తూ ఆ విషయాన్ని ప్రచారం చేసుకోకుండా అదేం పెద్ద గొప్ప కాదు అన్నట్టుగా మరింత గొప్పగా జీవించడం వేరు. రాఘవాచారి ఆ గొప్పతనం ఉన్న గొప్పమనిషి.

చక్రవర్తుల రాఘవాచారి అంటే ఎవరూ గుర్తుపట్టరు. సి.రాఘవాచారి అనగానే ఆ తెల్లటి స్వచ్ఛమైన రూపం గుర్తుకు వస్తుంది. పాత్రికేయుడిగా బహు సుపరిచితుడు. కాని వ్యక్తిగా రాఘవాచారిని పరిచయం చేయడమే చాలా కష్టం. ఒక అమృత హృదయుడి గురించి పరిచయం చేయడానికి మనకు అర్హత ఉందా లేదా అని అంతరాత్మ తప్పనిసరిగా మథన పడుతుంది. తుది శ్వాస వరకు రాఘవాచారి కమ్యూనిస్టుగానే నిరాడంబరంగా జీవించి, ఆదర్శంగా నిలిచారు. స్థితప్రజ్ఞత, పూర్వభాషణం, మృదుభాషణం ఆయన లక్షణాలు.

రాఘవాచారి గారిది ఆదర్శ వివాహం. బాల్యంలో శ్రీవైష్ణవానికి అనుగుణంగా త్రికాల సంధ్యావందనం చేశారు. వైష్ణవ నామాలు, వెనకాల పిలక, పంచెకట్టు, చేతులకు శంఖుచక్రాలు వేయించుకున్నారు. అంతటి నిష్ఠాగరిష్టలైన రాఘవాచారి డిగ్రీ చదువుతుండగా కమ్యూనిజానికి ప్రభావితులయ్యారు. తన ఆలోచనలను మార్చుకున్నారు. పేరు మార్చుకోవలసిన అవసరం ఏముంది? ఆచారి అని ఉంచుకుంటే మాత్రమేం ఆలోచన, ఆచరణలో ఆ పేరు తనకు ఆటంకం కాబోదు కదా అనుకున్నారు. రాఘవాచారి అజాత శత్రువు, ఎవ్వరినీ విమర్శించరు. ఆయనతో మాట్లాడుతుంటే ఒక గ్రంథాలయమంతా కలియతిరిగిన భావన కలుగుతుంది.

రాఘవాచారికి ఇద్దరు ఆడ పిల్లలు. 1990 ఆగస్టులో రెండో అమ్మాయి ప్రమాదవశాత్తు మరణించింది. ఆ సమయంలో రాఘవాచారి నిబ్బరంగా కూర్చోవడం చూసి ఆయనతో 'అమ్మాయి పోయింది కదా!' అని అడిగితే, 'బతికుంటే బాగా చదువుకుని వృద్ధిలోకి వచ్చేది' అన్నారే కాని 'విధి నా మీద పగబూనింది' లాంటి చిన్న మాటలు ఆయన నోటి నుంచి రాలేదు. ఇది ఇలా ఉంటే, రాఘవాచారికి అత్యంత ఆత్మీయుడైన రేడియో దిగ్గజం ఉషశ్రీ సెప్టెంబరు 7, 1990 లో కన్ను మూశారు. అప్పటికి రాఘవాచారి అమ్మాయి పోయి పూర్తిగా నెల కూడా కాలేదు. ఉషశ్రీ హైదరాబాదు ఆసుపత్రిలో గతించే సమయానికి విజయవాడలోని ఉషశ్రీ ఇంట్లో ఆయన తల్లి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీవీలో వార్తలలో అకస్మాత్తుగా తండ్రి గతించిన వార్త చూస్తే పిల్లలు ఏమైపోతారో ఏమోనని రాఘవాచారి సతీమణి జ్యోత్స్న గబగబ ఉషశ్రీ ఇంటికి చేరి విషయం చెప్పారు. ఒక పక్కన తండ్రి పోయినందుకు బాధపడాలో, కూతురు పోయిన బాధలో కూడా ఉషశ్రీ కూతుళ్ల గురించి ఆలోచించిన ఆయన విజ్ఞతకు చేతులెత్తి నమస్కరించాలో తెలియదు.

తొమ్మిదేళ్ల వయసులో రాఘవాచారి

ఉషశ్రీ, రాఘవాచారిది విచిత్రమైన అనుబంధం. ఉషశ్రీ రిటైరయ్యాక, మధ్యాహ్నం భోజనం చేశాక, నిద్ర మధ్యలో లేపద్దని చెప్పి నిద్రపోయేవారు. సరిగ్గా అదే సమయానికి రాఘవాచారి విశాలాంధ్ర ఆఫీసులో ఎడిటోరియల్ పూర్తి చేసి ఐదో నెంబరు బస్సు దిగి, ఉషశ్రీ ఇంటి మీదుగా ఇల్లు చేరుకునేవారు. తప్పనిసరిగా ఉషశ్రీ ఇంటి దగ్గర ఆగి మంచి నీళ్లు తాగి ఉషశ్రీతో కొద్దిసేపు చర్చించి వెళ్లేవారు. ఆయన వస్తే, మాత్రం తప్పకుండా నిద్ర లేపమనేవారు. ఇద్దరూ శ్వేతవస్త్రాలే ధరించడం, ఇద్దరివీ కమ్యూనిస్టు భావాలే కావడం, ఇద్దరికీ సాహిత్య చర్చలంటే ఇష్టం కావడంతో, వీరిద్దరి మధ్య అనుబంధం సన్నని లతలా పెనవేసుకున్నట్లు కూడా తెలియనంత గాఢంగా పెనవేసుకుంది. వారిద్దరూ మార్నింగ్ వాక్ చేస్తుంటే చూసినవారంతా వేదవ్యాస్, కార్ల్ మార్క్స్ అనుకునేవారు. ఒకరి అభిప్రాయాన్ని ఒకరు గౌరవించుకునేవారు. ఉషశ్రీ గతించి మూడు దశాబ్దాలు అవుతున్నా రాఘవాచారి తుదిశ్వాస వరకూ ఆ కుటుంబంతో అనుబంధాన్ని పెనవేసుకునే ఉన్నారు.

తామరాకు మీద నీటిబొట్టు అనే మాట రాఘవాచారికి అన్వయించినట్లుగా మరొకరికి పొసగదు. రాఘవాచారి ఎంత సామాన్యంగా జీవిస్తారో ఒకరు చెప్పవలసిన పని లేదు. ఒక పత్రికకు అతి చిన్న వయసులో ఎడిటర్ అయ్యి, అదే పత్రికకు మూడు దశాబ్దాల పాటు అతి తక్కువ జీతానికి ఎడిటర్‌గా పనిచేసిన ఒకే ఒక్క జర్నలిస్టు బహుశా రాఘవాచారి మాత్రమేనేమో. విజయవాడలో 16 సంవత్సరాలు అద్దె ఇంట్లో ఉండి, ఆ తరవాత సొంత ఇల్లు కట్టుకుని, అక్కడ 16 సంవత్సరాలు ఉన్నాక, కొన్ని కారణాల వల్ల ఇల్లు అమ్మేశారు. 'మీకు బాధగా లేదా' అని ఎవరో ప్రశ్నిస్తే, స్వచ్ఛమైన చిరునవ్వులు నిండిన పెదవులతో, 'ఏముంది షోడశ సంవత్సరాలు అద్దె ఇంట్లో ఉన్నాను. మరో షోడశ కాలం సొంత ఇంట్లో ఉన్నాను. మళ్లీ అద్దె ఇంట్లో ఎంతకాలమంటే అంత కాలం' అని నిజాయితీగా అనేవారు. అసంతృప్తికి అర్థం తెలియదు రాఘవాచారికి. ఆయనకు అనారోగ్యమని తెలిసి ఎవరైనా పలకరించడానికి వెళితే ఆయన తన అనారోగ్య విషయం తప్ప మిగిలిన ఎన్నో విజ్ఞానదాయక విషయాలు మాట్లాడేవారు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, మార్క్సిజం, న్యాయశాస్త్రం, స్టాటిస్టిక్స్... అన్ని అంశాల మీద తడబాటు లేకుండా మాట్లాడగలిగిన శక్తి రాఘవాచారికి ఎక్కడ నుంచి వచ్చిందో మరి.

ఆయనకు పెద్దచిన్న తారతమ్యం తెలియదు. మానవులంతా ఒకటే అనే ఆత్మ కలిగిన రాఘవాచారి రాజకీయనాయకుడిని, రిక్షా తొక్కుకునే వ్యక్తిని, టీ అమ్ముకునే కుర్రవాడిని అందరినీ సమదృష్టితో పలకరించేవారు.

– వైజయంతి

epaper.sakshi.com

సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 30-10-2019

ఉద్యోగ వేటలో.. పొరపాట్ల పర్వం!

పోటీ ప్రపంచం.. రంగం ఏదైనా... కంపెనీ ఎలాంటిదైనా.. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడితే చాలు.. వేలు, లక్షల్లో దరఖాస్తులు! ఒక్కో పోస్టుకు పదుల సంఖ్యలో పోటీ!! ఇలాంటి పరిస్థితుల్లో అడుగడుగునా అప్రమత్తంగా ఉంటేనే కొలువు దక్కుతుంది. లేకుంటే వెనుదిరగాల్సిందే! అభ్యర్థులు రెజ్యూమె దగ్గర నుంచి ఇంటర్వ్యూ వరకూ.. చిన్నచిన్న పొరపాట్లు చేస్తూ.. అవకాశాలు దూరంచేసుకుంటున్నారు. అర్హతలున్నా, సబ్జెక్టుపై పట్టు సాధించినా.. ఉద్యోగ వేటలో విఫలమవుతున్నవారెందరో!! ఇలాంటి అభ్యర్థులు రెజ్యూమె దగ్గర నుంచి ఇంటర్వ్యూలో ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం వరకూ.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపే కథనం... .

చిన్న చిన్న పొరపాట్లతో అవకాశాలు కోల్పోతున్న అభ్యర్థులు

రెజ్యూమె నుంచి ఇంటర్వ్యూ దాకా అప్రమత్తంగా ఉంటేనే కొలువు

ఏ పోస్టు.. ఏ కంపెనీ

ఉద్యోగం కోసం ఎక్కడ, ఎలా ప్రయత్నం చేస్తున్నారనేది చాలా ముఖ్యం. ఇంటర్నెట్ లో కనిపించే కంపెనీలన్నింటికీ రెజ్యూమెలను పంపడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. మన అర్హతలు, భవిష్యత్ కెరీర్ లక్ష్యాలకు అనుగుణంగా చేరాల్సిన కంపెనీ, చేయాల్సిన ఉద్యోగానికి సంబంధించి నిర్ణయం తీసుకోవాలి. లింక్‌డిన్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ద్వారా కూడా మనకు సరిపోయే కంపెనీలను గుర్తించొచ్చు. ప్రముఖ కంపెనీల అధికారిక వెబ్‌సైట్‌లలో ఉద్యోగ సమాచారాన్ని నిత్యం చెక్ చేస్తూ ఉండాలి. ఆయా సంస్థలు నియామక ప్రకటనలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పోస్ట్ చేస్తుంటాయి. దీనివల్ల అయా కంపెనీల్లో అవకాశాలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. మరోవైపు ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా నెట్‌వర్క్ పెంచుకోవడం కూడా ముఖ్యమే. ప్రస్తుతం చాలా కంపెనీలు తమ సీనియర్ ఉద్యోగుల రిఫరెన్స్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. రిక్రూట్‌మెంట్ కన్సల్టెంట్స్ ద్వారా కూడా జాబ్స్ వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే హైరింగ్ కంపెనీల హెచ్‌ఆర్‌లతో, మేనేజర్‌లతో తరచూ మాట్లాడుతుండాలి.

నైపుణ్యాల కొరత

చాలా మంది ఉద్యోగ ప్రయత్నాల్లో సఫలం కాకపోవడానికి నైపుణ్యాల లోపం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇలాంటి అభ్యర్థులు తాము దరఖాస్తు చేస్తున్న పోస్టుకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకోవాలి. వాటిపై అవగాహన పెంచుకునేందుకు కృషిచేయాలి. అదేవిధంగా ఆయా ఉద్యోగ విధులకు సంబంధించిన పరిజ్ఞానం లేకపోవడం, అకడెమిక్ సబ్జెక్టులపై పట్టు లేకపోవడం వల్ల కూడా అవకాశాలు చేజారుతుంటాయి. మరోవైపు కొంత మంది అభ్యర్థులు అవకాశాలు లభించినప్పుడు.. చిన్న ఉద్యోగాలుగా భావించి అలాంటి వాటిని వదులుకుంటారు. అందుకే ఉద్యోగ ప్రయత్నం మొదలు పెట్టేటప్పుడే ముందు మీరు ఎలాంటి ఉద్యోగం కోరుకుంటున్నారు.. మీ అర్హతలు, నైపుణ్యాలు.. ఆ ఉద్యోగానికి సరిపోతాయా? మీరు చదివిన చదువుకు, దరఖాస్తు చేసిన జాబ్‌కు సంబంధం ఉందా?.. ఇలాంటివన్నీ సరిచూసుకొని నిర్ధారణకు రావాలి.

సోషల్ మీడియా ప్రొఫైల్

అధిక శాతం మంది అభ్యర్థులు తమ సోషల్ మీడియా ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేయరు. ఉద్యోగ ప్రయత్నం చేసే ముందు సోషల్ మీడియా సైట్లలోని ప్రొఫైల్‌ను సరి చూసుకోవాలి. ఇచ్చినరెజ్యూమె, మీ సోషల్ మీడియా అకౌంట్లలో ఉన్న సమాచారానికి సరిపోలకుంటే.. పక్కన పెట్టే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. సోషల్ మీడియాలో ఉన్న ప్రొఫైల్ ఫీల్‌గుడ్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అదేవిధంగా ప్రస్తుతం చాలా కంపెనీలు ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను సోషల్ మీడియా ద్వారా క్రాస్‌చెక్ చేస్తున్నాయి. వ్యక్తిగత వివరాలు, ఏవైనా వివాదాస్పద పోస్టింగ్‌లు పెట్టారా, ఎవరి మీదైనా ట్రోలింగ్ చేసారా, సోషల్ మీడియా వేదికగా ఏవైనా తగాదాలు, రాజకీయ గొడవలు జరిగాయా, స్నేహితులతో ఎలాంటి అనుభూతులు పంచుకున్నారు.. ఇలాంటి వాటిపై దృష్టిపెట్టే అవకాశముంది.

తప్పులు లేకుండా, క్లుప్తంగా

చాలామంది రిక్రూటర్లు రెజ్యూమే చూసేందుకు కేవలం 30 సెకన్లు మాత్రమే కేటాయిస్తున్నట్లు ఓ తాజా అధ్యయనం తెలిపింది. కాబట్టి ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ రెజ్యూమెలను ఎలాంటి తప్పులు లేకుండా, క్లుప్తంగా, ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. అలాగే గతంలో పనిచేసిన అనుభవం, విద్యార్హతలకు సంబంధించి పొరపాటు సమాచారం రెజ్యూమెలో పొందుపరచకూడదు. ఎందుకంటే.. కంపెనీలు రెజ్యూమ్‌ను షార్ట్ లిస్ట్ చేశాక... అభ్యర్థి ఇచ్చిన వివరాలను క్రాస్‌చెక్ చేస్తాయి. ఇచ్చిన వివరాలు, అభ్యర్థి నైపుణ్యాలు, కంపెనీ అవసరాలకు తగినట్లు ఉన్నాయో లేదో చూస్తాయి. అలాగే ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలకు క్లుప్తంగా, సూటిగా సమాధానాలు చెప్పాలి. మీరు చెప్పే సమాధానాలు ఇంటర్వ్యూర్‌ను మెప్పించేలా, ఒప్పించేలా ఉండాలి.

కాపీ, పేస్ట్ చేస్తే

ఒక కంపెనీలో ఉద్యోగానికి రాజీనామా చేశాక.. మరో సంస్థలో జాబ్ కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో చాలామంది అభ్యర్థులు తమ రెజ్యూమెతోపాటు రిఫరెన్స్ లెటర్‌ను జత చేస్తున్నారు. ఇలాచేస్తే సదరు రెజ్యూమెను పరిగణనలోకి తీసుకునే అవకాశం తక్కువే. అలాగే రెజ్యూమె కాపీ పేస్ట్ చేసినట్లు ఉండకూడదు. మీ రెజ్యూమె అన్ని విధాల స్పష్టంగా ఉన్నప్పుడే.. సదరు సంస్థ మీ దరఖాస్తును పరిగణనలోకి తీసుకునే వీలుంది. రెజ్యూమె పంపే ముందు మీరు గతంలో ఏ కంపెనీలో పని చేసారు.. ఎలాంటి ప్రాజెక్ట్ లేదా విభాగంలో పనిచేశారో స్పష్టంగా పేర్కొనండి.

బాడీ లాంగ్వేజ్

వ్యక్తిగతంగా మంచి ముద్ర వేయాలంటే.. అభ్యర్థి బాడీ లాంగ్వేజ్ చాలా ముఖ్యం. ఇంటర్వ్యూకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఎక్కువగా తమ బాడీ లాంగ్వేజ్ విషయంలో అశ్రద్ధ వహిస్తుంటారు. తద్వారా తమని తాము ప్రదర్శించుకోవడంలో విఫలమవుతుంటారు.

- దుస్తులు ఆడంబరంగా కాకుండా.. సింపుల్‌గా, ఫార్మల్‌గా ఉండాలి.
- ఇంటర్వ్యూలో రిలాక్స్ అయినట్లు కూర్చోకూడదు.
- ఇంటర్వ్యూ చేసే వారందరనీ మర్యాదపూర్వక పరిచయం చేసుకోవాలి.
- అడిగిన ప్రతి ప్రశ్నకు చిరునవ్వుతో సమాధానం ఇవ్వాలి. నీరసంగా మాట్లాడకూడదు. అతి చురుకుగా ఉండకుండా.. మధ్యస్థితితో సమాధానాలు ఇవ్వాలి.
- అభ్యర్థి తన నైపుణ్యాలను పూరిస్థాయి ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించాలి.

సమయానికి ముందుగానే

రెజ్యూమెను సంబంధిత కంపెనీకి లేదా రిక్రూటర్‌కు పంపిన తర్వాత వారి నుంచి మెసేజ్ వచ్చే వరకూ వేచి ఉండాలి. ఇంటర్వ్యూకు పిలిచినప్పుడు నిర్ణీత సమయానికంటే ముందుగానే వెళ్లాలి. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కొంతమంది పలు కారణాలతో ఆలస్యంగా చేరుకుంటారు. టైం మేనేజ్‌మెంట్ అనేది ఉద్యోగ విధుల్లో చాలా ముఖ్యం. కాబట్టి నిర్దేశిత సమయం కంటే ముందుగానే అక్కడ ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. మరోవైపు ఉద్యోగాలు ఇప్పిస్తామని బ్యాక్‌డోర్ ప్రాసెస్ పేరుతో కొంతమంది మోసంచేసే ఆస్కారం కూడా ఉంటుంది. ఇలాంటి ప్రలోభాలకు దూరంగా ఉండటం మేలు. అలాగే ఇంటర్వ్యూకు హాజరయ్యాక కంపెనీ నుంచి ఎలాంటి సమాచారం రాకుంటే నిరాశ చెందకండి. మళ్లీ ఖాళీలు ఉన్నప్పుడు పిలిచే అవకాశం ఉంటుంది.

వినయంగా మాట్లాడటం

పర్సనల్ ఇంటర్వ్యూ జరుగుతున్న సమయంలో కొంతమంది అభ్యర్థులు అడిగిన ప్రశ్నలకు సరిగా స్పందించరు. ముఖ్యంగా ఇంటర్వ్యూలో కంపెనీకి సంబంధించిన ప్రశ్నలు అడిగినప్పుడు సమాధానం చెప్పలేకపోతే ఉద్యోగానికి సరిపోరనే అంచనాకు వస్తారు. కంపెనీ గురించిన సమాచారం అడిగితే వీలైనంతగా చెప్పేలా సిద్ధపడాలి. ఇంటర్వ్యూలో వినయంగా మాట్లాడం చాలా ముఖ్యం. అమాయక మనస్తత్వంతో కాకుండా.. భయపడకుండా ధైర్యంగా మాట్లాడాలి. అడిగిన ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానం చెప్పాలి. తెలియకుంటే.. తెలియదని స్పష్టం చేయాలి. ప్రశ్న పూర్తిగా విన్న తర్వాతనే స్పందించాలి. మాట్లాడేటప్పుడు ఆధిపత్య ధోరణితో వ్యవహరించకూడదు.

డిమాండ్‌లు పెట్టొద్దు

ఇంటర్వ్యూ తర్వాత జీతం, ఉద్యోగం చేయాల్సిన ప్రాంతం విషయంలో డిమాండ్‌లు పెట్టకూడదు. ఇలా చేస్తే అవకాశాలు దెబ్బతింటాయి. ఉద్యోగంలో చేరేటప్పుడు వీటికి సంబంధించి కంపెనీ నిబంధనలకు అనుగుణంగా నడుచుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి దీనిపై ఇప్పుడే డిమాండ్ చేస్తున్నట్లు వ్యవహరించకూడదు. అలాగే సంస్థలో పని గంటలు, షిఫ్టులకు సంబంధించి వివరాలు ఇప్పటికే సదరు కంపెనీలో పనిచేసే వ్యక్తుల ద్వారా తెలుసుకొని.. అనుకూలంగా అనిపిస్తే ముందుకు వెళ్లడానికి సిద్ధపడాలి. ఏ ప్రాంతంలో పని చేయలనుకుంటున్నారు అనేది కూడా ముందుగా నిర్ణయం తీసుకొని ఆయా సంస్థలకు దరఖాస్తు చేసుకోవాలి!!

ఫోన్ ఇంటర్వ్యూ.. అంతరాయం

ప్రస్తుతం చాలా కంపెనీల్లో ఫోన్ ఇంటర్వ్యూ సర్వసాధారణంగా మారింది. అభ్యర్థులు ఎక్కువ మంది ఉండటంతో పాటు, కంపెనీ సుదూర ప్రాంతంలో ఉన్న సందర్భాల్లో ఫోన్ ఇంటర్వ్యూలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. అంతేకాకుండా అభ్యర్థి పంపిన రెజ్యూమె ఆధారంగా ఓ అంచనాకు రావడం కష్టమని భావించినప్పుడు కూడా ఫోన్ ఇంటర్వ్యూ చేస్తుంటారు. ఎక్కువగా బీపీవో, టెలీ మార్కెటింగ్, కాల్ సెంటర్ వంటి ఉద్యోగాల కోసమైతే.. అభ్యర్థి ఏ విధంగా మాట్లాడుతున్నాడో తెలుసుకోవడానికి ఇలా చేస్తారు. కొన్నిసార్లు ముందుగా చెప్పకుండానే టెలిఫోన్ ఇంటర్వ్యూ చేస్తారు. అలాంటి సందర్భాల్లో అభ్యర్థులు ఫోన్ ఇంటర్వ్యూను కూడా పర్సనల్ ఇంటర్వ్యూగానే భావించాలి. ఇంటర్వ్యూకు సంబంధించి ఫోన్ వస్తుందని ముందే సమాచారం ఉంటే.. ఫోన్ పని చేస్తుందో లేదో సరిచూసుకోవాలి. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు ఎటువంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఆవేశంగా కానీ, అసహనంగా కానీ, నీరసంగా కానీ సమాధానాలు ఇవ్వకూడదు. రెజ్యూమెలో ఏ అంశాలైతే పేర్కొన్నారో అవే చెప్పాలి. గతంలో ఏ సంస్థలో పని చేశారు.. ఇప్పుడు ఎందుకు మానేశారో సావధానంగా వివరించగలగాలి. అలాగే జీతం, ప్యాకేజీ విషయంలో పట్టుబట్టకపోవడమే మంచిది.

కేంద్ర ప్రభుత్వ కొలువు.. నెలకు రూ.70 వేల వేతనం

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)... కేంద్రంలో కీలక కొలువుల భర్తీని చేపడుతోంది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్)ఎగ్జామినేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కీలకమైన గ్రూపు-బి,సి పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. డిగ్రీ అర్హతతోనే సీజీఎల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. గెజిటెడ్ కేడర్ పోస్టులకు ఎంపికైప్రధాన నగరాల్లో పనిచేసే వారు నెలకు రూ.70వేల వరకూ వేతనం అందుకోవచ్చు. దీంతోపాటు సామాజిక హోదా, ఆకర్షణీయమైన వేతనాలు, హోంస్టేట్ పోస్టింగ్ అవకాశాలు, ఇతర ఎన్నో సదుపాయాలు అందుకోవచ్చు. ఎస్ఎస్‌సీ సీజీఎల్ ఈ-2019కు తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నోటిఫికేషన్ సమాచారం, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం గురించి తెలుసుకుందాం..

- » సీజీఎల్ 2019 పరీక్షకు నోటిఫికేషన్‌కు విడుదల చేసిన ఎస్ఎస్‌సీ
- » కేంద్ర శాఖల్లో గెజిటెడ్ ఆఫీసర్ కేడర్ మొదలు టాక్స్ అసిస్టెంట్ వరకు పోస్టులు భర్తీ
- » ఇన్‌కంట్యాక్స్, ఎక్సైజ్, ఎగ్జామినర్, సీబీఐ వంటి యూనిఫాం పోస్టులకు ఎంపిక
- » ఇంటర్వ్యూ లేకుండానే గ్రూపు -బి, సి పోస్టులను దక్కించుకునే అవకాశం
- » నవంబర్ 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

పోస్టులు.. పేస్కేల్

» **పోస్టు:** అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ (గ్రూపు-బి గెజిటెడ్ పోస్టులు).
✦ **వేతనం:** బేసిక్ పేస్కేల్: రూ. 47,600.
✦ **వయసు:** 30 ఏళ్లు

» **పోస్టు:** అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎస్‌వో-సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్, ఐబీ, రైల్వే, విదేశాంగ మంత్రిత్వ శాఖలు, సాయుధ బలగాల కేంద్ర కార్యాలయాలు, ఇతర మంత్రిత్వ శాఖలు), అసిస్టెంట్, ఇన్‌స్పెక్టర్(ఇన్‌కంట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్, ప్రివెంటివ్ ఆఫీసర్,ఎగ్జామినర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్,నార్కోటిక్స్), అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సీబీఐ ఎస్ఐ.
✦ **బేసిక్ పేస్కేల్:** రూ. 44,900
✦ **వయసు:** 20 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలి. కొన్ని పోస్టులకు కనిష్ట వయసు 18 ఏళ్లు.

» **పోస్టు:** అసిస్టెంట్, అసిస్టెంట్/సూపరింటెండెంట్, డివిజనల్ అకౌంటెంట్, ఎస్ఐ (ఎన్ఐఏ), జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (జేఎస్‌వో), స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్ 2.
✦ **బేసిక్ పేస్కేల్:** 35,400
✦ **వయసు:** 30 ఏళ్ల లోపు ఉండాలి. జేఎస్‌వో పోస్టులకు గరిష్ట వయో పరిమితి 32 ఏళ్లు.

» **పోస్టు:** ఆడిటర్, అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్ (గ్రూపు - సి పోస్టులు)
✦ **బేసిక్ పేస్కేల్:** 29,200
✦ **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల లోపు ఉండాలి.

» **పోస్టు:** సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్, ట్యాక్స్ అసిస్టెంట్, ఎస్ఐ (నార్కోటిక్స్), అప్పర్ డివిజన్ క్లర్క్.
✦ **బేసిక్ పేస్కేల్:** 25,500
✦ **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల లోపు ఉండాలి.
✦ ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, వికలాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు అర్హత సాధించాలంటే.. నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి. దేహ దారుఢ్య పరీక్షలూ ఉంటాయి.

డిగ్రీ ఉంటే చాలు.. అర్హులే

✦ 2020 జనవరి 1 నాటికి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు సీజీఎల్ పరీక్షకు అర్హులు. ఫైనల్ ఇయర్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ 2020 జనవరి 1 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలి.
✦ జేఎస్‌వో పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్ మ్యాథమెటిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి (లేదా) డిగ్రీలో స్టాటిస్టిక్స్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ✦ స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్ 2 ఉద్యోగాలకు డిగ్రీలో ప్రతి ఏడాది స్టాటిస్టిక్స్ సబ్జెక్టు చదివిన వారే అర్హులు. ✦ ఏఎవో పోస్టులకు చార్టెర్డ్ అకౌంటెంట్/మేనేజ్‌మెంట్ అకౌంటెంట్/కంపెనీ సెక్రటరీ/ ఎంకామ్/మాస్టర్స్ ఇన్ బిజినెస్ స్టడీస్/ ఎంబీఏ(ఫైనాన్స్)/మాస్టర్స్ ఇన్ బిజినెస్ ఎకనామిక్స్ విద్యార్హతలు అభిలషణీయం. ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ప్రొబేషన్ పీరియడ్‌లో 'సబార్డినేట్ ఆడిట్/ అకౌంట్ సర్వీస్ ఎగ్జామినేషన్'లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

ఎంపిక

అభ్యర్థుల ఎంపిక ఆయా పోస్టుల ఆధారంగా మూడు/నాలుగు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో.. టైర్-1 ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఇందులో కమిషన్ నిర్ణయించిన నిర్దేశిత మార్కులు సాధించిన వారినే తర్వాతి దశ టైర్-2కు పిలుస్తారు. ఇది కూడా కంప్యూటర్ ఆధారిత పరీక్షే. దీనితోపాటు టైర్-3(డిస్క్రిప్టివ్ పరీక్ష)కు అర్హత లభిస్తుంది. టైర్-1,2ల్లో రుణాత్మక మార్కులు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి నాలుగో వంతు మార్కులు కోత విధిస్తారు. సెక్షన్ కటాఫ్ ఉండదు. టైర్-3 ఇంగ్లిష్/ హిందీ భాషలో ప్రావీణ్యం పరీక్షించే విధంగా ఉంటుంది. తర్వాత దశలో కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్/ స్కిల్ టెస్ట్/డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఉంటాయి. ఫైనల్‌గా టైర్ -1, 2, 3ల్లో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు.

పరీక్షా విధానం

✦ టైర్-1ను గంట వ్యవధిలో మల్టిపుల్ చాయిస్ విధానంలో నిర్వహిస్తారు. నాలుగు సబ్జెక్టులు.. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ ఉంటాయి. ప్రతి సబ్జెక్ట్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 2 మార్కుల చొప్పున మొత్తం 200 మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు.
✦ **టైర్-2:** టైర్-1లో కమిషన్ నిర్ణయించిన కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులకు టైర్ -2కు అర్హత లభిస్తుంది. ఇందులో నాలుగు పేపర్లు ఉంటాయి. పేపర్-1, పేపర్ -2లు అన్ని పోస్టులకు కామన్. ఇక జేఎస్‌వో పోస్టుకు దరఖాస్తు చేసుకుంటే.. పేపర్-3 (200 మార్కులకు); అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్(ఏఏవో), అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్(ఏఏవో) పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే.. పేపర్-4 (200 మార్కులకు)కు హాజరు కావాలి. పేపర్-3 స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్‌పై; పేపర్-4 ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్ సబ్జెక్టులపై ఉంటుంది. ఇవి కూడా మల్టిపుల్ చాయిస్ విధానంలోనే జరుగుతాయి. కామన్‌గా పేపర్-1,2ల్లో వరుసగా క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి. క్వాంటిటేటివ్ ఎబిలిటీస్‌లో 100 ప్రశ్నలు-200 మార్కులకు; ఇంగ్లిష్‌లో 200 ప్రశ్నలు- 200 మార్కులకు అబ్జెక్టివ్ విధానంలో అడుగుతారు.
✦ టైర్-2తోపాటు టైర్-3 కూడా ఒకేసారి నిర్వహిస్తారు. గంట సమయంలో నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా 'పెన్ అండ్ పేపర్' విధానంలో రాయాలి. హిందీ/ ఇంగ్లిష్ మాధ్యమంలో పరీక్ష ఉంటుంది. ఇందులో లెటర్ రైటింగ్, ప్రిసైజ్ రైటింగ్, ఎస్సే రైటింగ్, అప్లికేషన్ రైటింగ్ మొదలైనవి ఉంటాయి.

ముఖ్య తేదీలు

✦ **దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది:** 25.11.2019
✦ **ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపునకు చివరి తేది:** 2019 నవంబర్ 27
✦ **చలాన్ ద్వారా ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 2019 నవంబర్ 29
✦ **టైర్-1 కంప్యూటర్ పరీక్ష తేదీలు:** 2020 మార్చి 2 నుంచి 11 వరకు
✦ **టైర్-2, 3 పరీక్ష తేదీలు:** 2020 జూన్ 22 నుంచి జూన్ 25 వరకు
✦ **ఆన్‌లైన్ దరఖాస్తు రుసుం:** రూ.100 (మహిళలకు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపునిచ్చారు)
✦ **వెబ్‌సైట్:** https://ssc.nic.in

ఎన్‌పీసీలో 24 పోస్టులు

న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ (ఎన్‌పీసీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 24 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ **విభాగాల వారీ ఖాళీలు:** సీనియర్ కన్సల్టెంట్లు-9, కన్సల్టెంట్లు-11, జూనియర్ కన్సల్టెంట్లు-4.
✦ **విభాగాలు:** లీగల్, ఫైనాన్స్ అండ్ ప్రొక్యూర్మెంట్, లాజిస్టిక్స్, కమ్యూనికేషన్స్ తదితర విభాగాలున్నాయి.
✦ **ఒప్పంద కాలపరిమితి:** మూడేళ్లు.
✦ **అర్హత:** పోస్టులను బట్టి ఎల్ఎల్‌బీ/మాస్టర్స్ డిగ్రీ మేనేజ్‌మెంట్/ఎకనామిక్స్/ అప్లయిడ్ ఎకనామిక్స్/ఓఆర్/స్టాటిస్టిక్స్/ సీఏ/సీఎస్/ ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
✦ **వయసు:** గరిష్టంగా సీనియర్ కన్సల్టెంట్ పోస్టులకు 45 ఏళ్లు, కన్సల్టెంట్ పోస్టులకు 40, జూనియర్ కన్సల్టెంట్ పోస్టులకు 35 ఏళ్లుండాలి.
✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 11, 2019.
✦ **వెబ్‌సైట్:** www.npcindia.gov.in

యూపీఎస్సీలో 67 పోస్టులు

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 67 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ **విభాగాల వారీ ఖాళీలు:** కంపెనీ ప్రాసిక్యూటర్-11, ప్రాసిక్యూటర్-1, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ -2, డైరెక్టర్-1, స్పెషలిస్ట్ గ్రేడ్-3 (డెర్మటాలజీ) -7, స్పెషలిస్ట్ గ్రేడ్-3 (అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ) -9, స్పెషలిస్ట్ గ్రేడ్-3 (ఆఫ్తాల్మాలజీ)-2, స్పెషలిస్ట్ గ్రేడ్-3 (ఆర్థోపెడిక్స్)-9, పీడియాట్రిక్స్-18, సైకియాట్రిక్స్-7.
✦ **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా/డిగ్రీ/ఎంబీబీఎస్/ఎండీ/ పీజీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
✦ **వయసు:** పోస్టులను బట్టి 30-50 ఏళ్ల మధ్య ఉండాలి.
✦ **ఎంపిక:** షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 14, 2019.
✦ **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఎన్ఎఫ్ఎల్‌లో 24 పోస్టులు

మినీరత్న హోదా కలిగిన భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 24 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ **పోస్టులు:** సీనియర్ కెమిస్ట్-6, మేనేజర్-2, సీనియర్ మేనేజర్-3, ట్రాన్స్‌పోర్టేషన్ ఆఫీసర్-5, మెడికల్ ఆఫీసర్-8.
✦ **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/ ఎంఎస్సీ/ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
✦ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ **ఎంపిక:** షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
✦ **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 9, 2019.
✦ **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

ఐసీఎంఆర్-డీహెచ్ఆర్ ఇంటర్నేషనల్ ఫెలోషిప్‌లు

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆరోగ్య పరిశోధనా విభాగానికి చెందిన ఐసీఎంఆర్-డీహెచ్ఆర్ 2020-21కి గాను ఇంటర్నేషనల్ ఫెలోషిప్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

1. షార్ట్‌టర్మ్ ఇంటర్నేషనల్ ఫెలోషిప్స్
✦ **అర్హులు:** సీనియర్ ఇండియన్ బయోమెడ

హిట్ వికెట్!

బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్‌పై రెండేళ్ల నిషేధం

- ఫిక్సింగ్ కోసం బుకీ సంప్రదించిన విషయాన్ని దాచినందుకు ఐసీసీ చర్య
- భారత్‌తో సిరీస్‌కు, వచ్చే ఏడాది టి20 ప్రపంచ కప్‌కు దూరం

ఢాకా/దుబాయ్: బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) రెండేళ్ల నిషేధం విధించింది. ఫిక్సింగ్ చేసేందుకు తనను కొందరు బుకీలు సంప్రదించిన సమయంలో అవినీతి నిరోధక బృందానికి షకీబ్ సమాచారం ఇవ్వకపోవడంతో అతనిపై చర్య తీసుకున్నట్లు ఐసీసీ ప్రకటించింది. 2018లో జరిగిన రెండు టోర్నీల సందర్భంగా షకీబ్‌ను బుకీ సంప్రదించాడు. బంగ్లా కెప్టెన్‌పై ఐసీసీ మూడు వేర్వేరు ఆరోపణలు చేసింది. అతను తన తప్పు అంగీకరించడంతో శిక్ష విధించింది. 'అవినీతికి పాల్పడేందుకు ఎవరైనా సంప్రదించినప్పుడు ఏదైనా తప్ప నిసరి కారణం ఉంటే తప్ప ఆలస్యం చేయకుండా వెంటనే సమాచారం అందించాలి. ఎంత ఆలస్యం చేస్తే విచారణ అంత సంక్లిష్టంగా మారుతుంది. సరిగ్గా చెప్పాలంటే ఏ మ్యాచ్ కోసమైతే సంప్రదించారో ఆ మ్యాచ్ ముగిసేవరకు కూడా ఆగరాదు' అని ఐసీసీలోని అవినీతి నిరోధక విభాగంలో నిబంధన 2.4.4 చెబుతోంది. దీని ప్రకారం కనీసం ఆరు నెలల నుంచి గరిష్టంగా ఐదేళ్ల వరకు శిక్ష విధించవచ్చు. ఈ నిబంధనను షకీబ్ అతిక్రమించాడు. అత్యంత అనుభవజ్ఞుడైన షకీబ్‌కు నియమ నిబంధనలపై అన్ని రకాలుగా అవగాహన ఉందని, అయినా సరే అతను దీనిని వెల్లడించకపోవడం తప్పిదంగా భావిస్తున్నట్లు ఐసీసీ జనరల్ మేనేజర్ అలెక్స్ మార్షల్ వ్యాఖ్యానించారు.

ప్రపంచ క్రికెట్‌లో చిన్నపాటి కుదుపు. మళ్లీ ఫిక్సింగ్ తుఫాన్ ఒక అగ్రశ్రేణి క్రికెటర్‌ను తాకింది. అయితే ఈ సారి కొంత భిన్నమైన రూపంలో! మ్యాచ్‌లు ఫిక్స్ చేయకపోయినా, అందుకు ప్రేరేపించిన వారి గురించి ఐసీసీకి సమాచారం ఇవ్వడంలో విఫలమైనందుకు తీవ్ర చర్య! బంగ్లాదేశ్ సీనియర్ క్రికెటర్, ప్రపంచ నంబర్‌వన్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌పై రెండేళ్ల నిషేధం పడింది. ఫిక్సింగ్‌కు సంబంధించిన వివాదంలో ఒక అంతర్జాతీయ కెప్టెన్‌పై ఈ తరహాలో వేటు పడటం అనూహ్య, అరుదైన పరిణామం. తాజా శిక్ష నేపథ్యంలో 32 ఏళ్ల షకీబ్ కెరీర్ ఎలాంటి మలుపు తీసుకుంటుందో చూడాలి.

ఏడాది తర్వాత ఆడవచ్చు...

రెండేళ్ల నిషేధంలో మొదటి సంవత్సరంలో షకీబ్ పూర్తిగా ఆటకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. ఈ మధ్య కాలంలో అతను మళ్లీ ఎలాంటి తప్పూ చేయరాదు. ఐసీసీ అవినీతి నిరోధక ప్రచార కార్యక్రమాల్లో కూడా పాల్గొనాల్సి ఉంటుంది. ఆ తర్వాతి 12 నెలలు అతనిపై ఐసీసీ పర్యవేక్షణ (సస్పెండెడ్ సెన్‌టెన్స్) కొనసాగుతుంది. 2020 అక్టోబర్ 29 నుంచి షకీబ్ మళ్లీ క్రికెట్ బరిలోకి దిగేందుకు అర్హుడవుతాడు.

వరల్డ్ కప్‌కు దూరం...

తాజా పరిణామంలో షకీబ్ భారత్‌తో జరిగే టెస్టు, టి20 సిరీస్‌లకు దూరమయ్యాడు. ప్రస్తుతం ఐసీసీ ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో 3వ (టెస్టు), 1వ (వన్డే), 2వ (టి20) స్థానాల్లో అతను కొనసాగుతున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా పలు లీగ్‌లలో షకీబ్ కీలక ఆటగాడు. నిషేధం నేపథ్యంలో వచ్చే ఏడాది ఐపీఎల్‌లో అతను ఆడే అవకాశం లేదు. అయితే అన్నింటికి మించి ఆస్ట్రేలియాలో జరిగే టి20 ప్రపంచ కప్ అవకాశాలు కోల్పోవడం బంగ్లాదేశ్ జట్టుకు పెద్ద దెబ్బ. ఈ టోర్నీ అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15 వరకు జరుగుతుంది. అక్టోబర్ 29 నుంచి అతను అందుబాటులోకి వస్తున్నా నిషేధం కొనసాగుతున్న సమయంలో అతడిని ఎంపిక చేసే సాహసం బంగ్లా బోర్డు చేస్తుందా అనేది సందేహమే.

విభేదాలే కారణమా!

కొన్నాళ్ల క్రితం బంగ్లాదేశ్ క్రికెట్‌లో ఫిక్సింగ్‌కు సంబంధించి వార్తలు వచ్చాయి. ఇవేవీ నిర్ధారణ కాకున్నా బంగ్లా బోర్డుకు దీనిపై సమాచారమైతే ఉంది. అయితే ఇప్పుడు సరిగ్గా భారత్‌తో సిరీస్‌కు ముందు ఏడాది క్రితంనాటి అంశం బయటపడటం సందేహాలు రేకెత్తించింది. వారం రోజుల క్రితం తమ కాంట్రాక్ట్ ఫీజులు పెంచడం మొదలు ఇతర సమస్యలు తీర్చాలంటూ బంగ్లా క్రికెటర్లు సమ్మె చేయగా దీనికి షకీబ్ నాయకత్వం వహించాడు. చర్చలు సఫలమై సమ్మె ముగిసినా... అంతర్గతంగా పరిస్థితి చక్కబడలేదు. షకీబ్ తదితర ఆటగాళ్లు తిరుగుబాటు చేసి భారత్‌తో సిరీస్‌కు వెళ్లకుండా కావాలని అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ స్వయంగా బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ హసన్ బహిరంగ వ్యాఖ్య చేయడం దీనిని నిర్ధారించింది. బుధవారం బంగ్లా జట్టు భారత్‌కు బయల్దేరాల్సి ఉంది. బోర్డు రాజకీయాలకు, షకీబ్ నిషేధానికి ఏదైనా సంబంధం ఉండవచ్చని వినిపిస్తోంది.

ఐపీఎల్ వరకు ఆగమంటావా!... షకీబ్‌తో బుకీ వాట్సప్ సంభాషణ

బంగ్లాదేశ్, శ్రీలంక, జింబాబ్వే పాల్గొన్న ముక్కోణపు వన్డే టోర్నీ, ఐపీఎల్‌లో ఒక మ్యాచ్‌కు సంబంధించి బుకీలు షకీబ్‌తో ఫిక్సింగ్ చేయించేందుకు ప్రయత్నించినట్లు ఐసీసీ వెల్లడించింది. ఈ మొత్తం వ్యవహారంలో భారత బుకీగా అనుమానిస్తున్న అగర్వాల్ అనే వ్యక్తి షకీబ్‌తో వాట్సప్ చాటింగ్ చేశాడు. ముందుగా 2017 నవంబర్‌లో ఢాకా ప్రీమియర్ లీగ్ సమయంలో ఒక మిత్రుడి ద్వారా షకీబ్ ఫోన్ నంబర్‌ను అగర్వాల్ తెలుసుకున్నాడు. ఆ తర్వాత తనను కలవాలనుకుంటున్నట్లు మెసేజ్‌లు పెట్టాడు. 2018 జనవరిలో ముక్కోణపు టోర్నీ సందర్భంగా 'మనం ఈ టోర్నీలో పని చేద్దామా లేక ఐపీఎల్ వరకు ఆగమంటావా' అని అగర్వాల్ సందేశం పంపాడు. 2018 ఏప్రిల్‌లో పంజాబ్, సన్‌రైజర్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరిగింది. సన్‌రైజర్స్ తరఫున ఆ మ్యాచ్‌లో ఎవరెవరు ఆడుతున్నారో బుకీ తెలుసుకునే ప్రయత్నం చేశాడు. దీనికి షకీబ్ స్పందించలేదు. ఆ తర్వాత అగర్వాల్‌ను బుకీగా భావించి తాను దూరమైనట్లు షకీబ్ ఐసీసీ విచారణలో వెల్లడించాడు. అయితే ఈ సమాచారం మొత్తం తమకు అందించకపోవడమే షకీబ్ చేసిన తప్పని ఐసీసీ చెప్పింది.

> **నిషేధం కారణంగా నేను ఎంతో ప్రేమించే ఆటకు దూరం కావడం చాలా బాధగా ఉంది. అయితే బుకీ సంప్రదించిన విషయాన్ని చెప్పనందుకు నాపై విధించిన శిక్షను అంగీకరిస్తున్నాను. అవినీతికి వ్యతిరేకంగా పని చేయడంలో ఆటగాళ్లు ముందు వరుసలో ఉండాలని ఐసీసీ కోరుకుంటుంది. ఈ విషయంలో నా బాధ్యత నిర్వర్తించలేకపోయాను. క్రికెట్ అవినీతి రహితంగా ఉండాలనే చాలా మందిలాగే నేనూ కోరుకుంటున్నా. ఇకపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగంతో కలిసి పని చేస్తా. నేను చేసిన తప్పును కుర్రాళ్లు చేయకుండా చూస్తా.**
>
> -షకీబ్ అల్ హసన్

కెప్టెన్లుగా మోమిన్, మహ్ముదుల్లా

షకీబ్ దూరమైన నేపథ్యంలో భారత్‌తో జరిగే టెస్టు, టి20 సిరీస్‌లకు బంగ్లాదేశ్ కొత్త కెప్టెన్లను ప్రకటించింది. టెస్టు జట్టుకు మోమినుల్ హక్, టి20 జట్టుకు మహ్ముదుల్లా కెప్టెన్లుగా వ్యవహరిస్తారు. ఈ పర్యటనలో భారత్-బంగ్లా మధ్య 3 టి20 మ్యాచ్‌లు, 2 టెస్టులు జరుగుతాయి.

మరోవైపు షకీబ్‌కు తాము అండగా నిలుస్తామని బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రకటించారు. 'షకీబ్ తప్పు చేశాడనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ విషయం తనకూ తెలుసు. ఐసీసీ నిర్ణయంలో ప్రభుత్వం చేసేదేమీ లేదు కానీ అతను తన తప్పు తెలుసుకొని మరింత తెలివైన ఆటగాడిగా తిరిగొస్తాడు' అని హసీనా వ్యాఖ్యానించారు.

వివాదాల 'హీరో'

అంతర్జాతీయ క్రికెట్‌లో దాదాపు 12 వేల పరుగులు, 500కు పైగా వికెట్లు... మూడు ఫార్మాట్‌ల ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానంలో నిలిచిన ఏకైక ఆల్‌రౌండర్... ఒకే టెస్టులో సెంచరీ చేయడంతో పాటు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి పది వికెట్లు పడగొట్టిన అరుదైన రికార్డు... 13 ఏళ్ల కెరీర్‌లో షకీబ్ అల్ హసన్ సాధించిన ఘనతలెన్నో... మరో మాటకు తావు లేకుండా, నిస్సందేహంగా అతను బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాడు. జట్టు సారథిగా కూడా అతను ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించాడు. అయితే అంతే స్థాయిలో అతను వివాదాలతో కూడా సహవాసం చేశాడు. తాజా నిషేధం నేపథ్యంలో గతంలో షకీబ్ చేసిన తప్పుల జాబితాను చూస్తే...

- 2010 సైట్‌స్క్రీన్‌కు అడ్డుగా వచ్చిన అభిమానిని దూషించి బ్యాట్‌తో కొట్టేందుకు ప్రయత్నించాడని ఆరోపణ. మ్యాచ్ రిఫరీ హెచ్చరిక. కొన్నాళ్లకు ఢాకాలోని సొంత మైదానంలోనే ప్రేక్షకులు గేలి చేయడంతో వారిని తిడుతున్న ఫోటోలు బయటకు వచ్చాయి. మూడేళ్ల తర్వాత ఇదే మైదానంలో మ్యాచ్ చూస్తున్న తన భార్యపై కామెంట్ చేశారంటూ ఒక అభిమానితో గొడవ. మ్యాచ్ సమయంలో డ్రెస్సింగ్ రూమ్ వదిలి వెళ్లడంపై హెచ్చరిక.
- 2014 షకీబ్ కెరీర్‌లో ఇది తీవ్ర ఘటన. శ్రీలంకతో మ్యాచ్‌లో తాను అవుటైన తీరును భారీ స్క్రీన్‌పై కెమెరామెన్ చూపించడంతో... అక్కడ కాదు 'ఇక్కడ' చూడమన్నట్లుగా అసభ్య సైగలు చేశాడు. మూడు వన్డేల నిషేధం, జరిమానా పడగా, ఆ తర్వాత క్షమాపణ కోరాడు.
- 2014 ప్రవర్తన ఏమాత్రం సరిగ్గా లేదంటూ బంగ్లా బోర్డు ఆరు నెలల నిషేధం విధించింది. ఆ తర్వాత జట్టు కోచ్ హతురసింఘేతో గొడవ పడ్డాడు.
- 2018 శ్రీలంకతో నిదాహస్ ట్రోఫీ మ్యాచ్‌లో అంపైర్లు 'నో బాల్' ఇవ్వనందుకు నిరసనగా సహచరులతో సహా మైదానం వీడి మ్యాచ్‌ను బహిష్కరించే ప్రయత్నం చేశాడు. ఐసీసీ 25 శాతం మ్యాచ్ ఫీజు జరిమానాగా విధించింది.

షకీబ్ అంతర్జాతీయ కెరీర్

ఫార్మాట్	మ్యాచ్‌లు	పరుగులు	సగటు	వికెట్లు	సగటు
టెస్టులు	56	3862	39.40	210	31.12
వన్డేలు	206	6323	37.86	260	30.21
టి20లు	76	1567	23.74	92	20.58

కోల్‌కతాలోనే తొలి డే నైట్ టెస్టు

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఆలోచన కార్యరూపం దాల్చనుంది. ఇక భారత్‌లో టెస్టు క్రికెట్ కొత్త 'కాంతు'లీననుంది. సంప్రదాయ ఆటను ఇన్నాళ్లు పగటిపూటే చూశాం. ఇప్పుడు రాత్రి కూడా వీక్షించనున్నాం. భారత్ ఆడబోయే, భారత్‌లో జరగబోయే తొలి డేనైట్ టెస్టుకు గంగూలీ సొంత నగరం కోల్‌కతాలోని విఖ్యాత ఈడెన్ గార్డెన్స్ మైదానం వేదిక కానుండటం మరో విశేషం. ఈ మేరకు గంగూలీ ప్రతిపాదనకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అంగీకరించింది. భారత్‌తో డే నైట్ టెస్టు ఆడేందుకు తాము సిద్ధమేనని ప్రకటించింది. ఫలితంగా వచ్చే నెలలో భారత్, బంగ్లాదేశ్ ఖాతాలో తొలి డే నైట్ టెస్టు చేరనుంది.

- భారత్‌తో 'గులాబీ' బంతి టెస్టు ఆడేందుకు బంగ్లాదేశ్ అంగీకారం
- ఈడెన్ గార్డెన్స్‌లో నవంబర్ 22 నుంచి మ్యాచ్

కోల్‌కతా: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ఎప్పుడో డే నైట్ టెస్టులు ఆడేశాయి. కానీ టెస్టుల్లో నంబర్‌వన్ జట్టు భారత్ మాత్రం ఇప్పటిదాకా ఫ్లడ్‌లైట్ల మధ్య ఐదు రోజుల ఆట ఆడలేదు. ఇప్పుడు టీమిండియా కూడా రూటు మార్చుకుంది. డే నైట్‌కు సై అంది. దీంతో వచ్చే నెలలోనే భారత గడ్డపై కోహ్లి సేన ఆడే డే నైట్ టెస్టును ఎంచక్కా చూసేయొచ్చు. ఇదంతా బీసీసీఐ నూతన అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ సంకల్పం వల్లే సాకారమవుతోంది. అతను అధ్యక్షుడే... కానీ 9 నెలలే ఆ పదవిలో ఉంటాడు. అందుకేనేమో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటల వ్యవధిలోనే నాయకుడు కోహ్లిని 'పింక్ బాల్ క్రికెట్'కు ఒప్పించడంతోనే తన పట్టుదల ఏపాటిదో చేతల ద్వారా చెప్పకనే చెప్పాడు. ఆ వెంటే బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ)తోనూ సంప్రదింపులు మొదలుపెట్టాడు. ప్రపంచంలోనే ధనవంతమైన క్రికెట్ బోర్డు కోరితే ఎవరు మాత్రం కాదంటారు! అందుకనే బీసీబీ కూడా సై అంది.

భారత క్రికెట్‌లో ఈడెన్ గార్డెన్స్‌కు విశేషమైన చరిత్ర ఉంది. ఇప్పుడు ఈ చరిత్రలో మరో పేజీ పింక్‌బాల్‌తో జత కాబోతోంది. నవంబర్ 22 నుంచి 26 వరకు భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య కోల్‌కతాలో జరిగే రెండో టెస్టును ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పింక్‌బాల్‌తో నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. 'బీసీబీ పింక్‌బాల్ టెస్టుకు అంగీకరించింది. ఇది సానుకూల పరిణామం. టెస్టు క్రికెట్‌కు అవసరమైన మార్పు ఇది. నేను, నా బృందం ఇలాంటి ఆట కోసం పరితపించాం. కొత్త తరహా టెస్టుకు సై అన్న కెప్టెన్ కోహ్లికి కూడా థ్యాంక్స్' అని గంగూలీ అన్నాడు. నిజానికి చాన్నాళ్ల క్రితమే దేశవాళీ క్రికెట్‌లో పింక్‌బాల్ క్రికెట్ ఆడించాలని అప్పటి క్రికెట్ కమిటీ చైర్మన్ అయిన గంగూలీ సిఫార్సు చేశాడు. అతని ప్రతిపాదన వల్లే దులీప్ ట్రోఫీలో వరుసగా 2016-17, 2017-18, 2018-19 మూడు సీజన్లు డేనైట్ ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించారు. కానీ ఈ సీజన్‌లో మళ్లీ పాత పద్ధతినే అవలంభించి ఎర్ర బంతితో మ్యాచ్‌లను నిర్వహించారు. కోల్‌కతా డే నైట్ టెస్టు మ్యాచ్‌లో ఆట మధ్యాహ్నం ఒంటి గంట 30 నిమిషాల నుంచి ప్రారంభమవుతుందని... 68 వేల సామర్థ్యమున్న స్టేడియంలో టికెట్ల ధరను కనిష్టంగా రూ. 50 నుంచి విక్రయిస్తామని 'క్యాబ్' సెక్రటరీ అవిషేక్ దాల్మియా తెలిపాడు.

ఈ నాలుగేళ్లలో పదకొండే!

డే నైట్ టెస్టు ముచ్చట ఇప్పటిది కాదు. నాలుగేళ్ల క్రితమే 2015లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్ల మధ్య పింక్‌బాల్ మ్యాచ్ జరిగింది. కానీ ఈ నాలుగేళ్లలో కేవలం 11 మ్యాచ్‌లే జరిగాయి. అయితే అన్నింట్లోనూ ఫలితాలు వచ్చాయి.

భారత మహిళలదే ఎమర్జింగ్ కప్

ఫైనల్లో శ్రీలంకపై 14 పరుగులతో గెలుపు

కొలంబో: ఆసియా కప్ మహిళల ఎమర్జింగ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. శ్రీలంక మహిళల జట్టుతో మంగళవారం జరిగిన ఫైనల్లో దేవిక వైద్య నాయకత్వంలోని టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 14 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 175 పరుగులు సాధించింది. తనుశ్రీ సర్కార్ (47; 4 ఫోర్లు), సిమ్రన్ బహదూర్ (34; 3 ఫోర్లు, సిక్స్) రాణించారు. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. భారత ఇన్నింగ్స్ తర్వాత వర్షం రావడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతితో శ్రీలంక లక్ష్యాన్ని 35 ఓవర్లలో 150 పరుగులుగా సవరించారు. శ్రీలంక 34.3 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో తనుజా కన్వర్ (4/15), దేవిక వైద్య (4/29) నాలుగేసి వికెట్లు తీసి జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించారు.

మరోసారి కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో...

తొమ్మిదో స్థానంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జంట

న్యూఢిల్లీ: గతవారం ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ పురోగతి సాధించింది. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 11వ ర్యాంక్ నుంచి 9వ ర్యాంక్‌కు చేరుకుంది. రెండోసారి తమ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో నిలిచింది. ఆగస్టులో థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీలో టైటిల్ సాధించాక ఈ ఇద్దరు తొలిసారి 9వ ర్యాంక్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత టాప్-10 నుంచి బయటకు వచ్చి...ఫ్రెంచ్ ఓపెన్‌లో రాణించి మళ్లీ టాప్-10లోకి వచ్చారు.

నిఖత్‌కు పతకం ఖాయం

మరో ఆరుగురు భారత బాక్సర్లకు కూడా • టోక్యో ఒలింపిక్స్ టెస్ట్ ఈవెంట్

టోక్యో: రింగ్‌లోకి అడుగు పెట్టకుండానే ఆరుగురు భారత బాక్సర్లకు... క్వార్టర్ ఫైనల్లో విజయంతో మరో భారత బాక్సర్‌కు టోక్యో ఒలింపిక్స్ బాక్సింగ్ టెస్ట్ ఈవెంట్‌లో పతకాలు ఖాయమయ్యాయి. మంగళవారం మొదలైన ఈ టోర్నీలో పురుషుల 63 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో శివ థాపా 5-0తో యుకీ హిరకావ (జపాన్)పై గెలుపొంది సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. తక్కువ ఎంట్రీల కారణంగా మరో ఆరుగురు భారత బాక్సర్లకు నేరుగా సెమీఫైనల్లో చోటు లభించడంతో వారి ఖాతాలో పతకాలు చేరనున్నాయి. మహిళల విభాగంలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీలు), సిమ్రన్‌జిత్ కౌర్ (60 కేజీలు), పూజా రాణి (75 కేజీలు)... పురుషుల విభాగంలో సుమీత్ సాంగ్వాన్ (91 కేజీలు), ఆశిష్ (69 కేజీలు), వన్ హిలిమ్‌పుయా (75 కేజీలు) నేరుగా సెమీఫైనల్ బౌట్‌లు ఆడనున్నారు.

టి20 ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్, నమీబియా అర్హత

దుబాయ్: ఆస్ట్రేలియాలో వచ్చే ఏడాది జరిగే ఐసీసీ టి20 ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్, నమీబియా జట్లు అర్హత సాధించాయి. క్వాలిఫయింగ్ ప్లేఆఫ్ మ్యాచ్‌ల్లో నెదర్లాండ్స్ 8 వికెట్లతో యూఏఈపై; నమీబియా 54 పరుగులతో ఒమన్‌పై గెలిచాయి. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ముందుగా యూఏఈ 20 ఓవర్లలో 9 వికెట్లకు 80 పరుగులు చేసింది. అనంతరం నెదర్లాండ్స్ 15.1 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసి గెలిచింది. ఒమన్‌తో మ్యాచ్‌లో తొలుత నమీబియా 7 వికెట్లకు 161 పరుగులు చేసింది. 162 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ 107 పరుగులకు ఆలౌటైంది. క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా ఇప్పటికే పపువా న్యూగినియా, ఐర్లాండ్‌లు అర్హత పొందాయి.

మళ్లీ ఓడిన హైదరాబాద్

జంషెడ్‌పూర్: ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ 3-1 తో హైదరాబాద్‌పై నెగ్గింది. జంషెడ్‌పూర్ తరఫున ఫరూఖ్ (34వ ని.లో), అనికేత్ (62వ ని.లో) సెర్గియో (75వ ని.లో)... హైదరాబాద్ తరఫున మార్సెలో (45వ ని.లో) గోల్స్ చేశారు.

ఫైనల్లో రవీందర్

బుడాపెస్ట్ (హంగేరి): ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఒక పతకం ఖాయమైంది. 61 కేజీల విభాగంలో భారత రెజ్లర్ రవీందర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో రవీందర్ 4-3తో అర్సెన్ (అర్మేనియా)పై గెలిచాడు. నేటి ఫైనల్లో ఉలుక్‌బెక్ (కజకిస్తాన్)తో రవీందర్ పోటీపడతాడు.

జోష్నా పరాజయం

కైరో (ఈజిప్ట్): ప్రపంచ మహిళల స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత నంబర్‌వన్ క్రీడాకారిణి జోష్నా చినప్ప కథ ముగిసింది. ప్రపంచ రెండో ర్యాంకర్, టాప్ సీడ్ నూర్ ఎల్ షెర్బిని (ఈజిప్ట్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 12వ ర్యాంకర్ జోష్నా 5-11, 3-11, 6-11తో ఓటమి చవిచూసింది. గతంలో మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నూర్ షెర్బినికి ఈ మ్యాచ్‌లో జోష్నా నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురుకాలేదు. మూడు గేముల్లోనూ నూర్ ఆద్యంతం ఆధిపత్యం చలాయించి అలవోక విజయంతో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

రోహన్-సంజన జంట ఓటమి

న్యూఢిల్లీ: సార్లోర్‌లక్స్ ఓపెన్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రోహన్ కపూర్-సంజన సంతోష్ (భారత్) జంట తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. జర్మనీలో మంగళవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్-సంజన జోడీ 19-21, 21-13, 14-21తో ఆడమ్-మార్గోట్ (ఫ్రాన్స్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, మిథున్‌లకు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. గతవారం ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన భారత స్టార్ షట్లర్ సైనా ఈ టోర్నీ నుంచి చివరి నిమిషంలో వైదొలిగింది.

HEAVY WATER PLANT (MANUGURU)

TENDER NOTICE

For and on behalf of President of India, The Chief General Manager, HWP(M) invites online item rate / Lumpsum bids on two bid system for following work:

eNIT No.: **HWPM/GEN/15/2019/1,** Name of the work : Engagement of private Security Services for HWPM Residential Colony, Aswapuram & HWGF, Hyderabad, Estimated cost : **Rs. 238.00 Lakhs,** Earnest Money : Rs. **4,76,000/-**, Period of contract: **24 months,** Date of online availability of E-tender for view and download : From **30.09.2019 (10:00 hrs)** to **02.11.2019 (14:00 hrs)** Last date & time for online submission of bid: on **06.11.2019** (At **14:00** Hrs), Last date for submission of contractor credentials (hard copies i.e. Original DD/BC/PO etc., towards EMD & Tender Processing Fee, signed tender documents including enclosures): On or before **14:00** Hrs of **11.11.2019,** Date and time of technical bid Opening : On 11.11.2019 (after 14:30 hours). The bid forms and other details can be obtained from the website **www.tenderwizard.com/DAE.** The press notice is also available on **www.hwb.gov.in.**

Sd/-
Chief General Manager, HWPM

HWP(M)/GEN/1(15)/2019/488. Dt. 29/10/2019.

సాక్షి బిజినెస్
బుధవారం
30-10-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
582 ▲	160 ▲
39,832	11,787

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

నాస్‌డాక్	8,298	▼ 29
డోజోన్స్	27,106	▲ 15
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,306	▼ 25
డాక్స్	12,939	▼ 2
షాంఘై	2,954	▼ 26
నికాయ్	22,974	▲ 107

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫామ్‌కుకి	69.95	72.23
£	బ్రిటన్ పౌండ్	ఫామ్‌కుకి	89.45	93.08
€	యూరో	ఫామ్‌కుకి	77.47	80.43
¥	జపాన్ ఎన్ (100)	ఫామ్‌కుకి	62.00	74.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఫామ్‌కుకి	47.70	49.98
S$	సింగపూర్ డాలర్	ఫామ్‌కుకి	51.17	53.40
SAR	సౌదీ రియాల్	ఫామ్‌కుకి	18.10	19.71
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుకి	18.82	19.83
¥	చైనా యువాన్	ఫామ్‌కుకి	9.41	10.81

పన్ను కోత ఆశలతో..

- భారీ పన్ను సంస్కరణలకు కేంద్రం రెడీ..!
- అంచనాలను మించుతున్న క్యూ2 ఫలితాలు
- అమెరికా-చైనా ఒప్పందం దాదాపు ఖరారు
- మరో పావు శాతం తగ్గనున్న 'ఫెడ్'రేటు
- అన్నీ సానుకూలంశాలే... రోజంతా లాభాలే !!
- కీలక నిరోధ స్థాయిలకు సెన్సెక్స్, నిఫ్టీలు
- 582 పాయింట్ల లాభంతో 39,832కు సెన్సెక్స్
- 160 పాయింట్లు ఎగసి 11,787కు నిఫ్టీ

దీపావళి పండుగ వెళ్లిపోయినా, స్టాక్ మార్కెట్లో లాభాల కాంతులు తగ్గలేదు. మరిన్ని ఉద్దీపన చర్యలతో పాటు ఆదాయపు పన్నులో కూడా కోత విధించాలని కేంద్రం భావిస్తోందన్న వార్తలతో స్టాక్ మార్కెట్ మంగళవారం దుమ్ము రేపింది. కంపెనీల క్యూ2 ఫలితాలు అంచనాలను మించడం, అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారు కానుండటంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లతో కుమ్మేశారు. సోమవారం బలిపాడ్యమి సెలవు సందర్భంగా ఒక రోజు విరామం తర్వాత ఆరంభమైన ప్రధాన స్టాక్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ మంగళవారం కీలకమైన నిరోధ స్థాయిలపైన ముగియడం విశేషం. బీఎస్‌ఈ సెన్సెక్స్ 39,800 పాయింట్లు, ఎన్ఎస్‌ఈ నిఫ్టీ 11,750 పాయింట్ల ఎగువకు ఎగబాకాయి. సెన్సెక్స్, నిఫ్టీలు నాలుగు నెలల గరిష్టానికి ఎగిశాయి. సెన్సెక్స్ 582 పాయింట్లు లాభపడి 39,832 పాయింట్ల వద్ద, నిఫ్టీ 160 పాయింట్లు ఎగసి 11,787 పాయింట్ల వద్ద ముగిశాయి. టెలికం సూచీ మినహా మిగిలిన అన్ని రంగాల బీఎస్‌ఈ సూచీలు, ఎఫ్ఎమ్‌సీజీ మినహా మిగిలిన అన్ని నిఫ్టీ సూచీలు లాభాల్లోనే ముగిశాయి.

ఆల్‌టైమ్ హైకి రిలయన్స్..

డిజిటల్ విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేనున్నామని, వచ్చే ఏడాది కల్లా రిలయన్స్ జియోను రుణ భారం లేని కంపెనీగా తీర్చిదిద్దడమే లక్ష్యమంటూ రిలయన్స్ తెలిపింది. దీంతో మంగళవారం కంపెనీ షేర్ ఇంట్రాడేలో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.1,480 ను తాకింది. చివరకు 2.3% లాభంతో రూ.1,467 వద్ద ముగిసింది.

మరిన్ని విశేషాలు...

- గత క్యూ2 కంటే, ఈ క్యూ2లో నష్టాలు తగ్గడం, జాగ్వార్ ల్యాండ్ రోవర్ మళ్లీ లాభాల బాట పట్టటంతో టాటా మోటార్స్ జోరుగా పెరిగింది. 17 శాతం లాభంతో రూ.173 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే.
- మొత్తం 31 సెన్సెక్స్ షేర్లలో నాలుగు షేర్లు- భారతీ ఎయిర్‌టెల్, కోటక్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఎస్‌బీఐ మాత్రమే నష్టపోగా, మిగిలిన 27 షేర్లు లాభపడ్డాయి.
- 80కు పైగా షేర్లు ఏడాది గరిష్టాలకు ఎగిశాయి. వీటిల్లో 30కు పైగా షేర్లు ఆల్ టైమ్‌హైలను తాకాయి. రిలయన్స్, అబాట్ ఇండియా, జిల్లెట్ ఇండియా, ఫైజర్, ఎస్‌బీఐ లైఫ్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

లాభాలు ఎందుకంటే...

- **మరిన్ని ఉద్దీపన చర్యలు..:** దీర్ఘకాల మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ), సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్(ఎస్‌టీటీ), డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(డీడీటీ- ఈ ట్యాక్స్‌ను రద్దు చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి)లపై ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చే చర్యలను కేంద్రం తీసుకోనున్నదని వార్తలు వచ్చాయి. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది.
- **ఆదాయపు పన్ను కోత..:** వ్యక్తిగత ఆదాయపు పన్నులో కోత విధించే దిశగా కేంద్రం యోచిస్తోంది. ఆదాయపు పన్ను భారం తగ్గితే వినియోగిం పుంజుకుంటుందనే అంచనాలతో స్టాక్ మార్కెట్లో కొనుగోళ్ల జోరుగా సాగాయి.
- **అంచనాలను మించుతున్న ఆర్థిక ఫలితాలు...:** గత వారం వెల్లడైన ఎస్‌బీఐ, టాటా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి దిగ్గజ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు ఫలితాలను చూపుతోంది. కంపెనీల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతుండటంతో ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీల ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలు బలం పుంజుకుంటున్నాయి,
- **సానుకూల అంతర్జాతీయ సంకేతాలు..:** అమెరికా చైనా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు కానుండటం, బ్రెగ్జిట్‌కు జనవరి దాకా సమయం లభించడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి రేట్లను తగ్గించే అవకాశాలుండటం (దీనిపై నిర్ణయం నేటి రాత్రి వెలువడుతుంది)... వీటన్నింటి కారణంగా ప్రపంచ మార్కెట్లు ఊపిరి పీల్చుకున్నాయి.



రూ. 2.73 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

లాభాల జోరుతో ఇన్వెస్టర్ల సంపద రూ.2.73 లక్షల కోట్లు ఎగసింది. బిఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.2.73 లక్షల కోట్లు ఎగసి రూ.1,52,04,693 కోట్లకు చేరింది.

'పన్ను' ఊరట!

- ఎల్‌టీసీజీ, ఎస్‌టీటీ, డీడీటీల్లో మార్పులు
- పీఎంవో, ఆర్థిక శాఖ సమీక్ష • నవంబర్ నాటికి కసరత్తు పూర్తి
- బడ్జెట్‌లో లేదా అంతకు ముందే ప్రకటించే అవకాశాలు

న్యూఢిల్లీ: మందగమన బాటలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే దిశగా పలు చర్యలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా ఇన్వెస్టర్ల సెంటిమెంటును మెరుగుపర్చేందుకు, విదేశీ పెట్టుబడులు మరింతగా ఆకర్షించేందుకు.. మరిన్ని సంస్కరణలు ప్రవేశపెట్టనుంది. దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ) ట్యాక్స్, సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ), డివిడెండ్ పంపిణీ పన్ను (డీడీటీ)లను తగ్గించే విధంగా.. వాటి స్వరూపాన్ని మార్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నీతి అయోగ్, ఆర్థిక శాఖలో భాగమైన రెవెన్యూ విభాగంతో కలిసి ప్రధాని కార్యాలయం (పీఎంవో) వీటిని సమీక్షిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 'నవంబర్ ఆఖరు నాటికి దీనిపై కసరత్తు పూర్తి కావచ్చు. బడ్జెట్‌లో లేదా అంతకన్నా ముందే ఇందుకు సంబంధించిన ప్రకటనలు ఉండవచ్చు' అని వివరించాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఫిబ్రవరి 3న కేంద్రం ప్రవేశపెట్టవచ్చని అంచనా.

సావరీన్ వెల్త్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, బీమా తదితర రంగాల సంస్థలు.. దేశీ ఈక్విటీల్లో మరింత పెట్టుబడులు పెంచేందుకు ప్రోత్సహించే విధంగా ..ఇతర దేశాలకు దీటుగా దేశీయంగా పన్ను రేట్లను సవరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికారులు తెలిపారు. 'ఈక్విటీ, డెట్, కమోడిటీల మార్కెట్ల పన్ను రేట్లను సమీక్షిస్తున్నారు. ఈక్విటీ మార్కెట్లో పన్నుల విధానాన్ని క్రమబద్ధీకరించే అవకాశం ఉంది. దీర్ఘకాలికంగా పెన్షన్ ఫండ్స్ నుంచి దేశీ ఈక్విటీల్లోకి పెట్టుబడులు ఆకర్షించాలంటే పెద్ద ప్రతిబంధకంగా ఉంటోందన్న అభిప్రాయాల నేపథ్యంలో డీడీటీని గణనీయంగా తగ్గించడంపై ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయి. ప్రత్యక్ష పన్నులను సమీక్షించేందుకు ఏర్పాటైన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్.. దీన్ని ఏకంగా తొలగించాలని సిఫార్సు చేసింది' అని వివరించారు.

ఎల్‌టీసీజీ..డీడీటీ..ఏంటంటే..

షేర్ల విక్రయంతో ఇన్వెస్టరుకు లాభాలు వచ్చిన పక్షంలో క్యాపిటల్ గెయిన్స్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది పైబడి అట్టే పెట్టుకున్న షేర్లను విక్రయిస్తే ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 10 శాతం ఎల్‌టీసీజీ అమల్లోకి వచ్చింది. ఒకవేళ లాభాలు రూ. లక్ష దాటితేనే ఇది వర్తిస్తుంది. ఏడాది వ్యవధి లోపే షేర్లను విక్రయించిన పక్షంలో స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్స్ (ఎస్‌టీసీజీ) ట్యాక్స్ 15% మేర వర్తిస్తుంది. ఇక, కంపెనీలు తమ వాటాదారులకు పంచే డివిడెండుపై ప్రస్తుతం డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(సెస్సులు, సర్‌చార్జీలన్నీ కలిపి) 20.35% స్థాయిలో ఉంటోంది. ఎల్‌టీసీజీ, డీడీటీలపై దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు చాన్నాళ్లుగా అసంతృప్తిగా ఉన్నారు.

రూ. 1.5 లక్ష కోట్ల ఆదాయానికి గండి..

పన్ను రేట్లలో కోతలతో ప్రభుత్వ ఖజానాకు రూ. 1.5 లక్షల కోట్ల మేర ఆదాయానికి గండి పడే అవకాశం ఉందని అంచనా. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలను మరింతగా విక్రయించడం, పన్ను రాబడులను మెరుగుపర్చుకోవడం, వ్యయాలను నియంత్రించుకోవడం వంటి చర్యలతో దీన్ని భర్తీ చేసుకోవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. వృద్ధికి ఊతమిచ్చేలా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత కొద్ది నెలలుగా పలు సంస్కరణలు ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు, నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల విక్రయంపై మరింత దూకుడు, బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులను వినియోగించుకునేలా ప్రభుత్వ విభాగాలను ప్రోత్సహించడం, ప్రభుత్వ బ్యాంకులు.. చిన్న సంస్థలకు రుణాలిచ్చేలా చర్యలు వీటిలో ఉన్నాయి. ప్రస్తుతం ఆగ్నేయాసియా మొత్తం మీద భారత్‌లోనే కార్పొరేట్ ట్యాక్స్ తక్కువగా ఉంది. ఈ సంస్కరణలు.. దేశీ స్టాక్ మార్కెట్లకు, ఇన్వెస్టర్ల సెంటిమెంటుకు ఊతమిస్తున్నాయి.

ఆదాయపు పన్ను రేటూ తగ్గింపు: డీబీఎస్

కార్పొరేట్ ట్యాక్స్ రేటును 25 శాతానికి తగ్గించిన నేపథ్యంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను రేటును కూడా భారత్ తగ్గించే అవకాశాలు ఉన్నాయని సింగపూర్‌కి చెందిన డీబీఎస్ బ్యాంకు ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం రూ. 2.5 లక్షలుగా ఉన్న మినహాయింపు పరిమితిని రూ. 5 లక్షలకు పెంచవచ్చని వివరించింది. రూ. 5 లక్షలకు పైబడిన ఆదాయాలపైనా ట్యాక్స్ రేటును తగ్గించవచ్చని తెలిపింది. దీని వల్ల చిన్న స్థాయి పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గుతుందని, మధ్య స్థాయిలో ఉన్న వారికి ఓ మోస్తరు ఊరట లభించగలదని.. పై స్థాయి శ్లాబ్‌లో ఉన్న వారికి మాత్రమే పన్ను భారం పెరగవచ్చని డీబీఎస్ బ్యాంకు పేర్కొంది.

భారత్‌లో అమెజాన్ భారీ పెట్టుబడి

మార్కెట్ ప్లేస్, రిటైల్, అమెజాన్ పేలో కొత్తగా రూ. 4,400 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్.. భారత మార్కెట్లో తన వ్యాపార కార్యకలాపాలను మరింత బలోపేతం చేసే దిశగా నిర్ణయాలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా రూ. 4,400 కోట్లను ఇక్కడి మార్కెట్లో పెట్టుబడిగా పెట్టనుంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అందించిన తాజా సమాచారం మేరకు.. అమెజాన్ కార్పొరేట్ హోల్డింగ్స్, అమెజాన్ డాట్ కామ్ ఇంక్ సంస్థలు ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టనున్నాయి. రైట్స్ ఇష్యూ పద్ధతిలో ఈక్విటీ షేర్లను జారీ చేయడం ద్వారా ఈ ప్రక్రియ పూర్తికానున్నట్లు తెలుస్తోంది. ఏ విభాగంలో ఎంత పెట్టుబడి చేరుకోనుందనే విషయానికి వస్తే.. అమెజాన్ సెల్లర్ సర్వీసెస్ (మార్కెట్ ప్లేస్ యూనిట్) రూ. 3,400 కోట్లు, అమెజాన్ పే ఇండియా రూ. 900 కోట్లు, అమెజాన్ రిటైల్ ఇండియా (ఫుడ్ రిటైల్ వ్యాపారం) రూ. 172.5 కోట్లను అందుకోనున్నాయి. వివిధ విభాగాల్లో 2018-19 కాలంలో రూ. 7,000 కోట్ల పెట్టుబడి పెట్టిన అమెజాన్.. ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలతో పెరిగిన పోటీ కారణంగా భారత్‌లో తన పెట్టుబడిని మరింత పెంచనున్నట్లు ఈ రంగ వర్గాలు చెబుతున్నాయి. తాజా పెట్టుబడికి సంబంధించి ఇక్కడి వ్యాపార విభాగాల నుంచి అధికారిక ప్రకటన ఏమీ లేకపోయినప్పటికీ.. 2016లో సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ భారత్‌లో పెట్టుబడులను 5 బిలియన్ డాలర్లకు పెంచుతామని ప్రకటన చేసిన ఆధారంగానే ఈ నూతన పెట్టుబడులు చేరనున్నాయని విశ్లేషిస్తున్నాయి.

టాప్ 10 గ్లోబల్ సీఈఓల్లో మనోళ్లు..

- 6వ స్థానంలో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్
- 7, 9 ర్యాంకుల్లో అజయ్ బంగా, సత్య నాదెళ్ల
- హార్వర్డ్ బిజినెస్ రివ్యూ(హెచ్‌బీఆర్) తాజా జాబితాలో వెల్లడి

శంతను బంగా నాదెళ్ల

న్యూయార్క్: ప్రపంచంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన అగ్రశ్రేణి 10 కంపెనీల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఈఓ)ల జాబితాలో.. ఏకంగా ముగ్గురు భారత సంతతికి చెందిన వారు స్థానం సంపాదించారు. ప్రతిష్టాత్మక హార్వర్డ్ బిజినెస్ రివ్యూ(హెచ్‌బీఆర్) రూపొందించిన ఈ ఏడాది టాప్-100 ప్రపంచ సీఈఓల్లో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్ 6వ స్థానంలో నిలిచారు. ఆ తరువాత స్థానంలో మాస్టర్ కార్డ్ చీఫ్ అజయ్ బంగా ఉండడం విశేషం. కాగా.. తెలుగు తేజం, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల 9వ ర్యాంకులో నిలిచారు. తొలి పది స్థానాల్లో ముగ్గురు భారత సంతతి వారు ఉండగా.. పూర్తి జాబితాలో డీబీఎస్ బ్యాంక్ పియూష్ గుప్తా 89వ స్థానంలో నిలిచి మొత్తం భారత సంతతి సంఖ్యను నాలుగుకు పెంచారు.

62వ స్థానంలో టిమ్‌కుక్

గ్లోబల్ టాప్ 100 జాబితాలో నైక్ సీఈఓ మార్క్ పార్కర్ (20), జేపీ మోర్గాన్ చీఫ్ జామీ డిమోన్ (23), లాక్‌హీడ్ మార్టిన్ సీఈఓ మారిలిన్ హ్యూసన్ (37), డిస్నీ సీఈఓ రాబర్ట్ (55), ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ (66), సాఫ్ట్‌బ్యాంక్ సీఈఓ మసయోషి సన్ (96) ర్యాంకుల్లో ఉన్నారు. అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అగ్రస్థానంలో నిలిచారు.

300 విమానాలకు ఇండిగో ఆర్డరు

విలువ సుమారు రూ. 2.3 లక్షల కోట్లు

ముంబై: భారీ వృద్ధి ప్రణాళికల అమల్లో భాగంగా విమానయాన రంగ సంస్థ ఇండిగో తాజాగా 'ఎయిర్‌బస్ 320 నియో' రకానికి చెందిన 300 విమానాలకు ఆర్డరు ఇచ్చింది. ఒక్కో విమానం రేటు వివరాలు వెల్లడించనప్పటికీ.. 2018లో ప్రచురించిన ధర ప్రకారం ఈ ఆర్డరు విలువ సుమారు 33 బిలియన్ డాలర్లుగా (దాదాపు రూ. 2.3 లక్షల కోట్లు) ఉండొచ్చని అంచనా. ఇంత పెద్ద సంఖ్యలో విమానాల కోసం ఎయిర్‌బస్‌కు ఆర్డరిచ్చిన ఏకైక సంస్థ తమదేనని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. తాజా కాంట్రాక్టుతో ఇండిగో మొత్తం 730 విమానాలకు(ఏ320 నియో) ఆర్డరిచ్చినట్లవుతుంది. ప్రస్తుతం 247 విమానాలతో ప్రతిరోజూ 1,500 ఫ్లయిట్స్ నడుపుతోంది.

ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపుపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ: ఎఫ్‌డీఐ నిబంధనలను మరింతగా సరళతరం చేసే అంశంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అంతర్-మంత్రిత్వ శాఖల బృందం మంగళవారం సమావేశమైంది. పరిశ్రమ, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి గురుప్రసాద్ మహాపాత్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రక్షణ, హోం అఫైర్స్, సమాచార..ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, ఆర్థిక శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆటోమేటిక్ విధానంలో 100% ఎఫ్‌డీఐలకు అనుమతులు లేని రంగాలకు సంబంధించి నిబంధనలను సరళతరం చేసే అవకాశాలను డీపీఐఐటీ పరిశీలిస్తోంది.

మా దగ్గర ఇన్వెస్ట్ చేయండి..

- ఇంధన, మౌలిక రంగాల్లో అపార అవకాశాలు
- సౌదీ కంపెనీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- ప్రపంచ ఎకానమీకి భారత్ కీలకమని వెల్లడి


సదస్సులో ప్రధాని మోదీ

రియాద్: వచ్చే ఐదేళ్లలో 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా ఎదగాలని నిర్దేశించుకున్న భారత్‌లో పెట్టుబడులకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. దేశ ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టాలంటూ సౌదీ అరేబియా కంపెనీలను ఆహ్వానించారు. ఈ రంగంలో 100 బిలియన్ డాలర్లకు పైగా ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్ పెట్టుబడుల సదస్సు(ఎఫ్ఐఐ) 2019లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. మౌలిక రంగంపై రూ. 1.5 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మోదీ చెప్పారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఫ్రా రంగంలో కూడా ఇన్వెస్ట్ చేసేందుకు అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాపారాల నిర్వహణకు అనువైన పరిస్థితులను కల్పించే క్రమంలో పన్ను రేట్లను, మేధోహక్కుల విధానాలను సంస్కరించినట్లు చెప్పారు. నైపుణ్యాలను మెరుగుపర్చడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని.. వచ్చే 3-4 ఏళ్లలో 40 కోట్ల మందిని వివిధ రంగాల్లో సుశిక్షితులుగా తీర్చిదిద్దనున్నామని ఆయన పేర్కొన్నారు.

విధానాల్లో అసమానతలతోనే అనిశ్చితి..

భారత్, సౌదీ అరేబియా వంటి భారీ వర్ధమాన దేశాల దిశపైనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఆధారపడి ఉందని మోదీ వ్యాఖ్యానించారు. బహుళ పక్ష వాణిజ్య విధానాల్లో అసమానతల వల్లే ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

'భారత్ వంటి పెద్ద వర్ధమాన దేశాల బాట పైనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఎక్కువగా ఆధారపడి ఉంది. గత నెల ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో కూడా చెప్పినట్లు.. సమష్టిగా వృద్ధి సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని విశ్వసిస్తున్నాం. జీ20 కూటమిలో.. అసమానతలు తగ్గించేందుకు, నిలకడగా అభివృద్ధిని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై భారత్, సౌదీ అరేబియా కలిసి పనిచేస్తున్నాయి' అని మోదీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక మందగమన ప్రభావాలను ఎదుర్కొనేందుకు ఆసియా దేశాలు ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్న ప్రశ్నకు స్పందిస్తూ.. భారత్, సౌదీ అరేబియా ఇప్పటికే పలు సంస్కరణలు ప్రవేశపెట్టాయని చెప్పారు. 'వ్యాపారాలకు అనువైన పరిస్థితులు నెలకొల్పేందుకు, ప్రపంచ వృద్ధికి .. స్థిరత్వానికి చోదకంగా నిల్చేందుకు భారత్ అనేక సంస్కరణలు ప్రవేశపెట్టింది. సౌదీ అరేబియా కూడా తమ విజన్ 2030 సాధనలో భాగంగా సంస్కరణల ఎజెండాను అమలు చేస్తుండటం సంతోషించదగ్గ విషయం' అని ప్రధాని చెప్పారు.

15 బిలియన్ డాలర్ల డీల్స్

మూడు రోజుల ఎఫ్ఐఐ సదస్సులో భాగంగా తొలిరోజున సుమారు 15 బిలియన్ డాలర్ల విలువ చేసే 23 పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్లు సౌదీ అరేబియన్ జనరల్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఎస్ఏజీఏఐ) వెల్లడించింది. తమ దేశంలో పెట్టుబడులకు గల భారీ అవకాశాలకు ఇది నిదర్శనమని పేర్కొంది. విజన్ 2030లో భాగంగా సౌదీ అరేబియా భారీ స్థాయిలో ఆర్థిక సంస్కరణలు అమలు చేస్తోందని ఎస్ఏజీఐఏ గవర్నర్ ఇబ్రహీం అల్-ఒమర్ తెలిపారు.

మందగమనం తాత్కాలికం: ముకేశ్ అంబానీ

భారత్‌లో మందగమనం తాత్కాలికమని, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సంస్కరణలతో రాబోయే రోజుల్లో పరిస్థితులు మెరుగుపడగలవని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ తెలిపారు. 'భారత ఎకానమీ స్వల్పంగా మందగించింది. కానీ, ఇది తాత్కాలికమే. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్రమంగా ఫలితాలనిస్తాయి. వచ్చే క్వార్టర్ నుంచి మందగమన ధోరణి కచ్చితంగా మారుతుంది' అని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీ, యువ జనాభా, నాయకత్వం వంటి అంశాల్లో రెండు దేశాలకు చాలా సారూప్యతలు ఉన్నాయని .. వృద్ధి సాధనకు ఇవి దోహదపడగలవని పెట్టుబడుల సదస్సులో పాల్గొన్న సందర్భంగా అంబానీ తెలిపారు.

సౌదీ ఆరామ్‌కో ఐపీఓ డిసెంబర్‌లో!

సౌదీ స్టాక్ మార్కెట్లో లిస్టింగ్

దుబాయ్: ఇంధన దిగ్గజం సౌదీ ఆరామ్‌కో కంపెనీ ఈ ఏడాది డిసెంబర్ 11న రియాద్ స్టాక్ మార్కెట్లో అరంగేట్రం చేయనున్నది. సౌదీ తాదవుల్ ఎక్స్ఛేంజ్‌లో సౌదీ ఆరామ్‌కో కంపెనీ షేర్లు ఆ రోజున లిస్టవుతాయని సౌదీ అరేబియాకు చెందిన అల్ అరేబియా టీవీ చానెల్ వెల్లడించింది. సౌదీ ఆరామ్‌కో ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు సంబంధించిన టైమ్ టేబుల్‌ను వచ్చే నెల 3న సౌదీ ఎక్స్ఛేంజ్ ప్రకటిస్తుందని ఈ చానెల్ పేర్కొంది. వచ్చే నెల 17న ఈ కంపెనీ ఐపీఓకు సంబంధించిన ప్రైస్ బ్యాండ్ వెల్లడవుతుందని తెలిపింది. డిసెంబర్ 4 నుంచి సౌదీ ఆరామ్‌కో ఐపీఓ ఆరంభమవుతుందని పేర్కొంది.

10,000 కోట్ల డాలర్లు సమీకరణ !

సౌదీ ఆరామ్‌కో కంపెనీ విలువ కనీసం 2 లక్షల కోట్ల డాలర్లుగా(రూ.140 లక్షల కోట్లు. మన దగ్గర అత్యంత మార్కెట్ క్యాప్ గల కంపెనీ రిలయన్స్ మార్కెట్ క్యాప్ రూ.9 లక్షల కోట్లు మాత్రమే) ఉండాలని సౌదీ అరేబియా ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ విలువ చాలా అధికమని అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లు అంటున్నారు. కాగా ఈ ఐపీఓలో భాగంగా సౌదీ ఆరామ్‌కో కంపెనీలో 5 శాతం వరకూ వాటాను విక్రయించాలని సౌదీ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ వాటా విక్రయం ద్వారా 10,000 కోట్ల డాలర్లు (సుమారుగా రూ.7 లక్షల కోట్లు) సమీకరించవచ్చని భావిస్తోంది. అయితే ఈ వాటా విక్రయం ద్వారా వచ్చే నిధులు ఈ స్థాయిలో ఉండకపోవచ్చని సమాచారం.

ఢిల్లీ విమానాశ్రయం నుంచి యూపీఎస్ సర్వీసులు

లాజిస్టిక్స్‌లో అంతర్జాతీయంగా అగ్రగామి సంస్థ అయిన యూపీఎస్ తన సరుకుల రవాణా విమానాలను ఢిల్లీ విమానాశ్రయం నుంచి నడపనున్నట్టు జీఎంఆర్ ఆధ్వర్యంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) ప్రకటించింది. దీనివల్ల ఉత్తర భారతం నుంచి పశ్చిమ దేశాలకు సత్వర అనుసంధానత సాధ్యపడుతుందని తెలిపింది. ఢిల్లీ నుంచి ఆరు వీక్లీ ఫ్లయిట్లను యూపీఎస్ ఆరంభించింది. గతంలో ముంబై నుంచి యూపీఎస్ తన సరుకు విమానాలను నడిపేది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	39,690	0
బంగారం (22 క్యారెట్లు)	37,800	0
వెండి (కిలో)	49,700	▼ 600
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	38,470	▼ 220
బంగారం (22 క్యారెట్లు)	36,640	▼ 210
వెండి (కిలో)	49,700	▼ 600
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	38,470	▼ 220
బంగారం (22 క్యారెట్లు)	36,640	▼ 210
వెండి (కిలో)	49,700	▼ 600

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	55.75 (రాత్రి 11.30కు)	$55.81 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	61.45 (రాత్రి 11.30కు)	$61.57 (శుక్రవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 30-10-2019

విశాఖ	400-00
చిత్తూరు	423-00
వరంగల్	396-00
29-10-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	393-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.50
విజయవాడ	400-00
నమక్కల్	415-00
గోదావరి	400-00

టెలికం రంగానికి బెయిలవుట్?

సాధ్యాసాధ్యాలపై సెక్రటరీల కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ: టెల్కోల నుంచి భారీగా రూ. 92,000 కోట్లు రాబట్టుకోవడానికి సుప్రీంకోర్టు డాట్ (టెలకమ్యూనిషన్ల శాఖ)కు అనుమతించిన నేపథ్యంలో- ఆయా కంపెనీల ఆర్థిక స్థితిగతులపై సమీక్షించి, తగిన సలహాలు ఇవ్వడానికి కేంద్రం మంగళవారం ఒక సెక్రటరీల కమిటీ (సీఓఎస్)ని ఏర్పాటు చేసింది. సుప్రీం రూలింగ్ నేపథ్యంలో- టెలికం రంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి జారే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో కేంద్రం ఈ కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం. టెలికంకు భారీ బెయిలవుట్ ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్రం మొగ్గు చూపుతోందని, ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై సెక్రటరీల కమిటీ దృష్టి సారిస్తుందని వార్తలు వస్తున్నాయి. కమిటీకి క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వం వహిస్తారు. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియాల వంటి సర్వీస్ ప్రొవైడర్లు ఎదుర్కొంటున్న ''ఆర్థిక ఒత్తిడి''ని ''అన్ని కోణాల్లో'' పరిశీలించి, తీవ్రతను తగ్గించడానికి సూచనలు ఇవ్వడానికి కమిటీ ఏర్పాటయినట్లు టెలికం వర్గాలు తెలిపాయి. ఆర్థిక, న్యాయ, టెలికం కార్యదర్శులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. కమిటీ త్వరలో సమావేశమై, ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో తన సిఫారసులను కేంద్రానికి సమర్పిస్తుందని సమాచారం.

నేపథ్యం ఇదీ...

కొత్త టెలికం విధానం ప్రకారం.. టెల్కోలు తమ సవరించిన స్థూల రాబడి (ఏజీఆర్)లో నిర్దిష్ట వాటాను ప్రభుత్వానికి వార్షిక లైసెన్సు ఫీజుగా కట్టాల్సి ఉంటుంది. దీనితో పాటు స్పెక్ట్రం వినియోగానికి గాను నిర్దిష్ట చార్జీలు (ఎస్‌యూసీ) చెల్లించాలి. అయితే ఈ ఏజీఆర్ లెక్కింపు విషయంలో వివాదం నెలకొంది. అద్దెలు, స్థిరాస్తుల విక్రయంపై లాభాలు, డివిడెండు మొదలైన టెలికంయేతర ఆదాయాలు కూడా ఏజీఆర్ కిందే వస్తాయని, దానిపైనే లైసెన్సు ఫీజు కట్టాల్సి ఉంటుందని టెలికం వివాదాల పరిష్కార, అపీలేట్ ట్రిబ్యునల్ (టీడీశాట్) గతంలో ఆదేశాలు ఇచ్చింది. దీనివల్ల ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్సు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల భారం భారీగా పెరిగిపోనుండటంతో టీడీశాట్ ఆదేశాలను సవాల్ చేస్తూ టెల్కోలు.. సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. దీనిపై జూలైలో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం తమ వాదనలు వినిపించింది. అప్పటిదాకా టెల్కోలు రూ. 92,000 కోట్ల మేర లైసెన్సు ఫీజులు బకాయి పడ్డాయని తెలిపింది. తాజాగా ప్రభుత్వ వాదనలతో ఏకీభవిస్తూ సుప్రీం ఆదేశాలిచ్చింది.

ప్యాకేజ్‌లో ఏముంటాయ్?

- స్పెక్ట్రమ్ చార్జీల తగ్గింపు
- ఉచిత మొబైల్ ఫోన్ కాల్స్‌కు ముగింపు
- చౌక డేటా టారిఫ్‌లకు సెలవు చెప్పడం
- నగదు లభ్యతలో ఇబ్బందులు తలెత్తకుండా 2020-21, 2021-22కు సంబంధించి స్పెక్ట్రమ్ వేలం చెల్లింపుల వాయిదా వేయడం.
- యూఎస్ఓఎఫ్ (యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్) చార్జ్‌ని 3 శాతానికి తగ్గించడం.

టెలికం రంగానికి ఊరటనివ్వాలి..

కీలకమైన ఏజీఆర్ అంశంపై కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నాం. పరిమితమైన సమయమే ఉన్నందున దీని పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి. 60 రోజుల్లోగా తగు పరిష్కార మార్గాన్ని కనుగొనాలని, టెలికం రంగానికి ఊరట చర్యలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. దీనిపై కేంద్రానికి త్వరలో లేఖ రాయబోతున్నాం. సవివరంగా చర్చించేందుకు మంత్రితో సమావేశమయ్యే అవకాశం కల్పించాలని కోరబోతున్నాం

– రాజన్ మాథ్యూస్, డైరెక్టర్ జనరల్, సీవోఏఐ

టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను వాయిదా వేసింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం వెల్లడించాల్సిన ఈ ఫలితాలను వచ్చే నెల 14 వరకూ వాయిదా వేసింది. వార్షిక సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్-యాన్యువల్ అడ్జెస్టెడ్ గ్రాస్ రెవెన్యూ) విషయమై సుప్రీం ఇటీవల తీర్పును ఇవ్వడం, ఈ తీర్పు కారణంగా టెలికం కంపెనీలు భారీగా కేంద్రానికి బకాయిలు చెల్లించాల్సి ఉండటం...తెలిసిందే. ఏజీఆర్ విషయమై టెలికం డిపార్ట్‌మెంట్ నుంచి మరింత స్పష్టతను కోరుతున్నామని, అంతే కాకుండా రూ.42,000 కోట్ల మేర ప్రభుత్వ తోడ్పాటును కోరుతున్నామని, అందుకే క్యూ2 ఫలితాలను వాయిదా వేస్తున్నామని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు నివేదించింది.

ఏజీఆర్‌పై స్పష్టత కోసం... ఎయిర్‌టెల్ ఫలితాలు వాయిదా

రెట్టింపైన పెట్రోనెట్ లాభం

షేర్‌కు రూ.5.50 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ నికర లాభం సెప్టెంబర్ త్రైమాసికంలో దాదాపు రెట్టింపయ్యింది. గత ఆర్థిక సంవత్సరం(2018-19) క్యూ2లో రూ.573 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో రూ.1,089 కోట్లకు పెరిగిందని పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ తెలిపింది. పన్ను రేటు తక్కువగా ఉండటం, మార్జిన్లు మెరుగుపడటంతో నికర లాభం ఈ స్థాయిలో పెరిగిందని కంపెనీ సీఈఓ, ఎమ్‌డీ, ప్రభాత్ సింగ్ తెలిపారు. గతంలో 30 శాతంగా ఉన్న కార్పొరేట్ ట్యాక్స్ ఇప్పుడు 22 శాతానికి తగ్గిందని, ఫలితంగా రూ.380 కోట్ల పన్ను వ్యయాలు ఆదా అయ్యాయని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో ఈక్విటీ షేర్‌కు రూ.5.50 ప్రత్యేక మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని వివరించారు.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ షేర్ 2.4 శాతం లాభంతో రూ.279 వద్ద ముగిసింది.

హిందుస్తాన్ జింక్ లాభం రూ.2,081 కోట్లు

15 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: వేదాంత గ్రూప్‌నకు చెందిన హిందుస్తాన్ జింక్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం(2019-20) సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.2,081 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో ఆర్జించిన నికర లాభం, రూ.1,815 కోట్లుతో పోల్చితే 15 శాతం వృద్ధి సాధించామని హిందుస్తాన్ జింక్ తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.5,175 కోట్ల నుంచి రూ.5,101 కోట్లకు తగ్గిందని కంపెనీ చైర్మన్ కిరణ్ అగర్వాల్ చెప్పారు. నిర్వహణ లాభం నీక్వెన్షియల్‌గా చూస్తే, 15 శాతం తగ్గి రూ.2,480 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 1.35 మిలియన్ టన్నులకు పెంచనున్నామని తెలిపారు.

రెండో అర్థభాగంలో మంచి పనితీరు !

ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో మంచి పనితీరు సాధిస్తామని కంపెనీ సీఈఓ దుగ్గల్ చెప్పారు.ఆటోమేషన్, డిజిటైజేషన్‌లపై పెట్టిన పెట్టుబడులు ఫలితాలనిస్తున్నాయని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సౌరభ్ వివరించారు.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో హిందుస్తాన్ జింక్ సేర్ 1.6 శాతం లాభంతో రూ.221 వద్ద ముగిసింది.

ఎఫ్ఏపీసీసీఐ ప్రెసిడెంట్‌గా అచ్యుత్‌రావు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఏపీసీసీఐ) ప్రెసిడెంట్‌గా సీవీఎస్‌వీ అగ్రిటెట్ అండ్ ఎగ్జిమ్ ఎండీ సీవీ అచ్యుత్‌రావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. వచ్చే రెండేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారని ఒక ప్రకటనలో తెలిపారు. 2005-06 సంవత్సరాలకు ఈయన ఎఫ్‌టీఏపీసీసీఐ ప్రెసిడెంట్‌గా పనిచేశారు.

ఆదాయ వృద్ధి కోసమే పునర్‌వ్యవస్థీకరణ

ఫార్మా వ్యాపారంపై అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ: వ్యాపార పునర్‌వ్యవస్థీకరణలో భాగంగానే ఫ్రంట్ ఎండ్ ఫార్మసీ విభాగాన్ని విడదీయాలని నిర్ణయించుకున్నట్లు అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ వివరించింది. ఫార్మసీల సంఖ్యను 5,000కు పెంచుకునేందుకు, రూ. 10,000 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని సాధించేందుకు ఇది తోడ్పడనుందని పేర్కొంది. ఫ్రంట్ ఎండ్ ఫార్మసీ వ్యాపార విభాగాన్ని అపోలో ఫార్మసీకి రూ. 528 కోట్లకు బదలాయించడం వల్ల మైనారిటీ షేర్‌హోల్డర్లకు నష్టం జరుగుతుందంటూ వార్తలు రావడంతో అపోలో హాస్పిటల్స్ తాజా వివరణనిచ్చింది. ఈ నిర్ణయంతో తమ వాటాదారులకు మరింత ప్రయోజనం చేకూరగలదని తాజాగా తెలిపింది.

ప్రతికూల వార్తలతో మంగళవారం అపోలో హాస్పిటల్స్ షేరు ఆరు శాతం క్షీణించి రూ. 1,431 వద్ద క్లోజయ్యింది.

ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెంట్లపై సీసీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ: ట్రావెల్ బుకింగ్ సేవలను అందిస్తోన్న 'మేక్ మై ట్రిప్, గోఐబిబో' సంస్థలతో పాటు ఆతిథ్య సేవల సంస్థ 'ఓయో'పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు మేరకు.. ఈ మూడు సంస్థలు చట్ట ఉల్లంఘనకు పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సంబంధిత మార్కెట్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తోన్న మేక్ మై ట్రిప్, గోఐబిబో తమ ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించింది.

ఓలాకు రూ.1,000 కోట్ల మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు?

న్యూఢిల్లీ: ట్యాక్సీ అగ్రిగేటర్ ఓలా కంపెనీలో టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెట్టనున్నదని సమాచారం. ఓలాలో మైక్రోసాఫ్ట్ కంపెనీ 15-20 కోట్ల డాలర్లు(రూ.1,050-1.400 కోట్లు)మేర పెట్టుబడులు పెట్టనున్నదని, దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ విషయమై ఓలా ఎలాంటి స్పందను వ్యక్తం చేయలేదు. మైక్రోసాఫ్ట్ మాత్రం వ్యాఖ్యానించడానికి నిరాకరించింది. కాగా ఇరు కంపెనీలు 2017లో అంతర్జాతీయంగా కార్ల కంపెనీల కోసం కనెక్టెడ్ వెహికల్ ప్లాట్‌ఫార్మ్ ఏర్పాటు కోసం ఈ ఇరు కంపెనీలు 2017లో చేతులు కలిపాయి. అప్పటి నుంచి వివిధ సాంకేతిక అంశాల్లో ఈ ఇరు కంపెనీలు కలిసి పనిచేస్తున్నాయి.

కార్పొబ్రీఫ్స్ ...

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: కేంద్ర ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన 158 కోట్ల ఈక్విటీ షేర్లు జారీ చేసి రూ.3,353 కోట్లు సమీకరించనున్నది. ఈ మేరకు డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపింది.

బంధన్ బ్యాంక్: నిర్దేశిత కాలపరిమితిలోగా ప్రమోటర్ వాటాను తగ్గించుకోనందుకు బంధన్ బ్యాంక్‌కు రూ. కోటి జరిమానాను రిజర్వ్ బ్యాంక్ వడ్డించింది.

నేటి బోర్డ్ మీటింగ్స్

టాటా కెమికల్స్, కంటైనర్ కార్పొరేషన్, టాటా గ్లోబల్ బేవరేజెస్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రాఫైట్ ఇండియా, హెరిటేజ్ ఫుడ్స్, ఇండోకో రెమిడీస్, జేకే టైర్, పీటీసీ ఇండియా, సొనాటా సాఫ్ట్‌వేర్

రాష్ట్రీయం

విధుల్లోకి 2,788 మంది టీచర్లు

తెలుగు మీడియం ఎస్జీటీల భర్తీ ప్రక్రియ పూర్తి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామకాల్లో (టీఆర్‌టీ-2017) భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) నియామక ప్రక్రియ మంగళవారం రాత్రి వరకు పూర్తయింది. ఏజెన్సీ మినహా మైదాన ప్రాంతాల్లో పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు పాఠశాల విద్యా శాఖ నియామకపత్రాలు అందజేసింది. మొత్తంగా మైదాన ప్రాంతంలో 3,127 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా, అందులో 2,822 పోస్టులకు టీఎస్‌పీఎస్‌సీ అభ్యర్థులను ఎంపిక చేసింది. ఇటీవల ఎంపికైన అభ్యర్థుల జాబితాలను జిల్లాల వారీగా విద్యా శాఖకు టీఎస్‌పీఎస్‌సీ అందజేసింది. దీంతో విద్యాశాఖ నియామకాల కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈ కౌన్సెలింగ్‌కు 2,788 అభ్యర్థులు హాజరుకాగా, వారందరికీ మంగళవారం పోస్టింగ్ ఆర్డర్లను జిల్లా అధికారులు అందజేశారు. పోస్టింగ్ ఆర్డర్లను పొందినవారు బుధవారం సంబంధిత పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లకు రిపోర్ట్ చేసి విధుల్లో చేరనున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరుకాని 34 మందికి పోస్టింగ్ ఆర్డర్లను రిజిస్టర్ పోస్ట్ ద్వారా డీఈవోలు పంపించనున్నారు.

జనవరి 4 నుంచి ఎన్ఐవోఎస్ డీఎడ్ సప్లిమెంటరీ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐవోఎస్)లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) అభ్యర్థులకు చివరి సప్లిమెంటరీ పరీక్షలను 2020 జనవరి 4 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు ఎన్ఐవోఎస్ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్ ద్వారా తమ వెబ్‌సైట్ (http://dled.nios.ac.in, www.nios.ac.in) లో ఫీజు చెల్లించాలని సూచించారు. ప్రతీ సబ్జెక్టుకు రూ. 250 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఫీజు చెల్లించడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే, ఎన్ఐవోఎస్ హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం హెల్ప్‌లైన్ నంబర్లు 040-24752859, 040-24750712కు ఫోన్ చేయాలని వివరించారు.

ఆర్టీసీ కార్మికుల సమ్మెను పరిష్కరించండి

సీఎం కేసీఆర్‌ను కోరిన బీసీ సంక్షేమ సంఘం

సాక్షి, హైదరాబాద్: గత 26 రోజులుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని, ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె సమస్యను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎం కేసీఆర్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బహిరంగ ప్రకటన విడుదల చేశారు. సీఎం ప్రతిష్టకు పోకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని సూచించారు. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రజా జీవనం స్తంభించిపోయిందన్నారు. దూరప్రాంత విద్యార్థులు స్కూళ్లకు వెళ్లట్లేదని, ఉద్యోగులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండటంతో వారిపై ఆర్థిక భారం పడుతోందన్నారు. డ్రైవింగ్ అనుభవంలేని తాత్కాలిక డ్రైవర్లతో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఆర్టీసీని విలీనం చేయడం వల్ల ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదని, ప్రైవేటీకరణ చేస్తే భారీగా చార్జీలు పెరిగి ప్రజలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీఈఏ స్టేట్ కోఆర్డినేటర్‌గా రామకృష్ణగౌడ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) స్టేట్ కోఆర్డినేటర్‌గా మాచర్ల రామకృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నియామక పత్రాన్ని రామకృష్ణగౌడ్‌కు టీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార స్వామి అందజేశారు. ప్రస్తుతం జడ్చర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న ఆయన గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా, పొలిటికల్ జేఏసీ కన్వీనర్‌గా, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన నియామకంతో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ మరింత వేగంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు కీలక బాధ్యతను అప్పగించిన అసోసియేషన్ కార్యవర్గానికి రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

లెక్కలు ఇవ్వట్లేదా.. భోజనం పెట్టట్లేదా?

- ప్రతిరోజూ దాదాపు వెయ్యి స్కూళ్లలో భోజనం వివరాలు గల్లంతు
- అందులో నిధులు/ముడిసరుకులు లేక రోజూ పదుల స్కూళ్లలో మధ్యాహ్న భోజనం బంద్
- ఇవన్నీ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఇస్తున్న లెక్కలే
- భోజనం పెట్టనట్లు చూపిస్తున్న నేపథ్యంలో తగ్గిపోనున్న కేంద్ర నిధులు
- అదే జరిగితే నిధుల కోతే.. రాష్ట్రంపై పడనున్న అదనపు భారం

సాక్షి, హైదరాబాద్:

సెప్టెంబర్ 20వ తేదీన రాష్ట్రంలోని 1,031 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టలేదు. అందులో 20 స్కూళ్లలో నిధులు/ముడిసరుకులు లేక, అలాగే ఒక పాఠశాలలో ఆహార ధాన్యాలు లేకపోవడంతో భోజనం పెట్టలేదు. మరి మిగతా 1,020 స్కూళ్లలో భోజనం ఎందుకు పెట్టలేదన్నది ఎవరికీ తెలియదు.

ఈనెల 21వ తేదీన రాష్ట్రంలోని 953 పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించలేదు. అందులో 27 పాఠశాలల్లో నిధులు/ముడిసరుకులు లేక మధ్యాహ్న భోజనం పెట్టకపోగా ఆహార ధాన్యాలు లేక 3 స్కూళ్లలో భోజనం పెట్టలేదు. మరి మిగతా 920 స్కూళ్లలో భోజనం ఎందుకు పెట్టలేదన్నది సమాచారం లేదు.

ఇలా ఏదో ఒక్క రోజు కాదు.. ప్రతి రోజూ ఇలాగే జరుగుతోంది. రాష్ట్రంలో 28,689 ప్రభుత్వ పాఠశాలలు ఉంటే అందులో 8, 9 తరగతులను మినహాయించి దాదాపు 24 వేలకు పైగా ఎలిమెంటరీ స్కూళ్లు ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు చూపుతోంది. అయితే అందులో 900 నుంచి 1,050 వరకు స్కూళ్లలో నిత్యం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించలేదనే కేంద్రానికి లెక్కలు వెళ్తున్నాయి. ఇలా ఒక్కో స్కూళ్లో సరాసరి 150 మంది చొప్పున విద్యార్థుల లెక్క వేసినా నిత్యం లక్ష మందికిపైగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. ఈ లెక్కలు ఏ సర్వే సంస్థనో తేల్చినవి కావు.. సాక్షాత్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖనే కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థకు (ఎంహెచ్ఆర్‌డీ) ఈ వివరాలను అందజేస్తోంది. దాదాపు 1,000 స్కూళ్లలోని లక్ష మందికిపైగా విద్యార్థులకు నిత్యం మధ్యాహ్న భోజనం నిజంగానే పెట్టడంలేదా? కేంద్రానికి లెక్కలు సరిగ్గా ఇవ్వడం లేదా? అన్నది తేలడం లేదు. ఇలా మన రాష్ట్రమే కాదు. ఉత్తరప్రదేశ్, బిహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మనకంటే ఎక్కువ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వివరాలు గల్లంతవుతున్నాయి. నిజంగానే మధ్యాహ్న భోజనాన్ని అంత మంది విద్యార్థులకు అందించడం లేదా? మరేదైనా కారణాలు ఉన్నాయా? దీనిపై తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రతిరోజూ అడుగుతున్నా సమాధానం లేకుండాపోతోంది.

నిధులకు కోత పడే ప్రమాదం

భోజనం అందివ్వలేని పరిస్థితి ఇలాగే కొనసాగితే కేంద్రం నుంచి వచ్చే నిధులకు కోత పడే ప్రమాదం నెలకొంది. నిజంగానే లక్ష మంది విద్యార్థులకు భోజనం అందకపోతే అది సీరియస్ సమస్యే అవుతుంది. కానీ భోజనం పెట్టినా, లెక్కలు ఇవ్వకపోతే ఆయా స్కూళ్లలోని విద్యార్థుల సంఖ్య మేరకు మధ్యాహ్న భోజన నిధులకు కేంద్రం కోత పెట్టే అవకాశం ఉంది. మధ్యాహ్న భోజనం ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు (పీఏబీ) సమావేశంలో రాష్ట్ర అధికారులు అందజేసే ప్రతిపాదనలకు, ప్రతి రోజూ రాష్ట్రం నుంచి భోజనం చేసిన విద్యార్థుల సంఖ్యపై కేంద్రానికి అందిన లెక్కలకు సరిపోలకపోతే సమస్యలు తప్పవు. పీఏబీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తమకు ఏఎంఎస్‌లో వచ్చిన విద్యార్థుల సంఖ్యనే పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రంలో లక్ష మందికి పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అయ్యే ఖర్చుకు కేంద్రం కోత పెట్టే అవకాశం ఉంటుంది. అదే జరిగితే ఆ భారం రాష్ట్ర ప్రభుత్వంపైనే పడుతుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

లెక్కలు సరిగ్గా ఇవ్వడం లేదంటున్న అధికారులు

ఎంహెచ్ఆర్‌డీ దేశవ్యాప్తంగా ప్రతిరోజూ ఎంత మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోందన్న లెక్కల సేకరణ కోసం రెండేళ్ల కిందటే ఆటోమేటెడ్ మానిటరింగ్ సిస్టంను (ఏఎంఎస్) ప్రవేశ పెట్టింది. ప్రతిరోజూ రాష్ట్రంలోని పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం వివరాలను ప్రధానోపాధ్యాయులు /బాధ్యులైన టీచర్ ఏఎంఎస్‌కు (15544) పంపించాలి. తమ పాఠశాలలో ఎంత మంది పిల్లలు భోజనం చేశారన్న వివరాలను ఎస్ ఎంఎస్ రూపంలో ప్రధానోపాధ్యాయుడు లేదా సంబంధిత బాధ్యుడు ఆ వివరాలను పంపించాలి. అయితే రాష్ట్రంలో దాదాపు 1000 పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను పంపించడం లేదని విద్యాశాఖ అధికారులే చెబుతున్నారు. మూరుమూల, అటవీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా కూడా వివరాలు వెళ్లడం లేదని పేర్కొంటున్నారు. దీనివల్ల రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే నిధులకు కోత పడుతుందని, ఆ మేరకు రాష్ట్రంపై భారం పడే అవకాశం ఉందని అంటున్నారు.

రోజూ 20 స్కూళ్లలో పూర్తిగా బంద్..

ప్రతిరోజూ దాదాపు వేయి స్కూళ్లలో మధ్యాహ్న భోజనం పెట్టనట్లుగా కేంద్రానికి సమాచారం వెళ్తున్నా.. అందులో ముడిసరుకులు, ఆహార ధాన్యాల కొరతతో ప్రతి రోజూ సగటున 20 వరకు స్కూళ్లలోని విద్యార్థులకు భోజనం అందించడం లేదని ప్రధానోపాధ్యాయులు కేంద్రానికి సమాచారం ఇస్తున్నారు. అంటే ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం లేదు.

ఎస్సీలోనూ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ

రౌండ్ టేబుల

ఎక్కడున్నా కోడ్ పట్టేస్తుంది

- గోనె సంచులకూ బార్‌కోడింగ్
- ప్రతీ సంచికి క్యూఆర్ కోడ్ ట్యాగ్
- సంచుల దుర్వినియోగం కాకుండా పౌర సరఫరాల శాఖ చర్యలు
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు

సాక్షి, హైదరాబాద్: ధాన్యం రవాణా, ప్రజాపంపిణీ రవాణా, బియ్యం సరఫరా వంటి అంశాల్లో వినియోగిస్తున్న గోనె సంచుల విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పౌరసరఫరాల సంస్థకు చెందిన గోనె సంచులు దుర్వినియోగం కాకుండా ప్రతీ సంచికి బార్‌కోడింగ్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. దీంతోపాటే ప్రతీ గన్నీ బ్యాగుకు క్యూఆర్ కోడ్ ట్యాగ్‌ను ఇవ్వనుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి వీలుకానుంది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేయడం ద్వారా వచ్చిన సమాచారాన్ని సర్వర్‌లో నిక్షిప్తంచేస్తారు. ఈ విధానం దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమల్లోకి తెస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో ప్రయోగాత్మకంగా సిద్దిపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో, గజ్వేల్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఈ విధానాన్ని త్వరలో ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు.

మార్చడానికి వీలు లేకుండా..

ఈ క్యూఆర్ కోడ్ ట్యాగ్‌ను ఉపయోగించడం ద్వారా గోనె సంచుల వివరాలను మార్చడానికి వీలుండదు. సంచులు ఏ గోదాములో, ఏ జిల్లాల్లో ఉన్నాయి, ఏ రేషన్ షాపు వద్ద వీటిని వినియోగిస్తున్నారు వంటి వివరాలు పౌరసరఫరాలశాఖ వద్ద ఉంటాయి. ఈ గోనె సంచులను ఒకటి, రెండు సార్లు లేదా మల్టీ యూజ్‌గా ఉపయోగించారా? లేదా? అన్న విషయాలు తెలుసుకునే వీలుంది. ఈ గోనె సంచి ఉపయోగించే ప్రతి సందర్భంలోనూ స్కాన్ చేసి దాని వివరాలు అందుబాటులో ఉంచుతారు. ఈ విధానానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీగా నామకరణం చేశారు. నిజానికి ఒక్కో గోనెసంచి కోసం ప్రభుత్వం రూ.50 ఖర్చు చేస్తుంది. ప్రతీసీజన్‌లో ధాన్యం కొనుగోలు సమయంలో పౌరసరఫరాలశాఖ గోనెసంచులను కొనుగోలు చేసి మిల్లర్లకు అందజేస్తోంది. మిల్లర్లు ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి బియ్యాన్ని సంచుల్లో నింపి ప్రభుత్వానికి అందజేస్తారు. అయితే మిల్లర్లకు కేటాయించిన ధాన్యానికి సరిపడా సంచులు ఇవ్వాల్సిన జిల్లా మేనేజర్లు..అవసరమైన దానికన్నా ఎక్కువ మొత్తంలో ఇస్తూ అవకతవకలకు పాల్పడుతున్నారు. పైగా కస్టమ్ మిల్లింగ్ పెండింగ్‌లో ఉండటం, ఇచ్చిన గోనెసంచులు తిరిగి వెనక్కి రాకపోవడం, దీంతో మళ్లీ సీజన్‌లో కొత్త బ్యాగులను కొనివ్వాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ విధంగా ఏకంగా ఆరేళ్లలో కొన్ని కోట్ల గోనెసంచులు లెక్కాపత్రం లేకుండా మాయమయ్యాయి. మరోవైపు ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కోసం దాదాపు కావాల్సిన 12 కోట్ల గన్నీ సంచులను అందుబాటులో ఉంచారు. ఈ సంచుల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా బార్‌కోడింగ్, క్యూఆర్ కోడ్ ట్యాగ్‌ను ప్రవేశపెట్టారు.

మున్సిపోల్స్‌కు సంసిద్ధులై ఉండండి

జిల్లా కలెక్టర్లు, కమిషనర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 31న మున్సిపల్ ఎన్నికలపై కోర్టు తీర్పుకు లోబడి అప్పటి పరిస్థితులను బట్టి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని మరోసారి సరిచూసుకోవాలని, అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించింది. హైకోర్టు తీర్పు వచ్చాక మరోసారి భేటీ అయ్యి తదుపరి చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎస్ఈసీ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినందున, మళ్లీ ఆయా ఏర్పాట్లను సరిచూసుకుని, సమీక్షించుకోవాలని పేర్కొంది. ఎన్నికల విధుల కోసం రూపొందించుకున్న జాబితాల్లోని ఉద్యోగులు ఎవరైనా రిటైరైనా, హోదాలు మారినా వారి స్థానంలో ఇతర ఉద్యోగులను తీసుకోవాలని తెలిపింది. మంగళవారం ఎస్ఈసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈసీ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి పాల్గొన్నారు. రాష్ట్రంలోని మొత్తం 9 మున్సిపల్ కార్పొరేషన్లు, 120 మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికల్లో భాగంగా మొత్తం 3,103 వార్డులలో 8,056 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతీ 800 మందికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ వి.నాగిరెడ్డి వెల్లడించారు. మీర్‌పేట కార్పొరేషన్‌లో వార్డుల విభజన జరగని కారణంగా ఎన్నికలు జరగడం లేదని చెప్పారు. మరోసారి మున్సిపల్ వార్డుల పునర్విభజన చేపడితే బావుంటుందని వీడియో కాన్ఫరెన్స్‌లో ఒక రిద్దరు సూచించినప్పటికీ, గతంలో చేసిన వార్డుల విభజనే కొనసాగుతుందని ఎస్ఈసీ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది.

నేడు, రేపు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని, అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కోమోరిన్, దాని పరిసర ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉన్నందున దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

YVRAO - HYD
NEET
Long Term 15 Students Spl. Batch
Get Personal Demo then decide
9100060601,602

ఆర్టీఐ సుధాకర్‌రావు కన్నుమూత

సాక్షి,హైదరాబాద్: సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ కె.సుధాకర్‌రావు(72) మంగళవారం ఉదయం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుధాకర్‌రావు తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురికావటంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. సుధాకర్‌రావుకు భార్య,కుమార్తె,కుమారుడు ఉన్నారు. అమెరికాలో ఉన్న కుమారుడు వచ్చాక ఈనెల 31న ఉదయం జూబ్లిహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆదిలాబాద్ జిల్లా మందమర్రికి చెందిన సుధాకర్‌రావు గుల్బర్గాలో ఇంజనీరింగ్ చేసే రోజులనుంచి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో సన్నిహితంగా ఉండేవారు. వైఎస్ సీఎం కాగానే సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా అవకాశమిచ్చారు. కాగా, సుధాకర్‌రావు మరణవార్త తెలిసిన వెంటనే సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేవీపీ రామచందర్‌రావు, ఆర్టీఐ మాజీ కమిషనర్ ఆర్.దిలీప్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కె.సుధాకర్‌రావు మృతి పట్ల ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com